



నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
ఆదివారం | 11 మార్చి 2018 | విజయవాడ
సంపుటి 11 | సంచిక 135
పేజీలు 12+16+16 | వెల: రూ. 6.00
Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi




అనుగ్రహం

శ్రీ హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయనం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, బహళ పక్ష తిథి : నవమి ఉ.8.54, మూల ఉ.6.59, వర్జ్యం సా.5.40 నుంచి 7.26 వరకు, రాహుకాలం: సా.4.30 నుంచి 6.00 వరకు; దుర్ముహూర్తం: సా.4.25 నుంచి 5.13 వరకు, సూర్యోదయం : ఉ.6.31 గం; సూర్యాస్తమయం: సా. 6.22 గం.

# పెద్దల సభకు బీసీలను పంపేనా?

- బీసీలే వెన్నెముక అని చెప్పుకునే తెలుగుదేశం
- రాజకీయ పదవులు అంతంత మాత్రమే
- ఈసారైనా బీసీలకు దక్కేనా?
- పార్టీ ముఖ్యనేతలతో చంద్రబాబు భేటీ
- రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపై బాబు కసరత్తు
- మరోసారి అవకాశమివ్వాలని కోరిన దేవేందర్‌గౌడ్
- రెండు టీడీపీకి, ఒకటి వైసీపీకి ఖరారు




*బీసీలే తమ పార్టీకి వెన్నెముక అని చెప్పుకునే తెలుగుదేశం పార్టీ పెద్దల సభకు బీసీలను పంపుతారా ? లేదా అన్న సందిగ్ధానికి నేడు తెరపడనుంది. జనాభాపరంగా బీసీలకు ప్రాతినిధ్యం ఇస్తామని పదేపదే చెబుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదిశగా దృష్టి సారించినట్లు సమాచారం. అభ్యర్థులను ఎంపిక చేసి సోమవారం నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉండడంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించారు.*

అమరావతి, సూర్య ప్రధాన ప్రతినిధి : ఉన్న రెండు సీట్ల కోసం పార్టీలో సీనియర్ నేతల నుంచి ఎక్కువ పోటీ ఉన్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ నేతలతో చర్చించి నిర్ణయం ప్రకటించనున్నారు. బీసీ సామాజిక వర్గం నుంచి అవకాశమివ్వాలని బీద మస్తాన్ రావు ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి కోరారు. ఈ మేరకు ఆ జిల్లాకు చెందిన మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పొంగూరు నారాయణ, ఇతర శాసనసభ్యులు కూడా మస్తాన్‌రావును రాజ్యసభకు పంపాలని సీఎంను కోరారు. అమరావతి సచివాలయంలో శనివారం సీనియర్ మంత్రులు, పార్టీ ముఖ్యనేతలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమావేశమయ్యారు. తాజా రాజకీయ పరిణామాలు, రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక తదితర అంశాలపై సమావేశంలో కీలకంగా చర్చిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో తెలుగుదేశం తమ మూడో అభ్యర్థిని నిలబెట్టదని ప్రచారం ఉన్నా అధికారికంగా ఇంతవరకూ ఎలాంటి స్పష్టతను అధిష్ఠానం ఇవ్వలేదు. పార్టీ తరపున ఇద్దరినే నిలబెట్టాలా లేదా మూడో అభ్యర్థిని కూడా బరిలోకి దించాలా అనే అంశంపై ఓ స్పష్టత వచ్చాక అప్పుడు అభ్యర్థులు ఎవరనే దానిపై కసరత్తు చేయనున్నట్లు సమాచారం. ఆదివారం అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది. రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపై ముఖ్యమంత్రి చంద్రబాబు కసరత్తు మొదలుపెట్టారు. మంత్రులు యనమల, కళా వెంకట్రావు, ఇతర పార్టీ నేతలతో సమాలోచనలు జరిపారు. మరోవైపు ఆదివారం జరగాల్సిన పొలిట్‌బ్యూరో సమావేశం రద్దు కావడంతో ఆదివారమే అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది. ఈ నెల 23న రాజ్యసభ ఎన్నికలు జరుగనున్నాయి. తమ పార్టీ తరపున ఇద్దరు అభ్యర్థులను బరిలో దించేందుకు సీఎం చంద్రబాబు కసరత్తు ప్రారంభించారు. ఏపీలో ముగ్గురు అభ్యర్థులకు రాజ్యసభకు ఎంపికయ్యే అవకాశం ఉంది. అందులో వైసీపీ ఒక అభ్యర్థిని ఇప్పటికే నిర్ణయించింది. రెండు రోజుల క్రితం వైసీపీ తరపున వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఇక టీడీపీ తరపున ఇరువురు అభ్యర్థులను ఎంపిక చేయాల్సి ఉంది. ఈ అభ్యర్థుల కోసం పొలిట్‌బ్యూరో సమావేశం ఏర్పాటు చేసి సభ్యులందరి అభిప్రాయాలు సేకరించి నేతలను ఎంపిక చేయడం సర్వసాధారణం. ఈ క్రమంలో పొలిట్‌బ్యూరో సమావేశం ఏర్పాటు చేశారు. అయితే పొలిట్‌బ్యూరో సమావేశాన్ని రద్దు చేసిన సీఎం అభ్యర్థుల ఎంపిక కోసం కసరత్తు మొదలుపెట్టారు. పార్టీ సీనియర్ నేతలు ఆంధ్రప్రదేశ్ తెలుగు దేశం అధ్యక్షులు కళావెంకట్రావ్, ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడితో సమాలోచనలు జరి పారు. పార్టీలోని పలువురి పేర్లను పరిశీలి స్తున్నారు. ఆదివారం అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది.నేడు టీడీపీ

మిగతా 6లో

## ఏ ప్రాంతమూ
# ప్రత్యేకం కాదు



- ఒక్కప్రాంతాన్నే పట్టుకుని వేలాడలేను
- అన్ని రాష్ట్రాల సామాజికాభివృద్ధే నా లక్ష్యం
- వెనుకబడిన ప్రాంతాలను గుర్తించి సాయం చేస్తా
- సెంటిమెంట్ ఉందనో రాజకీయ కారణాలతోనో ప్రత్యేకంగా చూసేది లేదు
- కొత్త విషయాలు నేర్చుకోండి
- పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో ప్రజా ప్రతినిధుల సదస్సు
- సదస్సును ఉద్దేశించి ప్రసంగించిన ప్రధాని నరేంద్ర మోడీ
- పాల్గొన్న స్పీకర్ సుమిత్రా మహాజన్

న్యూఢిల్లీ : సామాజిక అభివృద్ధి అంటే, దేశంలోని అన్ని ప్రాంతాలనూ సమానంగా చూస్తూ సర్వతోముఖాభివృద్ధి దిశగా నడిపించడమే తప్ప, ఏదో ఒక్క ప్రాంతాన్ని పట్టుకుని వెళ్లడం కాదని ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారు. ప్రజల్లో సెంటిమెంట్ ఉందనో లేక, మరేదైనా రాజకీయ కారణాలతో ఓ ప్రాంతాన్ని ప్రత్యేకంగా చూసేది లేదని ఆయన అన్నారు. పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో శనివారం ఉదయం జాతీయ ప్రజా ప్రతినిధుల సదస్సు ప్రారంభం కాగా, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రజా ప్రతినిధులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు కొత్త విషయాలను నేర్చుకోవాలని పిలుపు ఇచ్చిన మోడీ అన్ని ప్రాంతాలూ అభివృద్ధి చెందినప్పుడే సామాజిక న్యాయం సాధ్యమని గుర్తెరగాలని అన్నారు. పోటీతత్వం వల్ల దేశాలు, రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఇండియాలో కొన్ని జిల్లాలు అభివృద్ధి పథంలో ఉంటే, మరికొన్ని వెనుకబడి ఉంటాయని, వాటిని గుర్తించి మరింత సాయం చేయడం ద్వారా లోపాలను సరిదిద్దుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంటుందని వెల్లడించారు. ఈ సదస్సుకు మోడీతో పాటు స్పీకర్ సుమిత్రా మహాజన్, కేంద్ర మంత్రులు హాజరయ్యారు.

## విమానయాన శాఖ సురేష్ ప్రభుకు



- అదనపు బాధ్యతలు అప్పగింత
- ఉత్తర్వులు జారీ చేసిన పీఎంఓ
- ఏపీ నుంచి రాజ్యసభకు సురేష్

వివరాలు లోపలి పేజీల్లో

# హోదా పోరు చంద్రబాబుదా?

- చీరాల బహిరంగ సభలో వై.ఎస్.జగన్
- బాబు నటనకు ఆస్కార్ దక్కాలి
- టీడీపీ సర్కార్ నాలుగేళ్లుగా రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడలేదు
- రాజీనామాలను చంద్రబాబు 2015లో చేయించి ఉంటే హోదా వచ్చేది
- అసెంబ్లీలో మాత్రం టీడీపీ, బీజేపీ నేతల పరస్పర ప్రశంసలు
- మరి ఇదేంటి చంద్రబాబు ?

(చీరాల నుంచి సూర్య పొలిటికల్‌బ్యూరో ప్రత్యేక ప్రతినిధి) : భారతీయుల ఉక్కుపిడికిలికి జడిసిన బ్రిటిష్ వాడు పోతుపోతూ ఇది నేనిచ్చిన స్వాంత్ర్యం అంటే ఎలా ఉండేదో సరిగ్గా చంద్రబాబు నాయుడి తీరు అలా ఉందని వైఎస్ జగన్ అన్నారు. హోదా విషయంలో నాలుగేళ్లపాటు రోజుకో నాటకమాడిన ముఖ్యమంత్రి ఇప్పుడు ప్రజాభీష్టానికి తలొగ్గక తప్పలేదని, అయినా సరే, తానే హోదా పోరాటం చేశానని చెప్పుకోవడం ఆయన సిగ్గుమాలినతనానికి నిదర్శనమని మండిపడ్డారు. ఇప్పటికైనా హోదా మాటెత్తిన టీడీపీ కేంద్రంపై అవిశ్వాసం తీర్మానంలో కలిసి రావాలని పిలుపునిచ్చారు. 108వ రోజు ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా ప్రకాశం జిల్లా చీరాల పట్టణం క్లాక్‌టవర్ సెంటర్‌లో బహిరంగ సభను ఉద్దేశించి వైఎస్ జగన్

మిగతా 6లో



# ఫ్రాన్స్‌తో 14 ఒప్పందాలు

- సంతకాలు చేసిన ఇరు దేశాల ప్రతినిధులు
- 13 బిలియన్ యూరోల కాంట్రాక్టుల మీద ఇరు దేశాలు సంతకాలు
- రక్షణ, శాస్త్ర సాంకేతిక, మౌలిక వసతుల రంగాల్లో ఫ్రాన్స్ భారీ పెట్టుబడులు
- హిందూ మహాసముద్ర తీర ప్రాంతాల భద్రతపై చర్చ
- ఇరు దేశాల మధ్య రక్షణ సహకారానికి ప్రాధాన్యం

5లో




సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

## బీసీలంటే
# ఓటు బ్యాంకేనా?

- అధికారం కోసమే రాజకీయ పార్టీల నజరానాలా?
- బడుగులకు రాజ్యాధికారం అందని ద్రాక్షేనా?
- పార్లమెంట్‌లో బీసీ బిల్లు ఎందుకు ప్రవేశపెట్టడం లేదు?
- జనాభా ప్రకారం చట్ట సభలలో రిజర్వేషన్లు పెంచాలి
- విద్య, ఉద్యోగ రంగాలలో 56 శాతానికి పెంచాలి
- స్థానిక సంస్థల ఎన్నికల్లో 56 శాతానికి పెంచాలి

*స్వాతంత్ర్యం సిద్ధించి 70 ఏళ్లు పూర్తయినా బడు గులు రాజ్యాధికారానికి ఇంకా ఆమడ దూరం లోనే ఉంటున్నారు. పార్లమెం టులో బీసి బిల్లును ప్రవేశపెట్టేందుకే రాజకీయ పార్టీలు జంకుతున్నట్లు కనబడుతోంది. జనాభా ప్రకారం చట్ట సభలలో రిజర్వేషన్లు పెంచాలన్న ధ్యాస కూడా ప్రధాన రాజకీయ పార్టీలకు లేదు.*



హైదరాబాద్, మేజర్‌న్యూస్ః బీసీలు జనాభాలో అత్యధిక శాతం ఉన్నా.. అన్ని రంగాలలో ఇంకా అణచి వేతకు గురువుతూనే ఉన్నారు. నేటికీ ఓటు బ్యాంకుగానే పరిగణిస్తోన్న ప్రధాన రాజకీయ పార్టీలు వేసే ఎత్తుగడలకు.. ఐక్యత లేని కారణంగా బడుగు జీవులు బలవుతూనే ఉన్నారు. అధికారం చేపట్టిన నాటి నుంచి ఆయా ప్రభుత్వాలు ప్రవేశపెట్టే వార్షిక బడ్జెట్‌లలో అరకొర నిధులు కేటాయిస్తూ..కాలం వెళ్లదీస్తున్నారు. ఎన్నికల సందర్భంగా ఆయా రాజకీయ పార్టీలు విడుదల చేసే మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలను అమలు చేసేందుకు కూడా అధికారం చేపట్టిన ఆయా ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తూనే ఉన్నాయి. జనాభా లెక్కలు ఉంటే..రిజర్వేషన్లు పెంచుకోవచ్చని కూడా సుప్రీం కోర్టు వెల్లడించింది. చట్ట సభల రిజర్వేషన్లు దేవుడెరుగు..? విద్యా, ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్లు ఎందుకు పెంచడం లేదని బీసీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక సంస్థలల్లో కూడా రిజర్వేషన్లు పెంచుతామని హామీలు గుప్పించి వాటిపై ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడుతున్నారు. బీసీల రిజర్వేషన్లు పెంచేందుకు అటు ఏపీలోని చంద్రబాబు ప్రభుత్వం,

మిగతా 6లో

## అంతా ఇంతే!




అప్పటి మిలియన్ మార్చ్‌లో సైతం ఆయన్ని అరెస్ట్ చేయలేదు.

## మంచు తుపాను బీభత్సం
# చీకట్లో మగ్గిపోతున్న అమెరికా



- అంధకారంలో 50 లక్షల మంది
- అమెరికాలో ఎన్నడూ లేని పరిస్థితులు
- విద్యుత్ లేక, కనీస అవసరాలు తీరక ప్రజలు ఇబ్బందులు
- వచ్చే వారం మరో మంచు తుపాను
- వేలాది విమానాలు రద్దు

వివరాలు 11లో

# బీసీలు సమష్టిగా ముందుకెళితేనే అభివృద్ధి

## టీ-పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మల్లు భట్టి విక్రమార్క

హైదరాబాద్, మేజర్‌న్యూస్ : కాంగ్రెస్ పార్టీవల్లే దళిత, బహుజన, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మల్లు భట్టివిక్రమార్క అన్నారు. శనివారం మహబూబ్ నగర్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా మల్లుభట్టివిక్రమార్క మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బీసీలు ఆర్థిక, సామాజిక, విద్య, ఉద్యోగాలతోపాటు అన్ని రంగాల్లో ముందున్నారన్నారు. కానీ టీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని దశాబ్దాల వెనక్కు నెట్టిందని మండిపడ్డారు. అధికారంలో ఉన్నా లేకున్నా.. కాంగ్రెస్ ప్రజల అభివృద్ధికి పాటుపడుతుందన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో బీసీ విద్యార్థుల్ని ఉన్నత చదువులు చదివేలా ప్రోత్సహించామని, దాంతో వారు ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారని అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ లో ఐఐటీ, ట్రిపుల్ ఐటీ వంటి విద్యాసంస్థలను తీసుకువస్తే టీఆర్‌ఎస్ ప్రభుత్వం బీసీలకు గొర్రెలు, బర్రెలు అంటూ తప్పుదోవ పట్టిస్తుందని ఆరోపించారు. బీసీలు సమష్టిగా ముందుకు వెళితేనే ఆర్థిక, రాజకీయ, సామాజికంగా ఎదుగుతామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ పార్లమెంట్ సభ్యుడు వి. హనుమంతరావు, బీసీ నేత చిత్తరంజన్ దాస్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రశ్నార్థకంలో తెలంగాణ టీడీపీ!

- రాష్ట్రంలో నానాటికీ కొడిగడుతున్న టీడీపీ
- రేవంత్ బాటలోనే ఒంటేరు.. మరికొందరు బీసీ నేతలు కూడా
- ఎన్నికల్లో పోటీచేసే స్థాయి నేతలు కరవు
- జిల్లా అధ్యక్ష పదవికీ దొరకని నాయకులు
- రాజకీయ భవిష్యత్ చూసుకుంటున్న నేతలు
- పాలనలో చంద్రబాబు బిజీ బిజీ
- తెలంగాణ పార్టీకి సమయం ఇవ్వని బాబు



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: దేశ రాజకీయాలను శాసించిన తెలుగుదేశం పార్టీ పరిస్థితి తెలంగాణాలో ప్రశ్నార్థకంగా మారింది. పార్టీ స్థాపించినప్పటి నుంచి అధికారంలో, ప్రతిపక్షంలో ప్రజా సమస్యలకు పెద్దపీట వేసిన పార్టీకి తెలంగాణాలో నేతలు కరువవుతున్నారు. రాష్ట్రంలో బలమైన కేడర్‌తో నిండుకుండలా ఉన్న తెలుగుదేశం పార్టీ నేడు కుండబద్ద లవుతోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలుగుదేశం పార్టీ పరిస్థితి నానాటికీ తీసికట్టుగా మారుతోంది. తెలంగాణ ఏర్పాటైనప్పటి నుంచి ఆ పార్టీ నుంచి వెళ్లిపోయే వారే తప్ప వచ్చే వారు లేకపోవడం, పార్టీని నమ్ముకున్న కొద్దిమంది నేతలు, కేడర్‌లో ధైర్యం కల్పించే దిక్కు లేకపోవడంతో రాజకీయ భవిష్యత్ వెదుక్కొంటూ ఇతర పార్టీలలో చేరిపోతున్నారు, అసలు వచ్చే ఎన్నికలలో పోటీ చేసేందుకు అభ్యర్థులను కూడా వెతుక్కోవాల్సిన దుస్థితి ఉందని అంటున్నారు. ఏపీ పాలనలో బిజీ..బిజీగా గడుపుతున్న పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు తెలంగాణ పార్టీ అభివృద్ధికి పెద్దగా సమయం ఇవ్వడంలేదన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. జీవచ్ఛవంలా మారిన పార్టీని పునర్జీవనం పోషేందుకు చంద్రబాబునాయుడు ప్రత్యేకంగా సమయం ఇవ్వడంతో పాటు పార్టీ నేతలకు మనోధైర్యం ఇవ్వాల్సి ఉందంటున్నారు. అలాగే ద్వితీయ శ్రేణి నేతలను వచ్చే ఎన్నికలకు సన్నద్ధం చేసే చర్యలు సైతం తీసుకోవాలంటున్నారు. ప్రతి నెలలో మూడు రోజులు తెలంగాణ తెలుగుదేశం పార్టీకి చంద్రబాబునాయుడు సమయం ఇస్తే పార్టీ బలపడే అవకాశం ఉందని రాష్ట్ర పార్టీ నేత ఒకరు 'సూర్య'కు తెలిపారు.

వలసలతో బెంబేలు : తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు నుంచే టీడీపీ నుంచి వలసలు మొదలయ్యాయి. ప్రస్తుతం మంత్రులుగా ఉన్న కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, జోగు రామన్న, పట్నం మహేందర్‌రెడ్డిలతోపాటు ఎర్రబెల్లి దయాకర్ రావు వంటి కీలక నేతలందరూ టీడీపీ నుంచి వెళ్లిపోయారు. 2014 ఎన్నికల్లో టీడీపీ నుంచి గెలిచిన 12 మంది ఎమ్మెల్యేలు, ఒక్క లోక్‌సభ సభ్యుడు కూడా మెల్లగా టీఆర్‌ఎస్ బాట పట్టారు. టీఆర్‌ఎస్‌పై ఒంటికాలుతో పోరాటం చేస్తున్నాడనుకునే నాయకుడు రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. దీంతో ఆ పార్టీలో నోరున్నోళ్లంతా వెళ్లిపోగా..ఇక నోరులేనోళ్లు మాత్రమే ఉన్నారంటూ కార్యకర్తలు అంటున్నారు. మెదక్ జిల్లా నేత, తెలుగురైతు రాష్ట్ర అధ్యక్షుడు ఒంటేరు ప్రతాపరెడ్డి కూడా త్వరలోనే పో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంటారన్న వార్తలు వస్తున్నాయి. ఇక మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, అన్నపూర్ణమ్మ కూడా పార్టీ మారే యత్నంలో ఉన్నట్లు సమాచారం. వీరి బాటలోనే మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు సైతం కాంగ్రెస్ తలుపులు తట్టారన్న వార్తలు వినిపిస్తున్నాయి. చివరగా ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, ఆర్.కృష్ణయ్యలతోపాటు జిల్లాల మూడు, నాలుగు నియోజకవర్గాల నేతలు, జిల్లాకు ఒకరి ద్దరు ముఖ్యనేతలు మాత్రమే టీటీడీపీలో కొనసాగుతుండడం గమనార్హం. ఎన్నికలు సమీపించేనాటికి వీరిలో ఎవరు ఉంటారో ఎవరు వెళ్తారోనన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

# వచ్చే ఎన్నికల్లో కైకలూరు స్థానం టీడీపీకేనా?

- కామినేని రాజీనామాతో కార్యకర్తల్లో నిరుత్సాహం
- సీటు కోసం స్పీడు పెంచిన టీడీపీ నేతలు
- నేడు విజయవాడలో బీజేపీ కోర్ కమిటీ సమావేశం



వెలగపూడి, సూర్య ప్రత్యేక ప్రతినిధి : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కైకలూరు స్థానం నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగేందుకు టీడీపీ నేతలు సన్నద్ధమవుతున్నారు. మంత్రి పదవికి కామినేని శ్రీనివాస్ రాజీనామా చేయడంతో ఇక ఆస్థానం తమదేనన్న ధీమాలో తెలుగు తమ్ముళ్లు ఉన్నారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా పదవిలో కొనసాగిన కామినేని శ్రీనివాస్ రాజీనామా చేయడంతో కైకలూరు నియోజకవర్గంలో భవిష్యత్ రాజకీయాలు ఎలా ఉంటాయన్నది చర్చనీయాంశమైంది. కేంద్ర, రాష్ట్రాల మధ్య విభజన హామీలు, ఇతర అంశాల్లో విభేదాలు బీజేపీపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి. నియోజకవర్గంలో నాలుగేళ్లుగా కామినేని హవా నడవడం, ఆ పార్టీకి స్వతహాగా నాయకత్వమూ లేదు. నియోజకవర్గంలో బీజేపీ నాయకుల్లో చాలా మందికి గుర్తింపు లేదు. 2014 ఎన్నికల సమయంలో కామినేని వెంట ఉన్న అనుచరుల హవా ఎన్నికల అనంతరం బాగా పెరిగింది. బీజేపీతో పొత్తు ఉన్నప్పటికీ అధికార తెలుగుదేశం నాయకులు మాత్రం తమ పార్టీ కార్యక్రమాలను, కార్యకలాపాలను చేసుకుంటూ పోయేవారు. టీడీపీ ఎంపీ మాగంటి వెంకటేశ్వరరావు (బాబు) నాయకత్వంలో నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలు నిర్వహించేవారు. బీజేపీ నాయకులు ఎక్కువ మంది కామినేని పర్యటనల్లో మాత్రమే పాల్గొనేవారు. వాస్తవానికి ఈ నియోజకవర్గంలో పెద్దగా ఉనికి లేని బీజేపీకి, తక్కువ సంఖ్యలో ఉన్న నాయకులకు కామినేనే పెద్దదిక్కుగా ఉండేవారు. ఈ పరిస్థితుల్లో కామినేని రాజీనామా చేయటంతో బీజేపీ నేతలు, కార్యకర్తల్లో గుబులు ప్రారంభమైంది. గతంలో టీడీపీలో ఉన్న వారే కొంతమంది పదవుల పంపిణీల్లో భాగంగా బీజేపీలో చేరారు. ఏఎంసీ పదవులు, సాగునీటి సంఘాల అధ్యక్ష పదవులు, దేవస్థానాల పాలక మండళ్ల ఏర్పాటులో మంత్రి కామినేని సిఫార్సుతో బీజేపీకి కోటా లభించింది. బీజేపీ మంత్రి ఉన్నారు కనుకే నియోజకవర్గంలో పార్టీకి ఉనికి ఉండాలన్న ఉద్దేశ్యంతో కొన్ని పదవులు కేటాయించారు. ఇప్పుడు వీరంతా బీజేపీలో కొనసాగుతారా లేక టీడీపీ వైపు మొగ్గు చూపుతారా అన్నది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. కామినేని మంత్రి పదవికి రాజీనామా చేయటంతో ఆయన అనుచరులు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. ఎందుకంటే కామినేనే వారికి సర్వస్వం. స్వతంత్రంగా పార్టీ కండువాను భుజాన వేసుకుని అధిష్ఠానం దగ్గరకు, ప్రభుత్వ నేతల వద్దకు వెళ్లే పరిస్థితి లేదు. ఆయన మంత్రిగా ఉన్నప్పుడు నాయకుల్లో ఉన్న స్పీడు ఇప్పుడు ఉండదు. ఈ పరిస్థితుల్లో తెలుగుదేశం నాయకులు నియోజకవర్గంలో స్పీడు పెంచే అవకాశాలు కన్పిస్తున్నాయి. 2019 ఎన్నికల్లో బీజేపీతో పొత్తు ఉండదు కనుక నియోజకవర్గంలో ఎమ్మెల్యే పదవికి పోటీ చేసే అవకాశం టీడీపీదే అన్నది పార్టీ నాయకుల అభిప్రాయంగా ఉంది.

# మిలియన్ మార్చ్ స్ఫూర్తి సభ భగ్నం

- కోదండరామ్, చాడతో పాటు పలువురు జేఏసీ నేతల అరెస్టు
- కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణాలో ఇన్ని నిర్బంధాలా?
- నిరంకుశ పాలనకు నిదర్శనమే ఈ అక్రమ అరెస్టులు : కోదండరామ్



హైదరాబాద్, మేజర్‌న్యూస్: తెలంగాణ రాజకీయ జేఏసీ తలపెట్టిన మిలియన్ మార్చ్ స్ఫూర్తి సభను పోలీసులు అడ్డుకుని భగ్నం చేశారు. జేఏసీ ఛైర్మన్ ప్రొఫెసర్ కోదండరామ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దిలీప్ కుమార్‌తో పాటు పలువురు జేఏసీ నేతలను ఎక్కడికక్కడే అడ్డుకుని అరెస్టులు చేశారు. మిలియన్ మార్చ్ స్ఫూర్తి యాత్ర సందర్భంగా తార్నాకలోని కోదండరాం ఇంటి వద్ద భారీగా పోలీసులు మోహరించిన విషయం తెలిసిందే. అయితే ఈ యాత్రలో పాల్గొనేందుకు ఇంట్లోంచి బయటకు వచ్చిన వెంటనే ఆయనను పోలీసులు అరెస్ట్ చేశారు. వాహనంలోంచి దిగడానికి కోదండరాం నిరాకరించడంతో అందులోనే పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఆయనతో పాటు సిపిఐ నాయకులు చాడ వెంకట్ రెడ్డిని కూడా అదుపులోకి తీసుకున్న పోలీసులు ఈ ఇద్దరిని బొల్లారం పోలీస్ స్టేషన్ కు తరలించారు. అరెస్ట్ సమయంలో ఆయన ఇంటివద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. అటు పోలీసులు, ఇటు భారీగా చేరుకున్న జేఏసి నాయకులతో టెన్షన్ వాతావరణం కనిపించింది. అయితే కోదండరాం ట్యాంక్ బండ్ కు చేరుకుంటే విధ్వంసం చేలరేగే అవకాశం ఉందని బావించిన పోలీసులు ఇంటినుండి ఆయన బయటకు రాగానే అదుపులోకి తీసుకున్నారు. సాయంత్రం వరకు కోదండరాం పోలీసుల అదుపులోనే ఉన్నారు.

కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణాలో ఇన్ని నిర్బంధాలా?

ట్యాంక్‌బండ్‌పై మిలియన్ మార్చ్ స్ఫూర్తి సభకు అనుమతి ఇవ్వకపోవటంపై కోదండరాం తీవ్రంగా మండిపడ్డారు. ఇది నిరంకుశ పాలనకు నిదర్శనమన్నారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. నాటి మిలియన్ మార్చ్ జ్ఞాపకాలు ఇంకా కళ్ళముందు కదులుతున్నాయని, నాడు ప్రజలు ఉవ్వెత్తున తరలివచ్చి విజయవంతం చేశారని గుర్తుచేసుకున్నారు. 2011లో ఎన్ని ఆంక్షలు ఉన్నా.. మిలియన్ మార్చ్‌ను విజయవంతం చేసుకున్నామన్నారు. ప్రస్తుతం తెలంగాణాలో సమస్యలు చాలా ఉన్నాయ్. నిరుద్యోగం, రైతు సంక్షోభం నెలకొంది. ప్రభుత్వంపై అన్ని వర్గాల్లో అసంతృప్తి నెలకొంది అని అన్నారు. మిలియన్ మార్చ్ స్ఫూర్తి సభను ఇంతకాలం ప్రభుత్వం నిర్వహిస్తుందేమోనని ఎదురుచూశామని, కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణాలో ఇన్ని నిర్బంధాలు ఉంటాయనుకోలేదని కోదండరామ్ ఆవేదన వ్యక్తం చేశారు.

# రాజ్యసభ ఎన్నికల్లో టీఆర్‌ఎస్‌కు ఎంఐఎం సంపూర్ణ మద్దతు



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: తెలంగాణలో అధికార టీఆర్‌ఎస్‌తో ఎంఐఎంపార్టీ బంధం బలపడుతోంది. అసెంబ్లీలోనూ పలు విషయాల్లో తెలంగాణ ప్రభుత్వంతో సన్నిహితంగా వ్యవహరిస్తున్న ఎంఐఎం తాజాగా రాజ్యసభ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈమేరకు ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ట్వీట్ చేశారు. రాజ్యసభ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థులకు మద్దతు తెలుపాలని ఎంఐఎం నిర్ణయించిందని ఆయన ట్విటర్‌లో పేర్కొన్నారు. ఈ నెల 23న రాజ్యసభ ఎన్నికలు జరగనున్నాయి. తెలంగాణలో మొత్తం మూడు స్థానాలకు రాజ్యసభ ఎన్నికలు జరగనుండగా.. టీఆర్‌ఎస్‌కు సంఖ్యాబలం ఉండటంతో ఈ మూడు స్థానాలూ కైవసం చేసుకునే అవకాశం కనిపిస్తోంది. ఈ నెల 12 వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. 13న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. నామినేషన్లు ఉపసంహరణకు గడువు 15 వరకు ఉంది. 23న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటలకు పోలింగ్ జరుగుతుంది. అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఓట్లను లెక్కించి ఫలితాలు విడుదల చేస్తారు.

ఏకగ్రీవానికి కాంగ్రెస్ చెక్ : ప్రస్తుతం రాష్ట్ర శాసనసభలో ఉన్న సంఖ్యా బలాలను బట్టి మూడు సీట్లు టీఆర్‌ఎస్ ఖాతాలో పడుతాయి. ముగ్గురు రాజ్యసభ అభ్యర్థులు ఏకగ్రీవ ఎన్నికకు అధికార టీఆర్‌ఎస్ పార్టీ పావులు కదుపుతుండగా, కాంగ్రెస్‌పార్టీ వ్యూహాత్మకంగా ఏకగ్రీవానికి చెక్ పెట్టాలని నిర్ణయించింది. కాంగ్రెస్‌కు సంఖ్యా బలం లేకున్నా...పార్టీ నుంచి టీఆర్‌ఎస్‌లో చేరిన సభ్యులను ఇబ్బంది పెట్టేందుకు నిర్ణయించింది. ఇందుకుగాను రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ నుంచి మాజీ ఎంపీ బలరాంనాయక్‌ను పోటీకి దించాలని ఆ పార్టీ నిర్ణయించింది. దీంతో రాష్ట్రంలో రాజ్యసభ ఎన్నికలు అనివార్యంగా కనిపిస్తున్నది. 2014లో ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి 21 మంది ఎమ్మెల్యేలు గెలుపొందారు. వారిలో 7 గురు పార్టీ ఫిరాయించారు. మరో ఇద్దరు సభ్యులు మృతి చెందారు. అయితే ఈ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో అధికార పార్టీకి చెందిన వారు గెలుపొందారు. ప్రస్తుతానికి కాంగ్రెస్‌కు 12 మంది సభ్యుల మద్దతు మాత్రమే ఉంది. అయితే ఈ సంఖ్యతో రాజ్యసభ సీటును కాంగ్రెస్ గెలుచుకునే అవకాశం లేదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# సంస్థాగత బలోపేతానికి శ్రీకారం

- ఏపీలో మారనున్న రాజకీయ ముఖచిత్రం
- వచ్చే ఎన్నికల్లో ఒంటరిగానే బీజేపీ పోటీ
- నేడు విజయవాడలో బీజేపీ కోర్ కమిటీ సమావేశం



విజయవాడ, సూర్య ప్రతినిధి : నవ్యాంధ్రలో భారతీయ జనతాపార్టీ సంస్థాగతంగా బలోపేతమయ్యేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. హోదా విషయంలో కేంద్రం వైఖరితో విసిగిన టీడీపీ కేంద్ర మంత్రులను రాజీనామా చేయించడంతో రాష్ట్ర మంత్రివర్గంలోని ఇద్దరు నేతలు కూడా పదవులకు రాజీనామాలు చేయడంతో వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే పోటీ చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో సంస్థాగతంగా పార్టీ బలపడేందుకు ఇప్పటినుంచే బీజేపీ నేతలు ప్రయత్నాలను ప్రారంభిస్తున్నారు. ఏపీ బీజేపీ కోర్ కమిటి సమావేశం ఆదివారం జరగనుంది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యనేతలతో పాటుగా ఏపీ బీజేపీ ఇన్చార్జ్ సతీష్‌జీ కూడా హాజరుకానున్నారు. భవిష్యత్ కార్యచరణ, తాజా రాజకీయ పరిణామాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. ఏపీలో ప్రత్యేక హోదా సెంటిమెంట్‌గా మారడంతో ప్రజలకు ఎలా సమాధానం చెప్పాలన్నదానిపై నేతలు దృష్టిపెట్టనున్నారు. ఈశాన్య రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ప్రయోజనాలు పొడిగించినా ఏపీకి హోదా ఇచ్చేది లేదని కేంద్ర ఆర్థిక మంత్రి స్పష్టం చేయడంతో ఉద్యమ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలోనే టీడీపీ మంత్రులు కేంద్ర మంత్రి పదవుల నుంచి వైదొలిగారు. తాము ఎన్డీయేలోనే ఉన్నామని టీడీపీ చెబుతున్నప్పటికీ ఈ చెలిమి కూడా ఎంతోకాలం కొనసాగే అవకాశం కనిపించడం లేదు. అందుకే బీజేపీ అగ్రనేతలు రంగంలోకి దిగారు. ఏపీలో ఒంటరిగా పోటీ చేయాల్సిన పరిస్థితి బీజేపీకి ఏర్పడింది. ప్రజల నుంచి వ్యక్తమవుతున్న ఆగ్రహావేశాలను చల్లాచేర్చేందుకు ఈ నాలుగేళ్లలో కేంద్రం, ఏపీకి చేసిన సాయంపై ప్రజలకు వివరించాలని, కరపత్రాలు, పుస్తకాలను పంపిణీ చేయాలని బీజేపీ అధిష్ఠానం దిశానిర్దేశం చేసింది. టీడీపీ ఎక్కువ రోజులు ఎన్డీయే కూటమిలో ఉండబోదని బీజేపీ నేతలకు ఇప్పటికే తెలిసొచ్చింది. వైసీపీతో పెత్తుపెట్టుకుంటే అవినీతి [illegible] అంటుకుంటుందని కొంతమంది నేతలు వాధిస్తున్నారు. ఎన్నికల తర్వాత కేంద్రంలో సీట్లు తగ్గిన పక్షంలో అందుకనుగుణంగా ఆ సమయంలో మద్దతు గురించి ఆలోచించొచ్చని బీజేపీ అధిష్ఠానం భావిస్తోంది. అందుకనే ఒంటరి పోరుకు కార్యకర్తలను, నేతలను మానసికంగా సిద్ధం చేయాలని భావిస్తోంది. కోర్ కమిటి సమావేశం తర్వాత పార్టీ రాష్ట్ర కార్యవర్గం, పదాధికారుల సమావేశం కూడా ఏర్పాటు చేసి సంస్థాగత బలోపేతానికి శ్రీకారం [illegible].



## కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థిగా బలరాం నాయక్
### ఖరారు : సోమవారం నామినేషన్ దాఖలు




హైదరాబాద్, మేజర్‌న్యూస్: రాజ్యసభ అభ్యర్థిని తెలంగాణ కాంగ్రెస్ దాదాపుగా ఖరారు చేసింది. మాజీ కేంద్రమంత్రి బలరాం నాయక్‌ను రాజ్యసభ ఎన్నికల బరిలో దింపాలని కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయించింది. రాజ్యసభ అభ్యర్థిగా బలరాం నాయక్ పేరు ఖరారు చేయడంతో ఆయన సోమవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. తెలంగాణలో ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాలకు ఎన్నికల కమిషన్ ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. తెలంగాణ అసెంబ్లీలో ఉన్న బలబలాలు చూస్తే రెండు రాజ్యసభ స్థానాలను టీఆర్‌ఎస్ సునాయాసంగా కైవసం చేసుకునే అవకాశాలుండగా, . మూడవ స్థానాన్ని టీఆర్‌ఎస్ మిత్రపక్షమైన ఎంఐఎం, పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల మద్దతుతో గెలుచుకునే అవకాశం ఉన్నాయి. 2014లో ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరుపున 21 మంది ఎమ్మెల్యేలు గెలుపొందగా, ఏడు మంది ఎన్నికల అనంతరం పార్టీ ఫిరాయించి, కారెక్కారు. మరో ఇద్దరు సభ్యులు మృతి చెందారు. అయితే ఈ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో అధికార పార్టీకి చెందిన అభ్యర్థులు విజయం సాధించారు. ప్రస్తుతానికి కాంగ్రెస్‌కు 12 మంది సభ్యుల మద్దతు మాత్రమే ఉండగా, రాజ్యసభ సీటును కాంగ్రెస్ గెలుచుకునే

## టఫ్ వన్ బాస్ అంటున్న కేటీఆర్!




హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: తెలంగాణ ఐటి, పరిశ్రమలు, పురపాలన, పట్టణాభివృద్ధి, మైనింగ్‌శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు ట్విటర్‌లో యాక్టివ్‌గా ఉంటారు. తనను ఉద్దేశించి.. తనను ట్యాగ్ చేసి ఎవరు ట్వీట్ చేసినా.. చాలావరకు బదులు ఇస్తుంటారు. దీంతో రోజురోజుకు ఆయన ట్విటర్ ఖాతాకు విజ్ఞాపనలు, ఫిర్యాదులు పెరిగిపోతున్నాయి. చాలామంది తన సాయం కోసం చేస్తున్న ట్వీట్లకు కేటీఆర్ కూడా బదులిస్తున్నారు. ట్విట్టర్ ద్వారా చేసిన ఫిర్యాదులపై వెంటనేస్పందిస్తుండడంతో కేటీఆర్‌కు ట్విట్టర్ ద్వారా ఫిర్యాదుల పరంపర కొనసాగుతున్నది. తాజాగా కేటీఆర్ దృష్టికి ఒక ఆసక్తికరమైన ట్వీట్ వచ్చింది. దానిని రీట్వీట్ చేస్తూ టఫ్ వన్ (కష్టమైంది) బాస్ అంటూ బదులిచ్చారు. ఇంతకీ ఆ ట్వీట్ ఏమిటంటే..కేటీఆర్ సార్.. నేను శాకాహారిని. నేను ఇడ్లీ, దోసా, అన్నం.. ఇలా ఏదీ తిన్నా జీఎస్టీ కట్టాల్సి వస్తోంది. మా బోడుప్పల్‌లో హోటళ్లు రాత్రి 10 గంటలవరకు మాత్రమే తెరిచి ఉంటున్నాయి. ఇక నా స్నేహితుడు హైదరాబాద్ పాతస్తీలో నాన్ వెజ్ తింటాడు. బిర్యానీ తిన్నా, రోటీ తిన్నా జీఎస్టీ కట్టాల్సిన అవసరం లేదు. హోటళ్లు 24 గంటలూ తెరిచి ఉంటాయి.. నాయ్యం చేయండి సార్ అంటూ ఎంబీ ప్రకాశ్ చేసిన ట్వీట్‌కు కష్టమే బాస్ కేటీఆర్ బదులిచ్చారు.

## బడ్జెట్ సమావేశాల్లో కీలక బిల్లులు
### పంచాయతీ రాజ్ బిల్లు, ఇంటర్ వరకు తెలుగు తప్పనిసరి
### రాష్ట్రానికే పోలీస్ బాస్ ఎంపిక బిల్లు




హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్య సాకారం, ఇంటర్ వరకు తెలుగుభాష తప్పనిసరి, రాష్ట్రానికే పోలీసుబాసు ఎంపిక, అధికారం వంటి కీలక బిల్లుల్ని బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశ పెట్టేందుకు సర్కారు సిద్ధమైంది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి కొత్త బడ్జెట్‌కు అనుగుణంగా ద్రవ్య వినిమయ బిల్లుతోపాటు మరో ఏడు ఎనిమిది బిల్లులు ప్రవేశ పెట్టే అవకాశం ఉంది. సోమవారం నుంచి రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగంతో ప్రారంభమయ్యే సమావేశాల్లో వచ్చే ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను ప్రవేశ పెడతారు. బడ్జెట్‌కు అనుగుణంగా 2018-19 ఆర్థిక సంవత్సరానికి ద్రవ్య వినిమయ బిల్లును కూడా ఉభయసభల్లో ప్రవేశ పెడతారు. ద్రవ్యవినిమయ బిల్లు సహా మరికొన్ని కీలక బిల్లులు బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.

## హోదాపై మాట తప్పిన కేంద్రం
### ఏపీ గనుల శాఖ మంత్రి సుజయకృష్ణ రంగారావు



విజయనగరం, సూర్య ప్రతినిధి : విభజన హామీలు అమలు చేస్తామన్న కేంద్రం మాట తప్పిందని ఏపీ గనుల శాఖ మంత్రి సుజయకృష్ణ రంగారావు మండిపడ్డారు. నాలుగేళ్లుగా సాయం కోసం ఎదురు చూశామని, ఎంత ఒత్తిడి తెచ్చినా కేంద్రం పట్టించుకోలేదన్నారు. కేంద్రం ఆఖరి బడ్జెట్‌లోనూ ఏపీకి అన్యాయం చేసిందని ఆరోపించారు. ఆంధ్రుల మనోభావాలు దెబ్బతీసేలా జైట్లీ మాట్లాడారన్నారు. పోలవరాన్ని పూర్తిచేస్తామన్న కేంద్రం ఇప్పుడు అడ్డంకులు సృష్టిస్తోందని, కేంద్రం ఏపీపై కక్ష సాధిస్తోందని మంత్రి సుజయకృష్ణ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

## స్వలాభం కోసం పుట్టిన పార్టీ వైసీపీ
### ఏపీ విద్యుత్ శాఖ మంత్రి కళా వెంకట్రావు




అమరావతి, సూర్య ప్రతినిధి : స్వలాభం కోసం పుట్టిన పార్టీ వైసీపీ అని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి కళా వెంకట్రావు ఆరోపించారు. బీజేపీని మచ్చిక చేసుకునేందుకు వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి యత్నిస్తున్నారని, ప్రజాప్రయోజనాల కోసం వైసీపీ పోరాడటం లేదని ఆయన విమర్శించారు. జగన్ ఆస్తుల కేసులో ఈడీ అటాచ్‌చేసిన ఆస్తులను విడుదల చేయించుకున్నారని, కేసుల మాఫీకి వైసీపీ చేస్తున్న ప్రయత్నాలు ప్రజలకు తెలుసన్నారు. వైసీపీ నేతలకు ప్రజలే బుద్ధి చెప్తారని కళా హెచ్చరించారు.

## మాట తప్పడమే.. తెలంగాణ మోడలా: బీజేపీ

హైదరాబాద్, మేజర్‌న్యూస్: సీఎం కేసీఆర్ తెలంగాణ మోడల్ దేశవ్యాప్తం కావాలని అంటున్నారని, మాట తప్పడం, ఇచ్చిన హామీని అమలు చేయకపోవడమే తెలంగాణ మోడలా..? అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రావుల శ్రీధర్ రెడ్డి ప్రశ్నించారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ దళితుడ్ని ముఖ్యమంత్రిని చేస్తానని మాట తప్పారని అన్నారు. దళితులకు మూడెకరాల భూ పంపిణి, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వకుండా పేదలను మోసం చేస్తున్నారని విమర్శించారు. సెక్రటేరియట్‌కు రాకుండా ఫామ్ హౌస్ నుంచి పరిపాలన చేస్తున్నారని, కుటుంబ పాలన నిర్వహించడం తెలంగాణ మోడలా అని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికలల్లో ఈ కేసీఆర్ మోడల్‌కు ప్రజలు ముగింపు పలుకనున్నారని, రాష్ట్రాభివృద్ధి కోసం పనిచేయగలిగే బీజేపీ మోడల్‌ను ముందుకు తేవడం ఖాయమని శ్రీధర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.



# సామాజికాభివృద్ధిలో దేశానికి తెలంగాణ ఆదర్శం

## బహ్రైన్‌లో ఎన్నారై టీఆర్ఎస్

హైదరాబాద్, మేజర్‌న్యూస్: సామాజికాభివృద్ధిలో దేశానికే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని టీఆర్ఎస్ ఎన్నారై విభాగం పేర్కొంది. బహ్రైన్‌లో ఎన్నారై టీఆర్ఎస్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎన్నారై టీఆర్ఎస్ సెల్ అధ్యక్షుడు రాదారపు సతీష్‌కుమార్ మాట్లాడుతూ దేశంలో కాలానుగుణంగా చాలామార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలందరి సామాజికాభివృద్ధి లక్ష్యంగానే రాజకీయాలు సాగాలని అన్నారు. ఈ విషయంలో ప్రస్తుతం దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తోందని చెప్పారు. నూతనంగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రం మూస విధానాలకు స్వస్తి చెప్పి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో అభివృద్ధిపథంలో దూసుకుపోతుందన్నారు. అంబేద్కర్ స్ఫూర్తితో తెలంగాణ విముక్తి పోరాటంలో విజయం సాధించి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ వైపు యావత్ దేశం చూస్తుందన్నారు. దేశ రాజకీయాల్లో బలమైన మార్పు కోసం కేసీఆర్ ముందుకు రావడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. కేసీఆర్ జాతీయ రాజకీయాల్లో గుణాత్మక మార్పు తీసుకొస్తారనే బలమైన నమ్మకం తమకుందని వెల్లడించారు. సమావేశం సందర్భంగా ఎన్నారైలు కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై టీఆర్ ఎస్ సెల్ ఉపాధ్యక్షులు బొలిశెట్టి వెంకటేష్, జనరల్ సెక్రెటరీలు లింబాద్రి, డా. రవి, సెక్రెటరీలు రవిపటేల్, గంగాధర్, సుధాకర్, జాయంట్ సెక్రెటరీలు దేవన్న, విజయ్, సుధాకర్, ఎగ్జిక్యుటివ్ మెంబర్స్ రాజేష్, నర్సయ్య, రాజు, రాజేందర్, వెంకటేష్, సాయన్న, వసంత్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యసభ అభ్యర్థుల పేర్లు ఖరారు?

**● టీఆర్ఎల్పీ సమావేశంలో ప్రకటన ● సంతోష్ కుమార్‌కు ఖరారైన రాజ్యసభ ● యాదవుల కోటాలో కల్వకుర్తి జైపాల్‌కు ● మూడో సీటుపై కొనసాగుతున్న కసరత్తు**

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి : టిఆర్ఎస్ పార్టీ రాజ్యసభ అభ్యర్థుల ఖరారు దాదాపుగా పూర్తి అయినట్లు విశ్వసనీయ సమాచారం. ఈనెల 12వ తేదీన నామినేషన్లు దాఖలు చేయాలని పార్టీ ముహూర్తం నిర్ణయించింది. మూడు సీట్లలో ఇప్పటి వరకు ఉన్న సమాచారం మేరకు రెండు సీట్లు ఖరారైనట్లు తెలుస్తోంది. మూడో సీటు అదృష్టం ఎవరికి దక్కుతుందోనన్న ఉత్కంఠ పార్టీలో నెలకొంది. మొదటి సీటు టిన్యూస్ ఎండీ, రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి సంతోష్ సంతోష్‌కుమార్‌కు ఖరారైనట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తమకు అవకాశం ఇవ్వాలంటే తమకు ఇవ్వాలంటూ పార్టీ నేతలు తమకు తోచిన రీతిలో రాజ్యసభ సీటు కోసం ప్రయత్నాలు చేసుకుంటున్నారు. పార్టీ నేతలు కాకపోయినా.. ఉద్యమంలో పాల్గొని టిఆర్ఎస్‌తో టచ్‌లో ఉన్న ఉద్యోగ సంఘాల నేతలు, డాక్టర్లు, ప్రైవేట్ విద్యాసంస్థల యజమానులు, లాయర్లు సైతం ప్రయత్నాల్లో ఉన్నారు. ఉన్నవే మూడు సీట్లు కావడంతో పోటీ తీవ్రంగా నెలకొంది. ఇప్పటికే కేసిఆర్ కు అత్యంత సన్నిహితుడు, అంతరంగికుడు, స్వయాన తన సడ్డకుడి కొడుకు అయిన జోగినపల్లి సంతోష్ కుమార్ కు ఒక రాజ్యసభ సీటు ఖరారు చేశారు.



రెండో రాజ్యసభ సీటును యాదవులకు కేటాయించారు. యాదవులకు ఇస్తానన్న రాజ్యసభ సీటు కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌కు ఇవ్వనున్నట్లు విశ్వసనీయ సమచారం. ఒక రాజ్యసభ సీటు యాదవులకు కట్టబెడతానని పలు సందర్భాల్లో సిఎం కేసిఆర్ ప్రకటించారు. అయితే ఆ సీటు కోసం యాదవ ప్రముఖులు తమ ప్రయత్నాల్లో మునిగిపోయారు. పార్టీలో ఉన్న యాదవ నేతలు, బయటి వారు ప్రయత్నాలు చేశారు. కానీ రాజకీయ సమీకరణాల నేపథ్యంలో జైపాల్ యాదవ్ ను రాజ్యసభకు పంపేందుకు కేసిఆర్ నిర్ణయించినట్లు సమాచారం అందుతోంది. ఇక ఈ సీటు కోసం కరీంనగర్ జెడ్పీ అధ్యక్షురాలు తుల ఉమతోపాటు వరంగల్ నేత కన్నెబోయిన రాజయ్య యాదవ్, సుందర్‌రాజు యాదవ్, బిక్షపతి యాదవ్, నోముల నర్సింహ్మయ్య లాంటి నేతల పేర్లు కూడా వినిపించాయి. కల్వకుర్తి స్థానిక సమీకరణాలను సెట్ చేసే ఉద్దేశంతో జైపాల్ పేరును గులాబిదళపతి కేసీఆర్ నిర్ణయించినట్లు చెబుతున్నారు. ఇక మూడో సీటు విషయంలో ఇంకా కసరత్తు సాగుతున్నట్లు చెబుతున్నారు. ఆ సీటును మహిళకు కేటాయించే యోచనలో ఉన్నట్లు సమాచారం అందుతోంది. ఇప్పటికే మంత్రివర్గంలో మహిళలకు స్థానం లేదన్న విమర్శ ఉండగా తాజాగా మూడు సీట్లలో వన్ బై థర్డ్ కోటా కింద మహిళకు ఇవ్వాలన్న యోచనలో ఉన్నట్లు చెబుతున్నారు.

సామాజిక కుల సమీకరణాలను కూడా దృష్టిలో ఉంచుకుని మూడో సీటును ఖరారు చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఒకవేళ మహిళా అభ్యర్థులు ఆ పార్టీకి చిక్కకపోతే ఎస్సీ, లేదా ఎస్టీ, లేదా మైనార్టీ వర్గాలకు చాన్స్ ఇవ్వొచ్చని చెబుతున్నారు. ఉమామాధవరెడ్డి లేదా మహబూబ్ ఆలమ్‌ఖాన్‌తో పాటు వరంగల్‌కు చెందిన ఖాజా మోయి నోద్దీన్‌లో ఎవరికొకరికి అవకాశం ఉండొచ్చని ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

### సంతోష్ అభ్యర్థిత్వం ఏకగ్రీవ ఆమోదం

ఎప్పుడు చిరునవ్వుతో ప్రతి ఒక్కరిని పలుకరిస్తూ నోటిలో నాలుకగా ఉన్న సంతోష్ అభ్యర్థిత్వంపై పార్టీలోని నేతలు ఏకగ్రీవంగా ఆమోదించినట్లు సమాచారం. సంతోష్‌కు రాజ్యసభ సీటు కేటాయించే విషయంలో టిఆర్ఎస్ శ్రేణుల్లో సర్వత్రా ఏకాభిప్రాయం వ్యక్తమవుతోంది. పార్టీలో ఎవరినడిగినా.. సంతోష్ విష యంలో పాజిటివ్ రెస్పాన్స్ ఇస్తున్నారు.

### కేసీఆర్‌కు నమ్మిన బంటు

జాతీయ ఫ్రంట్ రాజకీయాలకు టిఆర్ఎస్ నేత తెర లేపడంతో కేసిఆర్‌కు నమ్మిన బంటు ఢిల్లీలో ఉండడం అవసరమే అంటున్నారు. జాతీయ స్థాయిలో వివిధ పార్టీలతో సంప్రదింపులు జరిపేందుకు సంతోష్ లాంటి వ్యక్తి సర్వీస్ పనికొస్తుందని చెబుతున్నారు. కేసిఆర్‌తోసహా ఆయన ఫ్యామిలీలో రాజకీయాల్లోఉన్న కేటిఆర్, కవిత, హరీష్‌రావు రాష్ట్ర రాజకీయాలపైనే కేంద్రీక రించారు. రాజధాని ఢిల్లీలో సంతోష్ అవసరం ఎతో ఉందన్న భావన పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ఆదివారంనాడు తెలంగాణ భవన్ లో మధ్యాహ్నం జరగనున్న టీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో రాజ్యసభ అభ్యర్థుల పేర్లను ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించనున్నట్లు సమాచారం. దీంతో గత కొంతకాలంగా పార్టీలో నెలకొన్న రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక ఉత్కంఠకు తెరదింపినట్లైతుంది.

## జగన్‌ను మోడీ కాపాడుతున్నారు

### టీడీపీ ఎమ్మెల్సీ వై.బి. రాజేంద్రప్రసాద్



వెలగపూడి, సూర్య ప్రతినిధి : ఏపీ ప్రజలకు నాడు కాంగ్రెస్, నేడు బీజేపీ ద్రోహం చేసిందని టీడీపీ ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్ మండిపడ్డారు. బీజేపీతో జగన్ చీకటి ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. జగన్ కేంద్రానికి తొత్తులా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సీబీఐ, ఈడీ కేసుల నుంచి జగన్‌ను మోదీ కాపాడుతున్నారని ఎమ్మెల్సీ ఆరోపించారు. జగన్‌కు రాజయోగం లేదని, జైలు యోగం మాత్రమే ఉందని రాజేంద్రప్రసాద్ వ్యాఖ్యానించారు.

## ప్రజాసంకల్పయాత్ర 109వ రోజు షెడ్యూల్



ఒంగోలు, మేజర్‌న్యూస్:: ప్రజాసంకల్పయాత్ర 109వ రోజు షెడ్యూల్ ఖరారు అయింది. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదివారం ఉదయం చీరాల నుంచి పాదయాత్రను ప్రారంభించనున్నారు. అక్కడ నుంచి కొత్తపేట, ఆంధ్ర కేసరి జూనియర్ కళాశాల, బాలాజీ థియేటర్, పేరాల, ఐటీసీ, ఆదినారాయణపురం చేరుకొని భోజన విరామం తీసుకుంటారు. అనంతరం అక్కడి నుంచి ఏపూరు పాలెం వరకూ ప్రజాసంకల్పయాత్ర కొనసాగనుంది.

## పొలిటికల్ మైండ్ గేమ్‌ను అడ్డుకుంటా

### వైసీపీ ఎమ్మెల్యే కోటంరెడ్డి



నెల్లూరు, మేజర్‌న్యూస్: తనపై మోపిన అక్రమ కేసులను ప్రజా పోరాటాలతోనే అడ్డుకుంటానని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి స్పష్టం చేశారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ ప్రతిపక్ష ఎమ్మెల్యేలను ప్రభుత్వం వేధిస్తోందని విమర్శించారు. అన్యాయంగా విపక్ష నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని తెలిపారు. రాజకీయ ఒత్తిడులకు జిల్లా ఎస్పీ పీహెచ్‌డీ రామకృష్ణ తలొగ్గారని, ఓఎస్డీ విఠలేశ్వర్ దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. విచారణ హాజరయ్యే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పొలిటికల్ మైండ్ గేమ్‌లను అడ్డుకుంటానని, ఆధారాలు ఉంటే కేసులు నమోదు చేసుకోవాలని ఆయన అన్నారు.

# కేటీఆర్ వర్సెస్ ఉత్తమ్

**● మాటల యుద్ధానికి దిగుతున్న నేతలు**
**● సవాళ్లు -ప్రతిసవాళ్లతో వేడెక్కుతోన్న రాజకీయం**
**● రానున్నా ఎన్నికల్లో అధికారం మాదేనంటున్న కేటీఆర్**
**● తమదేనంటున్న ఉత్తమ్ -లేకపోతే రాజకీయసన్యాసం**
**● కసీఆర్ రాజకీయసన్యాసానికి రెడీనా? అంటూ సవాల్**

హైదరాబాద్, మేజర్‌న్యూస్ః రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖమంత్రి కేటీరామారావు, టీ-పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మధ్య మాటలయుద్ధం కొనసాగుతోంది. ఇద్దరి మధ్య కొనసాగుతున్న సవాళ్లు, ప్రతిసవాళ్లతో తెలంగాణలో ఎన్నికలకు ముందే రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. ఎవరికీ వారే రానున్నా ఎన్నికల్లో గెలుపు తమదంటే, తమదని చెబుతూ, దానికి సొంత సర్వేలను ప్రాతిపదికగా చెబుతున్నారు. రానున్నా ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు 106 స్థానాలు దక్కడం ఖాయమన్న ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటన అనంతరం, టీ-పీసీసీ నేతలు అప్రమత్తమయ్యారు. తాము చేయించుకున్న సొంత సర్వేల్లో కాంగ్రెస్ 70 స్థానాలు ఖాయమంటూ ఆపార్టీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్‌కు రానున్నా ఎన్నికల్లో 70 స్థానాలు దక్కితే, రాజకీయ సన్యాసం చేస్తానన్న కేటీఆర్, లేకపోతే ఉత్తమ్ రాజకీయ సన్యాసం చేయడానికి సిద్దమేనా? అంటూ గద్వాల బహిరంగసభ వేదికగా సవాల్ విసిరారు. మంత్రి సవాల్‌పై మర్నాడే ఉత్తమ్ స్పందిస్తూ రానున్నా ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకపోతే తానే కాదని, తమ కుటుంబం పూర్తిగా రాజకీయాల నుంచి వైదోలుగుతుందని పేర్కొన్నారు. రానున్నా ఎన్నికల్లో టీఆర్ఎస్ అధికారంలోకి రాకపోతే, కేసీఆర్‌తో సహా ఆయన కుటుంబసభ్యులంతా రాజకీయ సన్యాసానికి సిద్ధమేనా? అంటూ ఆయన ప్రతిసవాల్ విసిరారు. ఉత్తమ్ సవాల్‌పై మీడియా ఇష్టాగోష్టిలో కేటీఆర్ స్పందిస్తూ తన పాతికేళ్ల రాజకీయ వితాన్ని ఫణంగా పెట్టి సవాల్ చేస్తే, ఉత్తమ్ కుటుంబాల మాటున దాక్కుని తప్పించుకున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌పార్టీ ఇటీవల చేపట్టిన బస్సు యాత్రపై కూడా మంత్రి ఘాటైన విమర్శలే చేశారు. సూర్యాపేట బహిరంగసభలో మాట్లాడుతూ అలీబాబా 40 దొంగలా మాదిరిగా జానాబాబా 40 దొంగలంటూ, కాంగ్రెస్‌నేతలనుద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలపై సీఎల్పీనేత జానారెడ్డి తీవ్రంగా స్పందించారు. కాంగ్రెస్‌ప్రభుత్వ హయాంలో నల్గొండ జిల్లాలో అభివృద్ధే జరగలేదన్న కేటీఆర్ విమర్శలను సైతం ఆయన తిప్పికొట్టారు. సూర్యాపేటలో మంత్రి ప్రారంభించిన మంచినీటి ప్రాజెక్టుకు తానే గతంలో మంత్రిగా శంకుస్థాపన చేశానని గుర్తు చేశారు. గతంలో తాము శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులనే, ఈనాడు కేటీఆర్‌తోపాటు ఇతర మంత్రులు ప్రారంభోత్సవాలు చేసి, తాము చేసినట్లుగా ప్రచారం చేసుకుంటున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు మరో ఏడాది సమయం ఉన్నప్పటికీ, తెలంగాణలో అప్పుడే రాజకీయవాతావరణం వేడెక్కినట్లు కనిపిస్తోంది. అధికార టీఆర్ పార్టీ, ప్రధానప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీల నేతలు మధ్య నిత్యం విమర్శలు, ప్రతివిమర్శలు సర్వసాధారణమయ్యాయి. అధికార, ప్రధాన ప్రతిపక్షపార్టీల నేతల మధ్య కొనసాగుతోన్న మాటలయుద్ధంలో ఒకరికి, మరొకరు తీసిపోకుండా విమర్శనాస్త్రలు సంధించుకుంటున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని అధికార టీఆర్ఎస్ అమలు చేయలేదని కాంగ్రెస్‌పార్టీ నేతలంటూంటే, టీఆర్ఎస్ నేతలు మాత్రం ఎన్నికల్లో ఇచ్చిన హామీలనే కాకుండా, ఇవ్వని హామీలను కూడా అమలు చేశామని చెబుతున్నారు. ఎన్నికల్లో కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాల ప్రస్తావనే లేదని, అయినా ఆడపిల్లల పెళ్లిళ్లు చేయడానికి పేద ప్రజలను ఎదుర్కొనే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి కేసీఆర్, ఈపథకాలను ప్రవేశపెట్టారంటున్నారు. అలాగే ఆడకూతుళ్లు నీళ్ల బిందెలతో రోడ్లపైకి రావద్దన్న ఉద్దేశ్యంతో, మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి నల్లానీరు అందించాలని నిర్ణయించిన విషయం తెలిసిందేనని గుర్తు చేస్తున్నారు. ఎన్నికల్లో ఇవ్వని హామీలను కూడా అమలు చేస్తున్నామని అధికారపార్టీ నేతలంటూంటే, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని కాంగ్రెస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి, లక్షా ఉద్యోగాల కల్పన ఏమైందంటూ నిలదీస్తున్నారు. అధికారపార్టీపై విమర్శలదాడికి ఉత్తమ్ ముందుండి తమ పార్టీ నేతలను నడిపిస్తున్నట్లు కనిపిస్తుంటే, ప్రధానప్రతిపక్ష చేస్తున్న విమర్శలను నేరుగా మంత్రి కేటీఆరే తిప్పికొట్టడమే కాకుండా, తమపార్టీ నేతలకు స్ఫూర్తినిస్తున్నారు.



## ఈటెలపై ఆరోపణలకు కట్టుబడి ఉన్నా

**● విచారణకు ఆదేశిస్తే నిరూపిస్తా ● కాంగ్రెస్ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి**



హైదరాబాద్, మేజర్‌న్యూస్ః రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఈటెలరాజేందర్‌పై తాను చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నాని కాంగ్రెస్ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి అన్నారు. విచారణకు ఆదేశిస్తే నిరూపిస్తానని చెప్పారు. నేను చేసిన అవినీతి ఆరోపణల పై వివరణ ఇవ్వకుండా, కాంగ్రెస్‌పార్టీపై అనవ సరం విమర్శలు చేస్తు న్నారని ధ్వజ మెత్తారు. ఈటెల అయినా సరే మరొక మంత్రి వచ్చినా చర్చకు తాను రెడీ అన్నారు. ప్రభుత్వంపై తాను చేసిన ఆరోపణలపై టీఆర్ఎస్ నేతలు వివరణ ఇస్తారని ఆశించానని రేవంత్ అన్నారు. నిజాయితీ ఉంటె ఈటెల ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. పాత జిల్లాల పేరుతో గుంటూరు వ్యక్తికి రేషన్ కార్డ్ ప్రింటింగ్ ఇచ్చి ఈటెల కోట్ల దండు కున్నది నిజం కాదా? అని నిలదీశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ,మంత్రి హరీష్ లు అల్లుడు ఆణిముత్యం మామ కేసీఆర్ స్వాతి ముత్యం అన్న చందంగా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఇన్నాళ్లు ఫిరాయింపు రాజకీయాలతో, రాజకీయాలను కేసీఆర్ హరీష్ లు భ్రష్టుపట్టించారని ఆరోపించారు. టీఆరెస్ లో ఉంటే హరీష్ రాజకీయంగా చావడం ఖాయమన్న రేవంత్, .కెసిఆర్ కేటీఆర్‌లు ఆయనను రాజకీయంగా చంపడం ఖాయమని ఆరోపించారు. కేసుల భయమో, రాజకీయంగా బతకాలనో, హరీష్ , బీజేపీ జాతీయాధ్యేఉడు అమితా షాను కలిసింది నిజం కాదా? అని రేవంత్ ప్రశ్నిం చారు. ఈటెలను ఎల్పీ లీడర్ చేసినందుకు గతం లో కేసీఆర్‌పై హరీష్ తిరుగుబాటు చేసే ప్రయ త్నం చేశారన్నారు. గతంలో వైఎస్‌ను హరీష్ కలిసి కాంగ్రెస్ లో చేరడానికి రెడీ అని చెప్పింది నిజం కాదా అన్న ఆయన, బీజేపీలో కీలక నేతతో హరీష్ మంతనాలు చేసింది, చేస్తుంది వాస్తవమని రేవంత్ చెప్పుకొచ్చారు.

# మాది పోరాటం.. వాళ్లది ఆరాటం

## ఏపీ ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు



వెలగపూడి, సూర్య ప్రధాన ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాక కేంద్ర ప్రభుత్వం ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు చెప్పారు. శనివారం ఆయన సచివాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా తాము పోరాటం చేస్తున్నామని, తాము ఓ పక్క ప్రజల కోసం పోరాడుతుంటే వైసీపీ నేతలు బీజేపీ నేతల చుట్టూ తిరుగుతున్నారన్నారు. వెకాపాకు రాజకీయ లబ్ధి, కేసుల మాఫీపైనే శ్రద్ధ ఉందని విమర్శించారు. వారు తమ రాజకీయ లబ్ధి కోసం రాష్ట్రాన్ని తాకట్టుపెడుతున్నారని మండిపడ్డారు. తాను ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీని కలిసినప్పుడు ఏపీ ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించినా, దాన్ని వెంటనే అమలు చేయలేదని, చాలా ఆలస్యం అయిపో యింది కాబట్టి ఇప్పుడు ఇక ప్రత్యేక హోదా ఇవ్వాల్సిన అవసరం ఉందని కోరి నట్లు వెల్లడించారు. ఆర్థిక లోటుపై కేంద్రం చెప్పే లెక్కలు కాదని, కాగ్, నీతి ఆయోగ్, ఆర్‌బీఐ తదితర సంస్థలు ఆర్థిక లోటు రూ.14వేల కోట్లు ఉందని చెప్పాయని తెలిపారు. కానీ, కేంద్రం రూ.138 కోట్లు కంటే ఎక్కువ ఉండదని చెప్పడం సమజసంగా లేదన్నారు. రాష్ట్ర విభజన సమయంలోనూ వైసీపీ పార్లమెంట్‌లో నాటకాలాడిందన్నారు. వాళ్లు ఎప్పుడూ చిత్తశుద్ధిగా పని చేయ లేదు. జగన్ తన కేసుల గురించే పని చేస్తున్నారు. కానీ రాష్ట్ర ప్రజల కోసం ఏమీ చేయట్లేదు అని విమర్శించారు. ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు విజయ సాయిరెడ్డి ఇచ్చిన ప్రకటన చూస్తుంటే వైసీపీ నేతలు బీజేపీ చుట్టూ ప్రదక్షిణలు చేసి కేసులు మాఫీ చేసుకోవాలన కుంటున్నారని అర్థం అవుతోందన్నారు. వెకా పాకు ఏపీపై ఎలాంటి ప్రేమా లేదని.. కేవలం రాజకీయ లబ్ధి, స్వలబ్ధి కోస మే పని చేస్తున్నా రంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమె త్తారు. ఓ ప్రశ్నకు సమాధానంగా ఆయన మాట్లాడుతూ మేము అవిశ్వాస తీర్మానం పెడతాం మీరు వస్తారా అని వైసీపీ వాళ్లు అడుగుతున్నారని, ముద్దాయిలతో కలిసి ఎవరైనా వస్తారా అంటూ ప్రశ్నిం చారు. వీళ్లు అసలు కాంగ్రెస్ వారితో మాట్లాడారా? ఇస్తే ప్రత్యేక హోదా బీజేపీనే ఇవ్వాలనే వాళ్లతో కాంగ్రెస్ కలిసి వస్తుందా? అంటూ యనమల ప్రశ్నించారు. మొదటి నుంచి స్వలాభం కోసం పుట్టిన పార్టీ వైసీపీ అని మంత్రి కళా వెంకట్రావు విమర్శించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఓ ముఖ్యమంత్రి నీడలో ధనాన్ని దోచుకున్నారన్నారు. వారిపై ఉన్న కేసుల మాఫీ కోసం యత్నిస్తున్నారే తప్ప రాష్ట్ర సమస్యల కోసం ఎక్కడా చిత్తశుద్ధితో వ్యవహ రించట్లేదన్నారు. 5కోట్లు మంది ప్రయోజనాల కోసం తాము యత్నిస్తుంటే వాళ్లకి మాత్రం అధికార కూటమిలో ఎలా చేరుదామా అన్న తాపత్ర యమే కన్పిస్తోందన్నారు. ఏ1, ఏ2లు తాము దోచుకున్న ధనాన్ని కాపాడు కునేందుకు పార్టీని ఉపయోగించుకుంటున్నారని తాజా ఘటనలతో మరోసారి రుజువెందని చెప్పారు. ఇటీవల ఈడీ నుంచి రూ.34 కోట్లు తిరిగి వెనక్కి తెచ్చుకోగలిగారని తెలుస్తోందన్నారు.

## ఎంపి శివప్రసాద్ మేలుకొలుపు



చిత్తూరు, మేజర్‌న్యూస్ : ఆంధ్ర ప్రదేశ్‌కు జరిగిన అన్యాయంపై పార్లమెంటులో విచిత్ర వేషధారణలతో కేంద్ర ప్రభుత్వ తీరును తూర్పార బట్టిన చిత్తూరు ఎంపి శివప్రసాద్ నియోజక వర్గంలోనూ అదే తరహాలో ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాన్ని చేపట్టారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చే విషయమై కేంద్ర ప్రభుత్వం మోసగించిన తీరు, ప్యాకేజీ పేరుతో నిధులు ఇవ్వక పోవడాన్ని ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించేందుకు శివప్రసాద్ 'మేలుకొలుపు' పేరుతో తన నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా చంద్రగిరి పట్టణంలో క్లాక్ టవర్ వద్ద డప్పు కొట్టి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం జిల్లా అధ్యక్షుడు పులివర్తి నాని ఆధ్వర్యంలో కార్యకర్తలు భారీగా హాజరయ్యారు. ప్రత్యేక హోదా ఇస్తామని అధికారం చేపట్టిన బిజెపి తెలుగు ప్రజలను మోసగించడం అన్యాయమని శివప్రసాద్ అన్నారు. చంద్రబాబును దూరం చేసుకోవడం మోడీ ప్రభుత్వానికి తీవ్ర నష్టమని కూడా ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగే వరకు తన పోరాటాన్ని ఆపేది లేదని శివప్రసాద్ డప్పు కొడుతూ స్పష్టం చేశారు.

## చంద్రబాబు వెన్నుపోటు రాజకీయాలకు బ్రాండ్ అంబాసడర్ : వైసీపీ నేత పార్థసారథి



హైదరాబాద్, మేజర్‌న్యూస్: చంద్రబాబు వెన్నుపోటు రాజకీయాలకు బ్రాండ్ అంబాసిడర్ అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పార్థ సారథి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.. టీడీపీ మంత్రులు రాజీనామా చేసినా ఎన్డీ యేలో కొనసాగడం మోసపూరితం కాదా అని పార్థసారథి సూటిగా ప్రశ్నిం చారు. కేంద్రంలో ఉన్నది ఎన్డీయే ప్రభుత్వం కాదా అని ఆయన నిలదీశారు. ప్రత్యేక హోదా విషయంలో చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజలు అర్థం చేసుకోవాలని సూచించారు. పార్థసారథి శనివారం హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. "చంద్రబాబు మంత్రులు రాజీనామా చేస్తారట. కానీ ఎన్డీయేలోనే కొనసాగుతారంట. ఇంత కన్నా మోసం ఎవరైనా చేస్తారా అంటే అది ఒక్క చంద్రబాబు మాత్రమే. కేంద్ర ప్రభుత్వంలో నాలుగేళ్లు ఉండి ప్రత్యేక హోదా సంజీవని కాదు, ముగిసిపోయిన అధ్యాయం, జగన్ రాజకీయాలు చేస్తున్నారని రకరకాల భాష్యాలు చెప్పిన చంద్రబాబు ప్రత్యేక హోదాపై యూటర్న్ తీసుకున్నారని అందరు భావించారు. అయితే ఆయన ఎన్‌డీఏ కూటమిలో కొనసాగడం, అవిశ్వాస తీర్మానం పెడితే ఏం వస్తుందని అంటున్నా రంటే చంద్రబాబు తీరు ఎలా ఉందో అర్థం చేసుకోవాలి. వెన్నుపోటుకు చంద్ర బాబు బ్రాండ్ అంబాసిడర్" అని అభివర్ణించారు. "నాలుగేళ్లుగా ప్రత్యేక హోదా తో ఏం వస్తుందన్నారు. ఇప్పుడేమో ప్రత్యేక హోదా కావాలంటున్నారని గుర్తు చేశారు. మొన్నటి వరకు అవిశ్వాస తీర్మానం పెడితే మద్దతిస్తామని బీరాలు పలికిన చంద్రబాబు ఇప్పుడు మాట మార్చడం ఏంటని ప్రశ్నించారు. కేంద్రంపై బురద జల్లుతూ మన అభివృద్ధిని చెప్పమని చంద్రబాబు తన ఎంపీలకు చెబుతున్నారన్నారు. అమరావతిలో ఒక్కటైన పర్మినెంట్ పని చేశావా అని నిలదీశారు. రాజధాని కోసం వేలాది మంది రైతులు త్యాగం చేస్తే ఆ త్యాగాన్ని కూడా చంద్రబాబు క్యాష్ చేసుకుంటున్నారని మండిపడ్డారు. అన్నిసార్లు వారితో కలిస్తే వారి ఆలో చన ఏంటో తెలియ లేదా అని పార్ధ సారథి ధ్వజ మెత్తారు.

# అభివృద్ధిలో తెలంగాణ ప్రథమ స్థానం

**● దేశంలో మరిన్ని సంస్కరణలు రావాలి**
**● 51వ స్కోచ్ సమ్మిట్‌లో పాల్గొన్న మంత్రి కేటీఆర్**



న్యూఢిల్లీ, సూర్యప్రధానప్రతినిధి : అభివృద్ధిలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ప్రథమ స్థానంలో నిలిచిందని తెలంగాణ ఐటి, పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామా రావు స్పష్టం చేశారు. అన్ని రంగాల్లో రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతుందని ఉద్ఘాటించారు. శనివారం ఢిల్లీలో జరిగిన 51వ స్కోచ్ సమ్మిట్‌లో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ పాల్గొన్నారు. దేశంలో మరిన్ని సంస్కరణలు రావాల్సిన అవసరం ఉందని తెలంగాణ ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అభిప్రాయపడ్డారు. దేశం అభివృద్ధి చెందుతున్నా.. మరోవైపు సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయన్నారు. అభివృద్ధిలో తెలంగాణ దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. ఢిల్లీలో జరిగిన 51వ స్కోచ్ సదస్సులో పాల్గొన్న ఆయన రాష్ట్రంలో వృద్ధిరేటు, ప్రాంతాల అభివృద్ధి, నైపుణ్యాల అభివృద్ధిపై జరిగిన చర్చలో పాల్గొన్నారు. దేశంలోనే అన్ని రంగాల్లో తెలంగాణ ముందుకు వెళ్తోందని చెప్పారు. సీఎం కేసీఆర్ కృషితో విద్యుత్ సమస్యలను అధిగమించి విద్యుత్ మిగులు రాష్ట్రంగా అవతరించిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో అమలవుతోన్న పథకాలతోపాటు పరిశ్రమల ఏర్పా టును ప్రోత్సహిం చేందుకు తీసుకొచ్చిన పారిశ్రామిక విధానాన్ని ఆయన వివరించారు. సదస్సు అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. స్కోచ్ వారు అభివృద్ధి పథంలో నడుస్తున్న రాష్ట్రాలన్నింటినీ గుర్తించి అవార్డులు ఇస్తున్నారు. మా ప్రభుత్వం గడిచిన మూడున్న రేళ్లుగా సమ్మిళిత అభివృద్ధి సాధిస్తోంది. దానికి సంబంధించి అంద రికీ వివరించాలని నన్ను ఆహ్వానించారు. అందుకే వచ్చా. రాష్ట్రంలో అనుస రిస్తున్న విధానాలు వివరించాను. పెట్టుబడులకు తెలంగాణ అనువైన ప్రాంత మని కేటీఆర్ చెప్పారు. మనదేశంలో నదుల్లో నీటి లభ్యత ఉన్నప్పటికీ 75వేల టీఎంసీల నీళ్ళు సముద్రంలో వృధాగా కలుస్తున్నాయని వీటిని వినియోగిం చుకోవాల్సి ఉందన్నారు. మౌలిక సదుపాయాల కల్పన కోసం తెలంగాణ ఏర్పడ్డప్పటి నుండి కృషి చేస్తున్నాం. దేశంలో అన్ని రాష్ట్రాల కంటే ఎక్కువగా సోలార్ విద్యుత్తును తయారుచేస్తున్నాం. ప్రస్తుతం 3300 మెగావాట్ల సోలార్ తయారుచేస్తున్నామని వివరించారు. రాబోయే రోజుల్లో 5500 మెగా వాట్ల టార్గెట్‌తో పనిచేస్తున్నామన్నారు. డబుల్ బెడ్రూం పథకాన్ని ఎంతో విజయ వంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. 46వేల చెరువులను పునరుద్ధరించినట్లు పేర్కొన్నారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థికాభివృద్ధి జరుగుతోంది. దేశంలో ఎక్కడా లేనివిధంగా పారిశ్రామిక విధానాన్ని అమలు చేస్తున్నా మని కేటీఆర్ తెలిపారు. దేశంలో మరిన్ని సంస్కరణలు రావాల్సిన అవసరం ఉందన్నారు. దేశం అభివృద్ధి చెందుతున్నా.. మరోవైపు సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయని కేటీఆర్ పేర్కొన్నారు.

విద్యుత్ రంగంలో సాధించిన పురోగతి, సోలార్ విద్యుత్‌లో దేశంలోనే నెం.1గా ఉన్న వైనాన్ని వివరించానని తెలిపారు. నీటిపారుదల శాఖ, మిషన్ కాకతీయ, పేదవాడి ఆత్మగౌరవానికి ప్రతీకగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇంటింటికీ తాగునీరు ఇచ్చే విధానం.. ఇలా అనేక కార్యక్రమాలతో పేద, పెద్దవారిని కలువుకొని పోయే విధంగా చేపడుతున్న విధానాలపై మాట్లాడాను. పురోగమన పారిశ్రామిక విధానం తీసుకొచ్చి దేశంలోనే ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో అగ్రస్థానంలో నిలిచాం. రాష్ట్రంలోకి వస్తోన్న పరిశ్రమల గురించి, చేపడుతోన్న సంక్షేమ కార్యక్రమాలను వివరించాను. ఇతర రాష్ట్రాల్లో జరుగుతున్న మంచిని పుస్తక రూపంలో తెస్తే బాగుంటుందని స్కోచ్ వారికి సూచించాను అని కేటీఆర్ తెలిపారు.

## ప్రతిపక్షంగా కాంగ్రెస్ పార్టీ విఫలం

### టీఆర్ఎస్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



హైదరాబాద్, మేజర్‌న్యూస్: దేశంలో ఏ ప్రతిపక్ష పార్టీ పోషించని అసమర్థ పాత్రను తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పోషిస్తోందని టీఆర్ఎస్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఓ బెయిల్ పార్టీ అని ఆయన విమర్శించారు. బస్సు యాత్ర సందర్భంగా కాంగ్రెస్ నేతల తీరును ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ బస్సు యాత్ర పేరిట అలీబాబా నలభై దొంగల బ్యాచ్ బయలుదేరి నోటికొచ్చిన భాష మాట్లాడుతున్నదని మండిపడ్డారు. సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి లాంటి నేతలందరూ బెయిల్‌పై ఉన్నోళ్లేనని తెలిపారు. కాంగ్రెస్ బస్సు యాత్ర అదో తుస్సు యాత్రని, బస్సు యాత్రకు అంగడి యాత్రగా పేరొచ్చిందని ఎద్దేవా చేశారు. పట్టణాల్లో అంగడి రోజు జనం సందడి కనిపిస్తుందని తెలివిగా అదే రోజు బస్సు యాత్రలు ప్లాన్ చేశారని అపహాస్యం చేశారు. అయినప్పటికీ బోధన్‌లో అంగడి రోజే బస్సు యాత్ర జరిగినా ఫెయిల్ అయిందన్నారు. మంత్రి హరీష్‌రావును చంపేస్తనని ఓ కాంగ్రెస్ నేత బహిరంగంగా ప్రకటన చేశారని, మంత్రులు కేటీఆర్, ఈటల రాజేందర్‌లపై జైల్లో చిప్పకూడు తిన్న రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నేతల నోటికి హద్దు లేకుండా పోతుందని మండిపడ్డారు.

# సంపాదకీయం

editpage@suryaa.com

“ పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగడం అన్నది అంతకంతకు కలగా మారిపోతున్నదా? ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా పరిస్థితి ఇదే విధంగా ఉంటున్నది. కొంత విరామం అనంతరం పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు మలి విడత క్రితం సోమవారం ప్రారంభమయ్యాయి. కాని అప్పటి నుంచి ఏ రోజూ సమావేశాలు నిర్ణయించిన అజెండా ప్రకారం సాగలేదు. మొదటి వారం అంతా తుడిచిపెట్టుకుపోయింది. ప్రతి రోజు ఉదయం లోక్‌సభ, రాజ్యసభ సమావేశమైన కొన్ని నిమిషాలకే వివిధ రాజకీయ పార్టీలు రకరకాల కారణాలతో సభ వెల్‌లోకి దూసుకుపోవడం పరిపాటి అయింది. పర్యవసానంగా సభ కార్యకలాపాలు సాఫీగా సాగక సభలను మరుసటి రోజుకు వాయిదా వేయడమవుతోంది. అయితే, ఇందుకు గురువారం ఒక్క రోజు మినహాయింపు లభించింది. ఆ రోజు అంతర్జాతీయ మహిళా దినోత్సవం అయిన సందర్భంగా పార్టీలతో నిమిత్తం లేకుండా పార్లమెంట్ సభ్యులు మహిళల హక్కులు, సమానత్వం, సాధికారత గురించి మాట్లాడారు. కాని ఆ కార్యక్రమం ముగిసిన మరు క్షణం యథాతథ స్థితి నెలకొంది. యథాతథ స్థితి అంటే సభా కార్యకలాపాలు ఏవీ జరగకపోవడం అనే. ప్రజలకు ప్రయోజనకరమైన అంశాలు లేవనెత్తేందుకు పార్లమెంట్ సభ్యులకు అసలు ఏమాత్రం అవకాశం లభించలేదు. ప్రభుత్వం కూడా ఏ బిల్లునూ ఆమోదించుకోలేకపోయింది. ప్రతిపక్షం కూడా ప్రభుత్వాన్ని జవాబుదారీ చేయలేకపోయింది. ఆర్థిక బిల్లు వంటి కీలకమైన బిల్లులు కూడా పెండింగ్‌లో ఉండిపోయాయి. పార్లమెంట్‌లో నెలకొన్న ఇటువంటి దుస్థితికి ఏ పార్టీ కూడా బాధ్యతను తప్పించుకోజాలదు. జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్‌డిఎ)కు సారథ్యం వహిస్తున్న భారతీయ జనతా పార్టీ గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సభ కార్యకలాపాలకు అంతరాయం కలిగించింది. ”

## పార్లమెంట్ సెషన్ గతి అంతేనా?


పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగడం అన్నది అంతకంతకు కలగా మారిపోతున్నదా? ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా పరిస్థితి ఇదే విధంగా ఉంటున్నది. కొంత విరామం అనంతరం పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు మలి విడత క్రితం సోమవారం ప్రారంభమయ్యాయి. కాని అప్పటి నుంచి ఏ రోజూ సమావేశాలు నిర్ణయించిన అజెండా ప్రకారం సాగలేదు. మొదటి వారం అంతా తుడిచిపెట్టుకుపోయింది. ప్రతి రోజు ఉదయం లోక్‌సభ, రాజ్యసభ సమావేశమైన కొన్ని నిమిషాలకే వివిధ రాజకీయ పార్టీలు రకరకాల కారణాలతో సభ వెల్‌లోకి దూసుకుపోవడం పరిపాటి అయింది. పర్యవసానంగా సభ కార్యకలాపాలు సాఫీగా సాగక సభలను మరుసటి రోజుకు వాయిదా వేయడమవుతోంది. అయితే, ఇందుకు గురువారం ఒక్క రోజు మినహాయింపు లభించింది. ఆ రోజు అంతర్జాతీయ మహిళా దినోత్సవం అయిన సందర్భంగా పార్టీలతో నిమిత్తం లేకుండా పార్లమెంట్ సభ్యులు మహిళల హక్కులు, సమానత్వం, సాధికారత గురించి మాట్లాడారు. కాని ఆ కార్యక్రమం ముగిసిన మరు క్షణం యథాతథ స్థితి నెలకొంది. యథాతథ స్థితి అంటే సభా కార్యకలాపాలు ఏవీ జరగకపోవడం అనే. ప్రజలకు ప్రయోజనకరమైన అంశాలు లేవనెత్తేందుకు పార్లమెంట్ సభ్యులకు అసలు ఏమాత్రం అవకాశం లభించలేదు. ప్రభుత్వం కూడా ఏ బిల్లునూ ఆమోదించుకోలేకపోయింది. ప్రతిపక్షం కూడా ప్రభుత్వాన్ని జవాబుదారీ చేయలేకపోయింది. ఆర్థిక బిల్లు వంటి కీలకమైన బిల్లులు కూడా పెండింగ్‌లో ఉండిపోయాయి. పార్లమెంట్‌లో నెలకొన్న ఇటువంటి దుస్థితికి ఏ పార్టీ కూడా బాధ్యతను తప్పించుకోజాలదు. జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్‌డిఎ)కు సారథ్యం వహిస్తున్న భారతీయ జనతా పార్టీ గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సభ కార్యకలాపాలకు అంతరాయం కలిగించింది. ఇప్పుడు ప్రభుత్వంలో ఉన్నప్పుడు సైతం బిజెపి సభ నడిచేట్లు చూసేందుకు నానా తంటాలు పడుతోంది. ఇక కాంగ్రెస్ అయితే ప్రభుత్వంలో ఉన్నప్పుడు అప్రజాస్వామిక పద్ధతులను అనుసరించావంటూ బిజెపిని నిందించింది. కాని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేందుకు అవే ఎత్తుగడలను అనుసరిస్తోంది. తమ తమ ప్రాంతాలు. నియోజకవర్గాలకు సంబంధించిన డిమాండ్లతో కొన్ని చిన్న పార్టీలు పరిస్థితిని మరింత సంక్లిష్టం చేస్తుండడం గమనార్హం. కాగా పార్లమెంటు ఒక నిమిషం పాటు సమావేశం కావడానికి ఖర్చయ్యే ప్రజాధనం రూ.2.5 లక్షలు. ఈ లెక్కన ఎన్ని వందల కోట్ల ప్రజాధనం మనం వెచ్చిస్తున్నాం, అది ఎంతగా దుర్వినియోగం అవుతోందో ఎప్పుడైనా లెక్క వేసుకున్నారా? ఒకవైపు ప్రజలందరినీ పన్ను పరిధిలోకి తెస్తున్నాం అంటారు. అంటే, దాదావుగా ప్రతి ఒక్క భారతీయుడి నుంచి ప్రత్యక్షపన్నులు కూడా వసూలు చేస్తారన్న మాట. పరోక్షంగా మనం ప్రతిరోజూ తినే తిండి, కట్టే బట్ట, ఉండే ఇల్లు.. ఇలా అన్నింటికీ కూడా మనం పన్నులు చెల్లిస్తూనే ఉన్నాం. ఇక ప్రత్యక్షంగా కూడా మన జేబుల్లో చేతులు పెట్టి మరీ తీసేసుకునే వ్యవహారం మొదలైపోతోంది. నిజాయితీగా పన్నులు కట్టేవాళ్లు ఎప్పుడూ కడుతూనే ఉంటారు. దానికి ప్రభుత్వం ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. కానీ, అక్రమార్కుల సంగతేంటి? అలాంటివారిని పట్టుకోడానికి పార్లమెంటు సభ్యులు ఏం సూచనలు, సలహాలు ఇస్తున్నారనేది శూన్యం. పార్లమెంటులో అర్థవంతమైన చర్చలు చూసి చాలా కాలం అయింది. ఈ విషయాన్ని స్వయంగా సీనియర్ పార్లమెంటేరియన్ లాల్ కిషన్ అద్వానీయే ఓ సందర్భంలో చెప్పారు. పార్లమెంటు సమావేశాలు ఏమాత్రం సక్రమంగా సాగడం లేదని, ఇది ప్రజాస్వామ్యానికి అంత మంచిది కాదని కూడా తన సొంత పార్టీ సభ్యులను పిలిపించుకుని మరీ ఆయన వివరించారు. అయినా పరిస్థితిలో ఏమత్రం మార్పు లేదు. మరోవైపు అవినీతి, బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతం, జాతీయ-అంతర్జాతీయ కార్పొరేట్ కూటముల రహస్య అజెండాల కారణంగా రాజకీయ పార్టీ వ్యవస్థలు భ్రష్టు పట్టాయి. పర్యవసానంగానే చట్టసభలు స్వార్థపూరిత రాజకీయ యుద్ధ భూములుగా మారిపోతున్నాయి. సమస్యలపై ప్రజా ఉద్యమాల్ని చేపట్టకుండా, వాటిపై చట్టసభల్లో మాత్రం గందరగోళం సృష్టించే పార్టీల ఆచరణ ఆక్షేపణీయం. ప్రజల్ని ప్రేక్షకులుగా మార్చి చట్టసభల్ని పోరాట వేదికలుగా మార్చడం సరైనది కాదు. ప్రభుత్వాలు ప్రవేశపెట్టే ప్రజావ్యతిరేక బిల్లులను చట్టసభల్లో పోరాటాల ద్వారా కాక, ప్రజాఉద్యమాల ద్వారా నిలువరించడంపై రాజకీయ పక్షాలు దృష్టిపెట్టిన నాడు సభల్లో గందరగోళాలు ఉపశమించే అవకాశం ఉంది. ప్రపంచీకరణ యుగంలో డబ్ల్యూటీఓ (ప్రపంచ వాణిజ్య సంస్థ) ఒప్పందానికి అనుగుణమైన విధానాలను మాత్రమే అమలు చేయవలసిన తప్పనిసరి పరిస్థితి నెలకొనివుంది. దీంతో, పార్లమెంటరీ రాజకీయ పక్షాలకు చెందిన రాజకీయార్థిక విధానాల ప్రత్యేకతలు, విశిష్టతలు, భిన్నతలు అన్నీ అంతర్ధానమైపోతున్నాయి. రాజకీయ సార్వభౌమత్వం అంతరించి దాని స్థానంలో ప్రపంచీకరణ విధానాలను ఎవరు చిత్తశుద్ధితో, తక్కువ అవినీతితో అమలులోకి తెస్తారనే విషయం మాత్రమే రాజకీయ పక్షాల ప్రధాన అజెండా మారింది. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ రాజకీయార్థిక విధానాలతో ఉన్న ప్రజా రాజకీయాలు దేశ రాజకీయ యవనికపై ప్రబలత్వం సాధించే వరకు ప్రజాప్రాతినిధ్య సభలకు ఈ పరాయీకరణ జాడ్యం వదలదు. తాజాగా పార్లమెంటు బడ్జెట్ మలివిడత సమావేశాల మొదటి రోజే ఉభయసభలు అట్టుడికిపోయాయి. తెలుగుదేశం సభ్యులు సభలను స్తంభింపజేశారు. ఆంధ్రప్రదేశ్ వునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ.. తొలుత సోమవారం ఉదయం 10 గంటలకు పార్లమెంటు ప్రాంగణంలోని గాంధీజీ విగ్రహం వద్ద నినాదాలతో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం లోక్‌సభ, రాజ్యసభల్లో వెల్‌లోకి దూసుకొచ్చి సభా కార్యక్రమాలను అడ్డుకున్నారు. ఏపీకి ప్రత్యేకహోదా ఇవ్వాలని ఏపీ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతున్న సంగతి తెలిసిందే. ఇక పార్లమెంట్ సమావేశాల్లో మరోసారి టీడీపీ ఎంపీలు, వైసీపీ ఎంపీలు పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టారు. అంతేకాదు తెలంగాణ రాష్ట్ర ఎంపీలు కూడా ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏపీకి మద్దతు పలికారు. అయితే ఇన్ని ఆందోళనలు.. ఇంత పోరాటం చేస్తున్నా... కేంద్రం మరోసారి ఏపీకి షాకిచ్చింది. సెంటిమెంట్ ఆధారంగా నిర్ణయాలు తీసుకోలేం.. ఎన్ని ఉద్యమాలు చేసినా హోదా సాధ్యం కాదంటూ తేల్చి చెప్పేసింది. గతంలో ప్రకటించిన ప్యాకేజీ మాత్రమే ఇవ్వగలమని మొండిచెయ్యి చూపించింది.

# సంక్షోభంలోనూ... చంద్రబాబు సంక్షేమ బాట



ఇస్కా రాజేష్‌బాబు, ‘సూర్య’ అమరావతి బ్యూరో చీఫ్,
96520 39780

- అభివృద్ధి, సంక్షేమంలో రాజీ ఉండదన్న సందేశం
- నిరుద్యోగుల కోసం రూ. 1000 కోట్లు కేటాయింపు
- బడ్జెట్‌లో నిధుల కేటాయింపు సరే...విడుదల ఎలా?
- వచ్చే ఆర్థికానికి రూ. 2.49 లక్షలకోట్ల రుణ భారం
- ఐదేళ్లలో రెట్టింపు అయిన ఆంధ్రప్రదేశ్ బడ్జెట్



నవ్యాంధ్రలో ప్రస్తుతం ఉన్న సంక్షోభ పరిస్థితుల్లోనూ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని మరువలేదు. ఎన్ని కష్టాలున్నా ఎదురొడ్డి పథకాలను మరిం త సమర్థవంతంగా అమలుచేసేందుకు బడ్జెట్‌లో అన్ని వర్గాలకు సమ న్యాయం చేసి బడుగుల బాట పట్టింది. అప్పుల ఊబిలోకి జారుకుంటున్నామని తెలిసినా వెనకడుగు వేయకుండా సాహసోపేతంగా బడ్జెట్‌ను శాసనసభలో ప్రవేశపెట్టిం ది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వంతో సయోధ్య లేకున్నా..అక్కడి నుంచి రావాల్సిన నిధుల్లో కోత పడుతుందని తెలిసినా ధైర్యం చేసి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుం చి రెట్టింపు బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. గోరు చుట్టుపై రోకటి పోటులా కేంద్రం నుంచి సహకారం లేకున్నా ప్రజలకు మేలు చేయాలన్న సంకల్పంతో ముఖ్య మంత్రి చంద్రబాబు ముందుకు సాగుతుండడం విశేష ం. బీసీల సంక్షేమానికి రూ.6,210 కోట్లు, పోలవరం ప్రాజెక్టుకు రూ.9వేల కోట్లు, సాంఘీక సంక్షేమా నికి రూ.3,221కోట్లు, గిరిజన సంక్షేమానికి రూ.4,176.61 కోట్లు కేటాయిం చి అన్ని వర్గాలకు భరోసా కల్పించారు...’

గత బడ్జెట్‌లకు ఈ బడ్జెట్‌కి పరిస్థితులు-నేపథ్యం చాలా వ్యత్యాసం ఉంది. ఒక ప్రత్యేక పరిస్తితిలో రాష్ట్ర బడ్జెట్‌ను శాసనసభలో ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు ప్రతిపాదించారు. కేంద్రం ఇచ్చినహామీలు నెరవేరకపోవడం, తగిన సహాయం రాష్ట్రానికి అందకపోవడంతో సమర్థవంతంగా వనరులను సమీకరించుకుంటూనే రాష్ట్ర ఆర్థిక స్థితిగతులను నిరాటంకంగా తీసుకువెళ్లే వ్యూహాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. అనేక ఆర్థిక ఒడిదుడుకుల మధ్య రూ.1,91,063 కోట్ల రాష్ట్రబడ్జెట్‌ను సమర్పించడం సాధ్యమైన విషయం కాదు. దీనిలో రూ. 1,08,162 కోట్లు అభివృద్ధి వ్యయం కింద వెళుతుంటే ఆదాయం లో మాత్రం పన్నులు, సుంకాల రూపంలో రూ.65,535 కోట్లు, కేంద్ర పన్నుల వాటా కింద రూ.33,929 కోట్లు ఖజానాకు చేకూరుతుంది. విభజన సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ రాష్ట్రం ఉన్న వనరులను సమతుల్యం చేసుకుంటూ ఎటు వంటి రాజీ లేకుండా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేసే ప్రయత్నం ఈ బడ్జెట్ ద్వారా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సారి కీలక అంశం 37 కొత్త పథకాలను ప్రకటించి వాటికి సరైన స్థాయిలో నిధులు కేటాయించడం. వీటిలో ముఖ్యంగా రూ.575 కోట్లు ఇళ్ల స్థలాల భూ సమీకం ణ కోసం కేటాయించడం, అంకుర పరిశ్రమలకు రూ.100 కోట్లు, అన్న క్యాం టీన్లకు రూ.200కోట్లు, ఆదరణ పథకం కింద రూ.750 కోట్లు కేటాయించి అన్ని వర్గాలకు అండగా నిలవడంచేలా బడ్జెట్ రూపొందింది. తల్లి, పిల్లల పౌష్టి కాహారం కోసం ప్రత్యేకంగా రూ.360 కోట్లు, హిజ్రాల సంక్షేమానికి రూ.20 కోట్లు కేటాయించి కీలకమైన వర్గాలను ఉపేక్షించలేమని రాష్ట్రప్రభుత్వం స్పష్టమైన సందేమిచ్చింది. నిరుద్యోగులకు బాసటగా ఉంటామంటూ బడ్జెట్‌లో రూ.1000కోట్లతో భారీ కేటాయింపు చేసి నిబద్ధతను చాటుకుంది.

### పెరగనున్న అప్పుల భారం

ఏటా రాబడుల కన్నాఖర్చులు పెరుగుతున్నాయి. ప్రభుత్వంఅప్పులపైనే ఆధా రపడాల్సి వస్తోంది. ఇవి కూడా అంచనాలను మించిపోతున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరం చివరినాటికి రూ.2,49,435 కోట్లకు ఈ అప్పుల భారం చేరుతుం దని అంచనా వేశారు. ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితిని దాటి రుణాలు సంపాదించే క్రమంలో కొత్త మార్గాలు అన్వేషిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అప్పులు చేస్తోంది. ఇందు కోసం కార్పొరేషన్లకు అప్పులు తీసుకునేందుకు మంత్రిమండలిలో ఆమోదం పొంది వాటి పరిమితిని పెంచి బ్యాంకుల నుంచి రుణాలు పొందుతోంది. ఆ రు ణాలను పీడీ ఖాతాలకు రప్పిస్తూ అక్కడి నుంచి ప్రభుత్వం తీసుకుని వ్యయం చేస్తోంది. రాష్ట్ర అప్పులను స్థూల జాతీయోత్పత్తితో పోల్చి చూస్తుంటారు. ఆ రకంగా చూస్తే అప్పుల వాటా తగ్గుతూ, ఎగబాకుతూ వస్తోంది. 2014- 15లో ఇది 28.25 శాతానికి పరిమితం కాగా ఆ తరువాత 28.50 శాతానికి, 2016-17లో ఇది గరిష్టంగా 28.79 శాతానికి చేరింది. 2017-18లో సవ రించిన అంచనాలను పరిశీలిస్తే మళ్లీ అప్పుల భారం స్థూల ఉత్పత్తితో పోలిస్తే కొంత తగ్గింది. అది 28.40 శాతానికి చేరింది. వచ్చే ఆర్థిక సంవత్సరం చివరి నాటికి మరికొంత పెరిగి 28.6శాతం వద్దకు చేరుతుందని ఆర్థిక శాఖ అంచ నాలను రూపొందించింది.

### సర్దుబాటు కాని రెవెన్యూ లోటు

ఆంధ్రప్రదేశ్ విభజన తరువాత రెవెన్యూ లోటును కేంద్రం భర్తీ చేయాల్సి ఉంది. 2014-15లో రాష్ట్రం రెవెన్యూ లోటును రూ.16,079 కోట్లుగా లెక్కిం చి కేంద్రం భర్తీ చేయాలని కోరింది. ఈవిషయంలో ఇప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాల మధ్య సరైన పొంతన లేదు. రాష్ట్రం ఏ ఆధారాలు చూపి అడుగుతున్నా ఇక్కడి నుంచి ఆర్థిక శాఖ అధికారులను పంపి చర్చలు జరిపినా ఫలితం రాలే దు. రాష్ట్రానికి సంబంధించి రావాల్సిన రెవెన్యూ రాబడులను పరిగణనలోకి తీసుకుని ఏర్పడిన లోటును భర్తీ చేస్తామని, పింఛన్లు, రుణమాఫీ, పీఆర్‌సీ బకా యిలతో తమకు సంబంధం లేదని కేంద్రం చెబుతోంది. అవరోధాలను అధిగ మిస్తూ అడుగులేస్తున్న ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలు, సేవా రంగాల్లో సానుకూల ఫలితాలు సాధిస్తోంది. తలసరి ఆదాయంలో మెరుగైన వృద్ధిని కనపరుస్తోంది. అసమానతలను తొలగించిప్రజలకు ఆరోగ్యం, సంపద, మెరుగైన మౌలిక సౌక ర్యాలు కల్పించాల్సిన అవసరాన్ని ‘సామాజిక ఆర్థిక గణన-2017-18’ గుర్తు చేసింది. ఈ నివేదికను కూడా ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టింది. రంగాల వారీ ప్రాధాన్యంలో భాగంగా వ్యవసాయంలో కరవు నివారణ చర్యలను వివరించింది. సంక్షేమానికి ఏటా రూ.60వేల కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం ప్రతి కుటుంటానికి రూ.10వేల ఆదాయం అందించే పథకాలను అమలు చేస్తున్న విషయాన్ని ప్రస్తావించింది. రాష్ట్ర తలసరి ఆదాయం 2015-16లో రూ.1,07,276 కోట్లు కాగా 2016-17లో అది రూ.1,23,664 కోట్లకు చేరింది. 2017-18 (అంచనా)లో రూ.1,42,054 కోట్లుగా ఉంది.

### ఐదేళ్లలో రెట్టింపు అయిన బడ్జెట్

ఆంధ్రప్రదేశ్ పునర్వవస్థీకరణ తరువాత కొత్త రాష్ట్రం అనేక ఆపసోపాలు పడుతూ ముందుకు సాగుతోంది. 2014-15లో నవ్యాంధ్రలో రూ.1,11,824 కోట్ల బడ్జెట్ అంచనాతో కొత్త ప్రయాణం మొదలు కాగా 2018-19 ఆర్థిక సంవత్సరానికి ఈ మొత్తం రూ.1,91,061 కోట్లకు చేరింది. అలానే 2018-19లో దాదాపు రూ.5,235 కోట్ల మేర రెవెన్యూ మిగులు ఉంటుందని యనమల రామకృష్ణుడు అంచనా సమర్పించారు. రెవెన్యూ ఆదా యం 1.55లక్షల కోట్లు ఉంటుందని పేర్కొన్నారు.2014-15లో బడ్జెట్ అంచనా రూ.1,11,824 కోట్లు కాగా వాస్తవంగా రూ.1,38,449.60 కోట్లు ఖర్చు చేశారు. 2015-16లో బడ్జెట్ అంచనా రూ.1,13,048 కోట్లు కాగా వాస్తవంగా రూ.1,49,434.96 కోట్లు ఖర్చు చేశారు. 2016-17లో బడ్జెట్ అంచనా రూ.1,35,688.69 కోట్లు కాగా వాస్తవంగా రూ.1,66,698.69 కోట్లు ఖర్చు చేశారు. 2017-18లో బడ్జెట్ అంచనా రూ.1,56,999.39 కోట్లు కాగా వాస్తవంగా రూ.1,59,822.25 కోట్లు ఖర్చు చేశారు. ప్రస్తుతం 2018-19 బడ్జెట్‌ను రూ.1,91,063.60 కోట్లుగా సమర్పించారు.

### సున్నితమైన సమస్యకు పరిష్కార మార్గం

11 నుంచి 50 సంవత్సరాల మధ్య వయసుగల మహిళలకు ఎదురయ్యే సున్నితమైన సమస్య రుతుస్రావం. అటువంటి సమయంలో తీసుకునే చర్యల విషయంలో చాలా మంది ఆర్థిక కారణాల వల్ల అనారోగ్యాన్ని పణంగా పెట్టాల్సిన పరిస్థితులను చూస్తున్నాం. ఈ సున్నితమైన సమస్యను దృష్టిలో పెట్టుకుని శానిటరీ నాప్‌కిన్స్‌ని డ్వాక్రా మహిళలు, ఇతర కౌమార బాలికలకు రాయితీలో అందచేయడానికి రూ.100కోట్లు కేటాయించడం ఈ బడ్జెట్‌లో మరో ప్రత్యేకం. స్కూళ్లకు వెళ్లే ఆడపిల్లలకు కూడా ప్రత్యేకంగా రూ.27కోట్లు కేటాయించి రాష్ట్ర ప్రభుత్వం చాలా ముఖ్య బాధ్యతను నెరవేర్చింది.

### ప్రధాన శాఖలకు భారీ కేటాయింపులు.

వ్యవసాయ అనుబంధ రంగాలకు 2017-18లో రూ.9090.91 కోట్లు కేటాయించగా ప్రస్తుతం 35.91వృద్ధిశాతంతో 2018-19లో రూ.12,355. 32 కోట్లు కేటాయించారు. గ్రామీణాభివృద్ధికి 2017-18లో రూ.19,565. 14 కోట్లు కేటాయించగా ప్రస్తుతం 6.39 వృద్ధి శాతంతో 2018-19లో రూ.20,815.98 కోట్లు కేటాయించారు. నీటి పారుదల, వరద నియంత్రణకు 2017-18లో రూ.12,770.26 కోట్లు కేటాయించగా ప్రస్తుతం 32.95 వృద్ధి శాతంతో 2018-19లో రూ.16,978.23 కోట్లు కేటాయించారు. సాధారణ విద్యకు 2017-18లో రూ.20,384.72 కోట్లు కేటాయించగా ప్రస్తుతం 18.65 వృద్ధి శాతంతో 2018-19లో రూ.24,185.75 కోట్లు కేటాయించారు. సంక్షేమానికి 2017-18లో రూ.11,361.52 కోట్లు కేటా యించగా ప్రస్తుతం 20.78 వృద్ధి శాతంతో 2018-19లో రూ.13,722.98 కోట్లు కేటాయించారు. ఎంతో కీలకమైన వైద్య రంగానికి 2017-18లో రూ. 7020.631 కోట్లు కేటాయించగా ప్రస్తుతం 20.55 వృద్ధి శాతంతో 2018-19లో రూ.8463.51 కోట్లు కేటాయించారు. అలాగే గ్రామీణ, పట్టణ గృహ నిర్మాణానికి 2018-19 బడ్జెట్‌లో రాష్ట్రప్రభుత్వం రూ.3,679.53 కోట్లు కేటా యించింది. 2017-18 కేటాయింపులు రూ.1,465.55 కోట్లు కంటే ఇది 152.36 శాతం అధికం. ఇతర ప్రభుత్వ శాఖలకంటే అత్యధికంగా పేదల గృహనిర్మాణం కోసం నిధులు కేటాయించారు.

### రైతన్నకు అండగా ప్రభుత్వ కేటాయింపులు

రైతన్న అండగా వ్యవసాయ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి శాసనసభ లో వ్యవసాయ బడ్జెట్‌ను రూ.19,078 కోట్లుగా ప్రకటించారు. ఇందులో రెవెన్యూ వ్యయం రూ.18,602 కోట్లు కాగా పెట్టుబడి వ్యయం రూ.467. 38 కోట్లుగాఉంది. ప్రధాన కేటాయింపులను చూస్తే నాలుగో విడత రుణ ఉపశమ నానికి రూ.4,100కోట్లు, ఉచిత విద్యుత్ కోసం రూ. 2,500కోట్లు కేటాయిం చారు. ఈ కేటాయింపుల్లో వ్యవసాయ శాఖకు రూ.7,607.49కోట్లు, ఉద్యాన వన శాఖకు రూ.1,517.88కోట్లు, పశుసంవర్ధక శాఖకు రూ.1,223. 40కోట్లు, మత్స్యశాఖకు రూ.386కోట్లు, మార్కెటింగ్‌కు రూ.208.11 కోట్లు కేటాయించారు. మరో ఏడాదిలో వస్తున్న ఎన్నికలను, ప్రజల ఆశలను, ఆకాంక్ష లను దృష్టిలో పెట్టుకుని ఎవరికీ లేదనకుండా...కాదనకుండా అటు అభివృద్ధిని, ఇటు సంక్షేమాన్ని సమతుల్యం చేస్తూ సామాజిక బాధ్యతను విస్మరించకుండా ఆర్థిక పద్దును ప్రవేశపెట్టారు.

## చరిత్రలో ఈరోజు

### మార్చి 11

1922: మాధవపెద్ది సత్యం, తెలుగు సినిమా నేపథ్య గాయకుడు, జననం
1689: శంభాజీ, మరాఠా సామ్రాజ్య స్థాపకుడైన ఛత్రపతి శివాజీ పెద్ద కుమారుడు, మరణం.
1955: అలెగ్జాండర్ ఫ్లెమింగ్, పెన్సిలిన్ ‌్న కనిపెట్టిన శాస్త్రవేత్త, మరణం.
1970: నేదునూరి గంగాధరం, ప్రముఖ తెలుగు రచయిత, మరణం.
1979: రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, ప్రముఖ తెలుగు సాహితీకారులు, మరణం.
2009: కె.ఎన్.వై.పతంజలి, ప్రముఖ తెలుగు రచయిత, మరణం.
2013: శ్రీపాద పినాకపాణి, శాస్త్రీయ సంగీత విద్వాంసుడు, వైద్య రం గంలో నిష్ణాతుడు, మరణం.

### శంభాజీ


శంభాజీ రాజే భోంస్లే మే 14, 1657న జన్మించి, మార్చి 11, 1689న మరణించాడు. మరాఠా సామ్రాజ్య స్థాపకుడైన ఛత్రపతి శివాజీ పెద్ద కుమారుడు. శంభాజీ అతని సలహాదారు కవికలష్‌లను ఔరంగజేబు సేనాని ముక్రబ్‌ఖాన్ సంగమేశ్వర్ వద్ద కుట్రచేసి బంధించాడు. మరాఠా సామ్రాజ్యంలోని కోటలన్నిటినీ తనకు స్వాధీనం చేసి, ఇస్లాంలోకి మారితే శంభాజీని వదిలేస్తానని బేరం పెట్టాడు మొఘల్ చక్రవర్తి. కనుగుడ్లు, గోళ్లూ పీకారు. బతికుండగానే చర్మం వలిచారు. ఏం చేసినా మతం మార నని ఒక్కకోటనూ స్వాధీనం చేయననీ ధైర్యంగా చెప్పాడు. మరణించిన శంభాజీ శవాన్ని ముక్కలుముక్కలు చేసి నదిలో పారేయమన్నాడు. అక్కడికి దగ్గరలోని వధు గ్రామస్థులు నదిలోకి దిగి శంభాజీ శరీర ఖండా లను వెదికి దొరికిన వాటిని అతికించి ఘనంగా అంతిమసంస్కారాలు జరిపించారు.

### అలెగ్జాండర్ ఫ్లెమింగ్



పెన్సిలిన్ ఇంజక్షన్ పేరు విననివారు ఉండరు. సర్వ రోగ నివారిణిగా పెన్సిలిన్ను ఇప్పటికీ తిరుగేలేదు. అటువంటి పెన్సిలిన్‌ను కనుగొన్న వాడు అలెగ్జాండర్ ఫ్లెమింగ్. ఆయన ఆగష్టు 6, 1881న జన్మించి, మార్చి 11, 1955న మరణించాడు. 1928లో ఈ బాక్టీరియాలజిస్టు పెన్సిలిన్ కనుక్కొని లోకానికి గొప్ప ఉపకారం చేసిన వాడయ్యాడు. అలెగ్జాండర్ ఫ్లెమింగ్ స్కాటిష్ జీవశాస్త్రవేత్త, వైద్య రసాయన శాస్త్రవేత్త (ఫార్మకాలగిస్ట్). ఈయన కనిపెట్టిన ఎంజైము లైసోజైము (1923), అంటి బయోటిక్ పెన్సిలిన్ (1928)లు ముఖ్యమైనవి. 1945లో వైద్య శాస్త్రానికి నోబెల్ బహుమానం ఈ పెన్సిలిన్ కనుగొన్నందుకు ఫ్లెమింగ్‌తో పాటు హోవార్డ్ ఫ్లోరె, ఎర్నెస్ట్ చెయిన్ అనే మరో ఇద్దరు శాస్త్రవేత్తలకు కూడా ఇచ్చారు. 1999లో టైమ్ మ్యాగజైన్ 20వ శతాబ్దపు 100 మంది ప్రముఖ వ్యక్తులలో ఒకడిగా గుర్తించింది.

### రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ




అనంతకృష్ణశర్మ జనవరి 23, 1893న జన్మించి, మార్చి 11, 1979న మరణించాడు. తెలుగు సాహిత్యపు ఆధునిక వచన శైలీ నిర్మాతలలో అగ్రేసరుడు. విమర్శనా రీతులలో వీరు మార్గదర్శకుడు. అన్నమా చార్యులు వారి కృతులను-కొన్ని వందల కృతులను- ఆయన స్వరపరచి తెలుగువారికి అందించాడు. వేమనపై సాధికారమైన విమర్శ గ్రంథాన్ని వెలువరించాడు. వేమన గురించి శర్మగారు తమ వేమ నోపన్యాసాలలో అనేక విషయాలు ఆవిష్కరించాడు. నిగమశర్మ అక్క, నాచన సోముని నవీన గుణములు, తిక్కన తీర్చిన సీతమ్మ, రాయలనాటి రసికత అనే ఆయన వ్యాసాలు బాగా ప్రసిద్ధమైనవి. కట్టమంచి రామలింగారెడ్డి గారితో పరిచయం కలిగి, వారి ఆహ్వానం మీద 1912లో మొట్టమొదటిసారిగా ఏర్పరచిన తెలుగు పండిత పదవిని అలంకరించాడు. అప్పటి నుండి తెలుగులో రచనా వ్యాసంగాలను మొదలుపెట్టాడు. కాళిదాసు రచించిన రఘువంశం ఆంధ్రీకరించాడు. ఆయన తాళ్లపాకసంకీర్తనలను పరిశీలించి కొన్నింటికి స్వరకల్పన గావించి వాటి గొప్పతనాన్ని చాటాడు. రేడియోకు ఆకాశవాణియని పేరు పెట్టినది ఆయనే.

# అగ్రకులాల ఆధిపత్యంలో సమిధలు బడుగులేనా?

నీలం ఉపేంద్ర, హైదరాబాద్
8341083544

- ఆది నుంచి చిన్నకులాలపై పెరుగుతున్న దాడులు
- రిజర్వేషన్లను సైతం స్వాహా చేస్తున్న నేతలు
- జనాభా దామాషాకు మంగళం పాడుతున్న పార్టీలు
- స్థానిక ఎన్నికలలో నిమ్న వర్గాలకు దక్కని పదవులు
- అమాయక మహిళలపైనా పెరిగిన అత్యాచారాలు



అగ్రకులాలు కింది కులాల ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, చాకలి, మంగలి, వడ్డెర తదితర చిన్న కులాలపై దాడులు చేసేవి. అఘా యిత్యాలకు పాల్పడేవి. ఇప్పుడు ధనాధిపత్యఅగ్రకులాలకు జనాధిక్యబీసీ కులాలు మున్నూరుకావు, గౌడ, యాదవ, ముదిరాజ్ తోడయ్యి నోరులేని చిన్న కులాలపై దాడులకు తెగబడుతున్నాయి. గ్రామ బహిష్కరణలు చేస్తు స్థానిక సంస్థల్లో పదవులను తమ జనవాటాకు మించి పొందుతున్నారు. అసెంబ్లీ, పార్లమెంటు స్థానాల్లోనూ ఈ కులాలకు ప్రాతినిథ్యం ఉంది. 30 ఏళ్లుగా స్థానిక సంస్థల బీసీ రిజర్వేషన్లలో ఏబీసీడీ వర్గీకరణ లేకపోవడం వీటికి కలసి వచ్చింది. అందుకే ఈ కులాలవారు ఏనాడూ స్థానిక సంస్థల్లోని రిజర్వేషన్లను వర్గీకరించాలని డిమాండ్ చేయలేదు. అధికార రుచిని, పలుకుబడిని ఈ జనాధిక్య బీసీ కులా లు సంపాదించుకు న్నాయి. విద్యాపరంగా కూడా మెరుగైన స్థితిలో ఉండి ఉద్యోగస్వామ్యాన్ని పెంపొందించుకున్నాయి. వారసత్వకులసరుకు ఈ కులాలకు ధనాన్ని తెచ్చిపెడుతోంది. నిచ్చెనమెట్ల కుల వ్యవస్థ ఎలాగూ కింది కులాలపై సామాజిక ఆధిపత్యం, పెద్దరికం కల్పించింది. ఎన్నికల్లో అగ్రకుల, పాలక పార్టీలకు ఎక్కువ ఓట్లు కావాలి. కాబట్టే గ్రామాలలో ఆ పార్టీల ఏజెంట్లు (ధనాధిపత్య అగ్రకుల నేతలు) ఈ జనాధిక్య కులాలతో మిలాఖత్ అవుతున్నా రు. ఈ క్రమమంతా జనాధిక్య బీసీ కులాలకు ఒకరకమైన ఆధిపత్యాన్ని, కుల అహంకారాన్ని కలుగచేసింది. ఈ నేపథ్యమే కిందికులాలపై అఘాయిత్యాలకు, దాడులకు దన్ను ఇస్తోంది. తెలంగాణలోని జనాధిక్య బీసీ కులాలు తమ జనాభా కంటే అధికంగా పదవులను అనుభవిస్తు న్నా యో అంకెల్లో చూద్దాం.

రాష్ట్రంలో మొత్తం జెడ్పీటీసీ స్థానాలు 441. బీసీ రిజర్వేషన్లు 29 శాతం. రిజర్వేషన్ల ప్రకారం బీసీలకు దక్కాల్సినవి కేవలం 128 స్థానాలు. కానీ, బీసీలు ఇప్పుడెన్ని పదవులను కలిగి ఉన్నాయో తెలుసా? 196 జెడ్పీటీసీ పదవులను బీసీలు అనుభవిస్తున్నారు. అంటే రిజర్వేషన్ కల్పించిన వాటి కంటే చాలా ఎక్కు వస్థానాలను బీసీలు సొంతం చేసుకున్నారు. వాస్తవానికి చిన్న బీసీ కులాలేమో తమ జనాభా వాటా కంటే తక్కువ పదవులను చేజిక్కించుకోగలిగాయి. ఈ మిగులు పదవులన్నీ జనాధిక్య బీసీ కులాలు కొల్లగొట్టాయి. ఈ కొల్లగొట్టడానికి ఏమిటి ఆధారమంటే... ఇదిగో ఈ లెక్కలను చూడండి. 441 జెడ్పీటీసీల్లో మున్నూరుకావులు 45, గౌడ సామాజిక వర్గం 37, యాదవులు 24, ముదిరాజ్ లు 15, పద్మశాలిలు 16 స్థానాలను పొందారు. నిజానికి చాకలి జనాభా( సు మారు 6 శాతం)ను బట్టి ఈ కులానికి 25 మంది జెడ్పీటీసీలు ఉండాలి. కానీ, ఉన్నదికేవలం ఒక్కరు . చాకళ్లకు రావాల్సిన 24 పదవులు ఈ పెద్ద కులాలకు సంక్రమించి చిన్న కులాలపై దాడులు, అత్యా చారాలు చేస్తున్నాయి.ఎంపీటీసీ పదవుల్లోనూ అంతే. రాష్ట్రంలో మొత్తం ఎంపీటీసీ స్థానాలు 6,490. రిజర్వేషన్ల ప్రకారం బీసీలకు కేవలం 1,900 స్థానాలు దక్కాలి. కానీ, బీసీలు అనుభ విస్తున్న పదవులు సంఖ్య 3,267. వాటిల్లో గౌడ్‌లు 733, యాదవులు467, మున్నూ రుకావు457, ముది రాజ్‌లు 418. మరి చాకళ్లు కేవలం 73 ఎంపీ టీసీ స్థానాలే దక్కించుకున్నారు. ఈ భారీ వ్యత్యాసం, ఈ భారీ మిగులు పదవులు చాలవా... పెద్ద కులాలకు కుల అహంకారం పెరగడానికి, ఆధిపత్యం చెలాయించడానికి, దాడులకు పాల్పడడానికి? ఈ వ్యత్యాసం సుస్పష్టం. రాజకీ యాధిపత్యాన్ని కొనసా గించడానికి.. ఈ మిగులు పదవులు చాలవా? ఆర్థిక, సామాజిక పెత్తనాన్ని చాటుకోవడానికి? ఇక సర్పంచ్‌ల స్థానాలను పరిశీలిస్తే... తెలంగాణ రాష్ట్రంలో మొత్తం సర్పంచ్‌ల సంఖ్య 8,692. రిజర్వేషన్ల ప్రకారం బీసీలకు దక్కాల్సినవి ఎన్నంటే.. కేవలం 2,800.కానీ, బీసీలు అను భవిస్తున్న సర్పంచ్ పద వుల సంఖ్య 4,141. వీటిల్లో గౌడ్లు 818, ముదిరాజ్‌లు 625, మున్నూరు కావు 549, యాదవులు 560 పదవులు అనుభవిస్తున్నారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను వర్గీకరిస్తే వచ్చే వాటా కంటే అధికంగా ఆయా పదవును ఈ జనాధిక్య బీసీ కులాలు కొల్లగొడుతున్నట్లు ఈ లెక్కలు చెప్పడం లేదా? ఇప్పుడు చెప్పండి? గ్రామాల్లో జనాధిక్య బీసీ కులాలు ప్రదర్శించేది కుల దురహంకారం కాదనగలరా? ఈ జనాధిక్య కుల దురహంకారం, అగ్రకుల దురహంకారాన్ని మరిపించేవిధంగా దాడులు, గ్రామ బహిష్కరణలు, అత్యాచా రాలు చేసిన ఉదం తాలు కోకొల్లలు. అంబేద్కర్, పూలే ఆలోచనల వెలుగులో కొత్త కుల విముక్తి సిద్ధాంతాన్ని, కొత్త సూత్రాలను కనిపెట్టండి. మీరు ఇప్పటికే పుస్తకాల్లో చదువుకొని, ఒకదాని నుంచి మరో దానిలోకి ఎత్తి రాసుకొని రూపొందించుకున్న సిద్ధాంతంలో ఇరుక్కుపోవడానికి మేము సిద్ధంగా లేము. మా సామాజిక స్థితిగతులను, నిర్థిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా విశ్లేషించి కొత్త సిద్ధాంతం రాయండి. హెచ్చుతగ్గులు లేని, కలిమి, లేమి లేని, వెక్కువోడు, తక్కువోడు లేని మరో ప్రపంచానికి దారులు వేయండి.




# ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి ఈ-వే బిల్లు

న్యూఢిల్లీ: జీఎస్‌టీ ఎగవేతను నిరోధించేందుకు ప్రవేశపెట్టిన ఈ-వే(ఎలక్ట్రానిక్-వే) బిల్లు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది. ఏప్రిల్ 1 నుంచి దశల వారీగా రాష్ట్రాల మధ్య జరిగే సరకు రవాణాకు ఈ-వే బిల్లు ఉంటుందని కేంద్ర ఆర్థికశాఖ తెలిపింది. జూన్ 1 నాటికి దేశవ్యాప్తంగా ఈ-వే బిల్లు అమల్లోకి వస్తుంది పేర్కొంది. ఈ మేరకు శనివారం జరిగిన జీఎస్‌టీ మండలి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. శనివారం దిల్లీలో 26వ జీఎస్‌టీ మండలి సమావేశం జరిగింది. కాగా.. జీఎస్‌టీ రిటర్న్‌ల సరళీకరణపై ఈ సమావేశంలోనూ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. సరళీకరణ ప్రక్రియపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో మరోసారి ఈ అంశాన్ని వాయిదా వేశారు. దీంతో మరో మూడు నెలల పాటు జీఎస్‌టీఆర్ 3బీ ఫైలింగ్‌ను పొడిగిస్తున్నట్లు ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ తెలిపారు.

ఈ-వే బిల్లు అంటే: రెండు రాష్ట్రాల మధ్య రూ.50వేలకు మించి విలువ గల సరకులు రవాణా చేయాలంటే ఈ-వే బిల్లు ఉండాలి. దీని ఆధారంగా సరకు ఎక్కడి నుంచి ఎక్కడికి రవాణా అవుతుందో ట్రాక్ చేసే అవకాశం ప్రభుత్వానికి ఉంటుంది. తక్కువ ఆదాయాన్ని చూపడం, పన్నుల ఎగవేత వంటి వాటిని ఈ ప్రక్రియ ద్వారా అరికట్టవచ్చు.

# భారత్, ఫ్రాన్స్ మధ్య 14 కీలక ఒప్పందాలు

- సంతకాలు చేసిన ఇరు దేశాల ప్రతినిధులు
- 13 బిలియన్ యూరోల కాంట్రాక్టుల మీద ఇరు దేశాలు సంతకాలు
- రక్షణ, శాస్త్ర సాంకేతిక, మౌలిక వసతుల రంగాల్లో ఫ్రాన్స్ భారీ పెట్టుబడులు
- హిందూ మహాసముద్ర తీర ప్రాంతాల భద్రతపై చర్చ
- ఇరు దేశాల మధ్య రక్షణ సహకారానికి కీలక ప్రాధాన్యం
- మేక్ ఇన్ ఇండియాలో భారీగా పెట్టుబడులు పెట్టాలని మోదీ వినతి

న్యూఢిల్లీ: భారత్, ఫ్రాన్స్ దేశాల మధ్య 14 కీలక ఒప్పందాలపై ఇరు దేశాల ప్రతినిధులు సంతకాలు చేశారు. నాలుగు రోజుల పర్యటన నిమిత్తం ఫ్రాన్స్ దేశాధ్యక్షుడు ఇమాన్యుయెల్ మాక్రాన్ భారత్ వచ్చారు. ఆయన ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ భారత పర్యటనలో మొదటిరోజైన శనివారం 13 బిలియన్ యూరోల కాంట్రాక్టుల మీద భారత్, ఫ్రాన్స్ దేశాలు సంతకాలు చేశారు. అలాగే నాలెడ్జ్ సమ్మిట్ లో భాగంగా ఇరు దేశాలకు చెందిన 200మంది ప్రముఖులతో పాటు ప్రధాని మోదీ, మాక్రాన్ సమావేశమయ్యారు. హిందూ మహాసముద్ర తీర ప్రాంతాల భద్రత గురించి ప్రత్యేకంగా చర్చించారు. విద్యకు సంబంధించిన అవసరాలు, వలసలు వంటి సమస్యలపై ఇరు దేశాల భాగస్వామ్యంపై చర్చించారు. మేక్రాన్‌తో కలిసి మీడియాతో మోదీ మాట్లాడుతూ హిందూ మహాసముద్రంలో విస్తృత సహకారానికి ఉమ్మడి వ్యూహాత్మక స్వప్నం (విజన్) ప్రకటించారు. ప్రజల మధ్య సంబంధాల గురించి మాట్లాడుతూ మైగ్రెంట్ మొబిలిటీ, పార్టనర్‌షిప్‌ను పటిష్టపరిచేందుకు భారతదేశం సిద్ధంగా ఉందన్నారు. భారతదేశం, ఫ్రాన్స్ రక్షణ సహకారంలో నూతన చరిత్రను ఆవిష్కరించే ఒప్పందం కుదరడం హర్షణీయమన్నారు. ఇరు దేశాల యువత ఒకరి దేశం గురించి మరొకరు తెలుసుకోవడం అవసరమని, దీని కోసం తాము రెండు ఒప్పందాలను కుదుర్చుకున్నామని చెప్పారు. మేక్ ఇన్ ఇండియా కార్యక్రమంలో భారీగా పెట్టుబడులు పెట్టాలని ఫ్రాన్స్‌ను మోదీ ఆహ్వానించారు.

ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ మాట్లాడుతూ ఇరు దేశాల మధ్య రక్షణ సహకారానికి కీలక ప్రాధాన్యం ఉందన్నారు. ఉగ్రవాదం, రెచ్చగొట్టి, ప్రేరేపించడం వంటి ముప్పులపై పోరాడాలని ఇరు దేశాలు నిర్ణయించినట్లు తెలిపారు. కాగా గతంలో భారత్‌లో రక్షణ, శాస్త్ర సాంకేతిక, మౌలిక వసతుల రంగాల్లో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ఫ్రాన్స్ అంగీకరించింది. వివిధ రంగాల్లో దాదాపు రూ.13,200 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు అంగీకారం కుదిరింది. భారత వైమానిక దళం అవసరాలను దృష్టిలో పెట్టుకుని 36 రఫాలే యుద్ధ విమానాలను కొనుగోలు చేయనున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. కాగా భారత్ పర్యటనకు విచ్చేసిన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ దంపతులకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అధికారిక స్వాగతం పలికారు. అనంతరం మెక్రాన్ త్రివిధ దళాల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మెక్రాన్ మాట్లాడుతూ.. భారత్, ఫ్రాన్స్ మధ్య మంచి కెమిస్ట్రీ ఉందన్నారు. ఈ రెండు ప్రజాస్వామ్య దేశాలు చారిత్రక సత్సంబంధాలను కలిగిఉన్నాయన్నారు. కాగా మెక్రాన్ నాలుగు రోజుల పాటు భారత్‌లో పర్యటించనున్నారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక ఆర్థిక, రాజకీయ సంబంధాలను బలోపేతం చేసుకునే లక్ష్యంతో ఈ పర్యటన సాగుతుందని విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. మరోవైపు భారత్-ఫ్రాన్స్ దేశాలు ఉమ్మడిగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ సౌర కూటమి(ఐఎస్ఏ) ఆవిర్భావ సదస్సుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఢిల్లీలో 11న ఈ సదస్సు జరగనుంది.



# రూ. 50 కోట్లకు పైగా రుణానికి పాస్‌పోర్టుతో లింక్

- భారీ రుణం తీసుకోవాలంటే పాస్-పోర్టు వివరాలు మస్ట్
- మరింత స్పష్టత ఇచ్చిన కేంద్ర ఆర్థిక శాఖ
- నేరగాళ్లు విదేశాలకు పారిపోకుండా ఉండేందుకే
- బ్యాంకింగ్ వ్యవస్థలో పారదర్శకత కోసమేనంటున్న ఆర్థిక శాఖ

న్యూఢిల్లీ: బ్యాంకుల నుంచి రూ. 50కోట్ల కంటే ఎక్కువ రుణాలు తీసుకునేవారు పాస్‌పోర్టు వివరాలను ఇవ్వాలంటూ వస్తున్న వార్తలపై మరింత స్పష్టత వచ్చింది. బ్యాంకులు రూ. 50 కోట్ల పైబడి రుణాలు ఇవ్వాలంటే ఆ ఖాతాదారుల పాస్‌పోర్టు వివరాలు తప్పనిసరి అని కేంద్ర ఆర్థికశాఖ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. రుణాలు తీసుకుని మోసగాళ్లు విదేశాలకు




పారిపోకుండా అడ్డుకునేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

బాధ్యతాయుతమైన, పారదర్శకమైన బ్యాంకింగ్ వ్యవస్థ కోసం ఇది మరో అడుగు. బ్యాంకుల నుంచి రూ. 50కోట్ల కంటే ఎక్కువ రుణాలు తీసుకుంటే పాస్‌పోర్ట్ వివరాలు తప్పనిసరి. బ్యాంకు మోసాల కేసులను పరిష్కరించేందుకు ఇది చాలా ఉపయోగపడుతుంది అని ఆర్థిక సేవల కార్యదర్శి రాజీవ్‌కుమార్ ట్వీట్ చేశారు. కొత్తగా రూ. 50కోట్ల కంటే ఎక్కువ రుణాలు తీసుకునే వారి నుంచి పాస్‌పోర్టు వివరాలను తీసుకోవాలని బ్యాంకులను ఆదేశించినట్లు తెలిపారు. ఇక ఇప్పటికే అంతమొత్తంలో రుణాలు తీసుకున్న వారి నుంచి 45 రోజుల్లోగా పాస్ పోర్టు వివరాలు తీసుకోవాలని సూచించామన్నారు. ఒకవేళ సదరు ఖాతాదారులు వివరాలు ఇవ్వకపోతే బ్యాంకులు వారిపై చర్యలు తీసుకోవచ్చని తెలిపారు. ఇటీవల పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో రూ. 12వేల కోట్ల భారీ కుంభకోణం వెలుగుచూసిన విషయం తెలిసిందే. ఈ స్కాంలో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ, ఆయన బంధువు మెహుల్ ఛౌక్సీ దేశం విడిచి వెళ్లిపోయారు. అంతకుముందు విజయ్ మాల్యా, జతిన్ మోహతా తదితరులు కూడా బ్యాంకులను మోసగించి విదేశాలకు పారిపోయిన విషయం తెలిసిందే. ఇలాంటి వారికి అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే అధిక మొత్తంలో బ్యాంకుల నుంచి రుణాలు తీసుకునేవారి పట్ల నిఘా ఉంచాలని చూస్తోంది. అలాంటి వారి నుంచి పాస్‌పోర్టు వివరాలు ముందుగానే తీసుకుంటే వారు దేశం విడిచి వెళ్లకుండా ఆపొచ్చని భావిస్తోంది.

ఇదిలా ఉండగా.. బ్యాంకు మోసాల నేపథ్యంలో తీసుకొచ్చిన ఫ్యుగిటివ్ ఎకనమిక్ అఫెండర్స్ బిల్లుకు గతవారం కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ బిల్లు చట్టరూపం దాల్చితే నీరవ్ మోదీలా దేశం విడిచి వెళ్లిపోయిన వారి నుంచి బకాయిలు వసూలు చేసుకునేందుకు వారి ఆస్తులను వీలైనంత వెంటనే విక్రయించే అవకాశం బ్యాంకులకు ఉంటుంది. రూ. 100కోట్ల పైబడి రుణాలు తీసుకుని తిరిగి చెల్లించని వారికి కూడా ఈ చట్టం వర్తిస్తుంది.




## ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంకుపై భారీ జరిమానా




న్యూఢిల్లీ: భారతీ ఎయిర్‌టెల్‌కు చెందిన ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంకుకు భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) భారీ జరిమానా విధించింది. ఖాతాదారుల కేవైసీలను దుర్వినియోగం చేసినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంకుకు రూ.5 కోట్ల జరిమానా విధించింది. ఖాతాదారుల ఇష్టాఇష్టాలతో పనిలేకుండా, వారికి ఏమాత్రం సమాచారం ఇవ్వకుండా వారి పేరున ఖాతాలు సృష్టించినట్టు తేలడంతోనే జరిమానా విధించినట్టు ఆర్‌బీఐ స్పష్టం చేసింది. 23 లక్షల మందికిపైగా వినియోగదారుల ఖాతాల్లోకి రూ.47కోట్లకు పైగా సొమ్మును మళ్లించినట్టు ఎయిర్‌టెల్‌పై అభియోగాలున్నాయి. నిజానికి ఆ ఖాతాలు తమ పేరును ఓపెన్ అయినట్టు కూడా వారికి తెలియకపోవడం గమనార్హం. ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంకుపై 1949 నాటి బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టంలోని ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం వివిధ సెక్షన్ల కింద ఈ జరిమానాను విధించినట్టు ఆర్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ జోస్ జె.కట్టూర్ పేర్కొన్నారు.

## సర్వీస్ ప్రొవైడర్లపై మరో పోరు



చెన్నై: అధిక ఛార్జీలు తీసుకుంటోన్న సర్వీస్ ప్రొవైడర్ల తీరుకి వ్యతిరేకంగా దక్షిణాదిన సినీ నిర్మాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తోన్న విషయం తెలిసిందే. ఇటీవలే సినిమా థియేటర్లను బంద్ చేసి నిరసన తెలపగా, ఇప్పుడు షూటింగ్‌లు, పోస్ట్ ప్రొడక్షన్ పనులను కూడా నిలిపివేయాలని నిర్ణయించుకున్నారు. అంతేకాక కొత్త సినిమాల విడుదలను కూడా నిలిపేయనున్నట్లు స్పష్టం చేశారు. ఈ పోరుని ఈ నెల 16 నుంచి ప్రారంభిస్తామని తమిళ్ ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ (టీఎఫ్‌పీసీ) తెలిపింది. క్యూబ్, యూఎఫ్‌వోలు ఇక నుంచి వర్చువల్ ప్రింట్ ఫీజును వసూలు చేయకూడదని, టికెట్ ధరలను నియంత్రణలో ఉంచాలని, ఆన్‌లైన్ బుకింగ్ ఛార్జీలను తగ్గించాలని, అన్ని థియేటర్లలో టికెట్లను కంప్యూటరైజ్డ్ చేయాలని, చిన్న సినిమాల ప్రదర్శనకు తగిన థియేటర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని టీఎఫ్‌పీసీ డిమాండ్ చేసింది. కాగా, తెలుగు రాష్ట్రాల్లో సినిమా థియేటర్ల బంద్ ను విరమించుకోగా, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో మాత్రం బంద్ యథావిధిగా కొనసాగుతూనే ఉంది.

## యూరోమనీ సమీక్షలో హెచ్‌డీఎఫ్‌సీకి నంబర్ వన్ ర్యాంకు




న్యూఢిల్లీ: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుకు చెందిన ప్రైవేట్ బ్యాంకింగ్ గ్రూపు(పీబీజీ) అధిక నెట్‌వర్త్ వినియోగదారుల విభాగంలో నంబర్ వన్ ర్యాంకును సాధించింది. యూరోమనీ గత పది సంవత్సరాలుగా నిర్వహించుకుంటూ వస్తున్న ఈ సమీక్షలో హెచ్‌డీఎఫ్‌సీకి చెందిన పీబీజీ వరుసగా తొమ్మిదవసారి ఈ గుర్తింపును అందుకుంది. ప్రైవేటు బ్యాంకులు, వెల్త్ మేనేజర్లు బ్యాంకింగ్ రంగంలోని దిగ్గజాలను సంస్థలను గుర్తించేందుకు వారి పోటీదారుల సేవలను పరిగణలోకి తీసుకుని ఈ సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారి రాకేష్ కే సింగ్ మాట్లాడుతూ వినియోగదారులపై మేము దృష్టిసారిస్తున్నందుకు తగిన గుర్తింపు దక్కినందుకు ఆనందంగా ఉందన్నారు.


## వడ్డీ రేట్లను పెంచే ఆలోచనలో ఆర్‌బీఐ

న్యూఢిల్లీ: కీలక వడ్డీరేట్లపై గతకొంత కాలంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) తటస్థ వైఖరిని కొనసాగిస్తూ వస్తోంది. ఇటీవల ఫిబ్రవరిలో జరిగిన 2017-18 ఆర్థిక సంవత్సరం చివరి ద్వైమాసిక పరపతి విధాన సమీక్షలోనూ వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచింది. అయితే 2018-19 ఆర్థిక సంవత్సరంలో జరగబోయే సమీక్షల్లో వడ్డీ రేటును 0.25శాతం పెంచే అవకాశముందట. ద్రవ్యోల్బణ భయాలు, ద్రవ్యలోటు పెరగడం వల్లే వడ్డీ రేట్లు పెరిగే అవకాశాలున్నాయని కేర్ రేటింగ్స్ అనే సంస్థ తాజాగా విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. చమురు ధరలు, ఇంటి అద్దెలు పెరగడం తదితర కారణాల వల్ల ద్రవ్యోల్బణం పెరుగుతుందని ఆర్‌బీఐ అంచనా వేస్తోంది. 2018-19 ఆర్థిక సంవత్సరం తొలి అర్ధభాగంలో ద్రవ్యోల్బణం 5.1శాతం నుంచి 5.6శాతం వరకు పెరిగే అవకాశముందని భావిస్తోంది. ఆ తర్వాత తగ్గే సూచనలు కన్పిస్తున్నాయని ఇటీవల జరిగిన సమీక్షలో పేర్కొంది. ఇదే సమయంలో ద్రవ్యలోటు కూడా పెరగడంతో వడ్డీ రేట్లను పెంచక తప్పదని నివేదిక చెబుతోంది. 2018లో రెపో రేటును 0.25శాతం పెంచే అవకాశముంది. ప్రస్తుతం ఇది 6శాతంగా ఉంది అని నివేదిక వెల్లడించింది. 2018-19 ఆర్థిక సంవత్సరానికి గానూ ఆర్‌బీఐ తొలి ద్వైమాసిక పరపతి విధాన కమిటీ సమావేశాలు ఏప్రిల్ 4-5న జరగనున్నాయి.

# నోటాకు పెరుగుతున్న ఆదరణ

- ఇప్పటి వరకు నోటా మీట నొక్కిన ఓటర్లు 1.33 కోట్ల మంది
- దేశ ఎన్నికల్లో 2013 నుంచి నోటా ఆప్షన్ అందుబాటులోకి
- రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో నోటా దక్కించుకున్న ఓట్లు 2.70 లక్షలు

న్యూఢిల్లీ: భారతదేశ ఎన్నికల్లో విప్లవాత్మక మార్పుగా భావించే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎంలు)పై ఏర్పాటు చేసిన 'నన్ ఆఫ్ ది ఎబౌవ్ (నోటా)' ఆప్షన్‌ను గత ఐదేళ్ల కాలంలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఎంతమంది ఎంచుకున్నారన్న దానిపై అసోసియేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్), నేషనల్ ఎలక్షన్ వాచ్ (న్యూ) ఓ నివేదికను విడుదల చేశాయి. దాని ప్రకారం, 2013 నుంచి ఇప్పటిదాకా దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో నోటా మీటను 1.33 కోట్ల మంది నొక్కారు. అంటే, సగటున రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో నోటా దక్కించుకున్న ఓట్లు 2.70 లక్షలన్నమాట. గోవా, ఢిల్లీలోని ఎన్‌సీటీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ఎన్నికల్లో ఓటర్లు అత్యధిక సంఖ్యలో నోటా ఆప్షన్‌కే మొగ్గు చూపారు. తద్వారా సంబంధిత నియోజకవర్గాల్లో




నోటా ఓట్ల శాతం మూడు లేదా నాలుగో స్థానాన్ని ఆక్రమించింది. 2017లో గోవాలోని పనాజీ, వాల్పోయి నియోజకవర్గాలకు జరిగిన ఉప ఎన్నికల్లో వరుసగా 301 (1.94 శాతం), 458 (1.99శాతం) ఓట్లతో నోటా మూడో స్థానంలో నిలిచింది. కాగా, 2014లో తొలిసారిగా లోక్‌సభ ఎన్నికలకు నోటా ఆప్షన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో నోటాకి దక్కిన మొత్తం ఓట్లు 60,02,942. తమిళనాడులోని నీలగిరి లోక్‌సభ స్థానానికి జరిగిన ఎన్నికల్లో అత్యధికంగా 46,559 నోటా ఓట్లు వచ్చాయి. నోటా ఓట్లు అత్యల్పంగా లక్షద్వీప్ (123)లో నమోదయ్యాయి. ఇక రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల విషయానికొస్తే, ఈ ఆప్షన్‌ను తొలుత ఛత్తీస్‌గఢ్, మిజోరాం, రాజస్థాన్, ఢిల్లీ, మధ్యప్రదేశ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో అమలు చేశారు. 2015లో అత్యధిక శాతం అంటే 2.08 శాతం (9,83,176 ఓట్లు) నోటా ఓట్లు పోల్ అయ్యాయి. బీహార్ (9,47,279), ఎన్‌సీటీ ఢిల్లీ (35,897) రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు నోటాకి ఎక్కువగా మొగ్గు చూపారు.

## 'ఐఎన్‌టిఎస్ఓ'లో శ్రీచైతన్య విజయభేరి

హైదరాబాద్: దేశవ్యాప్తంగా 3 నుంచి 10 వతరగతి విద్యార్థులకు జరిగిన ఐఎన్‌టిఎస్ఓ పరీక్షా ఫలితాలలో శ్రీచైతన్య స్కూల్ తిరుగులేని ఆధిపత్యాన్ని చాటిందని సంస్థ తెలిపింది. ఆలిండియా లెవెల్ లో అత్యధికంగా 75 మంది విద్యార్థులు ల్యాప్‌టాప్‌లను గ్రాండ్ ప్రైజ్‌లుగా అందుకోవడంతోపాటు 82 మంది విద్యార్థులు ట్యాబ్స్ గెలుపొందారు. ఆలిండియా మొదటి ర్యాంకును 27 మంది విద్యార్థులు, 2వ ర్యాంకును 25 మంది విద్యార్థులు, 3 వ ర్యాంకును 30మంది విద్యార్థులు సాధించారు. వీరితోపాటు మరో 114 మంది విద్యార్థులు ప్రత్యేక బహుమతులను గెలుచుకున్నారని శ్రీచైతన్య విద్యాసంస్థల అధినేత డాక్టర్ బీఎస్ రావు తెలిపారు. దేశంలో మరే ఇతర విద్యాసంస్థ ఇంటి ఘన ఫలితాలను సాధించలేదని పేర్కొన్నారు.

## ట్విట్టర్‌లో యూజర్లందరికీ 'బ్లూ టిక్ వెరిఫికేషన్'




న్యూఢిల్లీ: సోషల్ మీడియా దిగ్గజం ట్విట్టర్ 'బ్లూ టిక్ వెరిఫికేషన్' ప్రక్రియను చేపడుతున్నట్లు ఆ సంస్థ సీఈవో జాక్ డోర్సే తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో అత్యంత నమ్మకమైన సర్వీసులను వినియోగదారులకు అందించి వారికీ తమపై ఉన్న విశ్వాసం మరింతగా పెంచే దిశగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇంతకు ముందు ఈ బ్లూటిక్ మార్కు కేవలం సినిమా వాళ్ళకి, రాజకీయ నాయకులకి, క్రీడాకారులకు అలాగే ఇతర వీఐపీలకు మాత్రమే ఉండేది. గత ఏడాది నవంబర్ లో నిలిపివేసిన ఈ బ్లూ టిక్ వెరిఫికేషన్ ఇవుడు ట్విట్టర్ వినియోగదారులందరికి అందించే యోచనలో ఉన్నట్లు ఆ సంస్థ తెలిపింది. కాగా ఈ ధ్రువీకరణ ప్రక్రియ కోసం ఎలాంటి విధానం అనుసరించాలనేది మాత్రం ట్విట్టర్ తెలుపలేదు.

## దిగుమతి సుంకం నుంచి ఆస్ట్రేలియాకు మినహాయింపు: ట్రంప్

వాషింగ్టన్: అమెరికా విధిస్తున్న దిగుమతి సుంకం నుంచి ఆస్ట్రేలియాకు త్వరలోనే మినహాయింపు ఇవ్వనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. ఇటీవల ట్రంప్ ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే స్టీల్‌పై 25శాతం, ఉక్కుపై 10శాతం దిగుమతి సుంకాలను పెంచిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించిన ఆదేశాలపై ట్రంప్ ఇటీవలే సంతకం చేశారు. అయితే అంతకంటే ముందే ఈ నిబంధన నుంచి కెనడా, మెక్సికోలకు మినహాయింపు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సుంకాల నుంచి మినహాయింపు కావాలనుకుంటే ఆ దేశాలు తమతో చర్చలు జరపాలని పేర్కొన్నారు. అయితే ఇప్పుడు ఆస్ట్రేలియాకు దీని నుంచి మినహాయింపు ఇస్తున్నారు. తాను ఆస్ట్రేలియా ప్రధాని మాల్కోమ్ టర్న్‌బుల్‌తో మాట్లాడానని ట్రంప్ తెలిపారు. టర్న్‌బుల్ కూడా ఒకే విధమైన మిలిటరీ, వాణిజ్య సంబధాలకు కట్టుబడి ఉన్నట్లు చెప్పారని, తాము భద్రతా పరమైన ఒప్పందంపై సంతకాలు చేయనున్నామని, దీంతో తమ మిత్ర దేశమైన ఆస్ట్రేలియాపై స్టీలు, ఉక్కుపై దిగుమతులపై సుంకాలు విధించబోమని ట్రంప్ ట్వీట్ చేశారు.

తాను ట్రంప్‌తో మాట్లాడినట్లు టర్న్‌బుల్ కూడా వెల్లడించారు. వాణిజ్యం, భద్రత అంశాలపై ట్రంప్‌తో తన సంభాషణ చాలా గొప్పగా సాగిందన్నారు. ఆస్ట్రేలియా-అమెరికాల మధ్య వాణిజ్యం చాలా పారదర్శకంగా, పరస్పరం ఒకే విధంగా ఉంటుందని తెలిపారు. అమెరికా విధించిన కొత్త దిగుమతి సుంకాల నుంచి ఆస్ట్రేలియాకు మినహాయింపు ఇచ్చినందుకు ధన్యవాదాలు చెప్పారు. తమ దేశం నుంచి అమెరికాకు దిగుమతి అయ్యే స్టీలు, అల్యూమినియంపై సుంకాలకు మినహాయింపు ఇచ్చినందువల్ల ఆస్ట్రేలియా, అమెరికాల్లో కూడా ఉద్యోగాలకు మంచి జరుగుతుందని చెబుతూ ట్రంప్ ట్వీట్‌కు టర్న్‌బుల్ రీట్వీట్ చేశారు.

# భారీగా తగ్గనున్న స్మార్ట్ ఫోన్ ధరలు

- కొత్త ఫోన్ కొనాలని భావించే వారికి శుభవార్త
- తగ్గనున్న స్మార్ట్ ఫోన్ ధరలు
- రూ. 18,900కే శాంసంగ్ గెలాక్సీ జే7 ప్రో

న్యూఢిల్లీ: కొత్త స్మార్ట్ ఫోన్ కొనుగోలు చేయాలని అనుకుంటున్నారా? అయితే మూడు నాలుగు రోజులు ఆగితే మీకు మరింత లాభం కలుగుతుంది. శాంసంగ్,



నోకియా, వీవో తదితర స్మార్ట్ ఫోన్ సంస్థలు తామందిస్తున్న ప్రొడక్టులపై 15 నుంచి 30 శాతం వరకూ తగ్గింపును ప్రకటించనున్నాయి. మార్కెట్ వర్గాల సమాచారం ప్రకారం, మరో వారం రోజుల వ్యవధిలో 7 స్మార్ట్ ఫోన్ల ధరలు తగ్గనున్నాయి.

శాంసంగ్ గెలాక్సీ జే7 ప్రో ధర రూ. 2 వేలు తగ్గి రూ. 18,900కు అందుబాటులోకి రానుంది. 5.5 అంగుళాల స్క్రీన్, ఆక్టా కోర్ ప్రాసెసర్, 3 జీబీ ర్యామ్, 64 జీబీ మెమొరీ, ఆండ్రాయిడ్ నోగట్ 7.0 సిస్టమ్ ఉంటాయి.

నోకియా 6 ధర రూ. 1,500 తగ్గి రూ.



13,499కి లభించనుంది. 3 జీబీ ర్యామ్, క్వాల్ కామ్ స్నాప్ డ్రాగన్ 430 ప్రాసెసర్, ఆండ్రాయిడ్ 8. ఓరియో ఆపరేటింగ్ సిస్టమ్, 5.5 అంగుళాల స్క్రీన్ ఉంటాయి.

శాంసంగ్ జే 7 మ్యాక్స్ ధర రూ. 3 వేలు తగ్గి రూ. 11,900కు లభించనుంది. నౌగట్ ఆపరేటింగ్ సిస్టమ్, మీడియాటెక్ హీలియో పీ20 ప్రాసెసర్, 5.7 అంగుళాల డిస్‌ప్లే 13/13 ఎంపీ కెమెరాలు దీని ప్రత్యేకత.

వీవో వీ7 ప్లస్ రూ. 2 వేల డిస్కౌంట్ తో రూ. 19,990కు అందుబాటులోకి రానుంది. 24 ఎంపీ సెల్ఫీ కెమెరా, 5.99 అంగుళాల ఫుల్ హెచ్డీ స్క్రీన్ దీని ప్రత్యేకతలు.

వివో వై53 ధర రూ. 500 తగ్గి రూ. 8,499కి మార్కెట్లోకి రానుంది. ఆండ్రాయిడ్ మార్ష్ మాలో సిస్టమ్ పై పనిచేసే ఫోన్ లో క్వాల్ కామ్ స్నాప్ డ్రాగన్ ప్రాసెసర్, 16 జీబీ మెమొరీ, 8/5 ఎంపీ కెమెరాలు ఉంటాయి.

ఇన్ఫినిక్స్ జీరో 5 ధర రూ. 2 వేలు తగ్గి రూ. 15,999కి దిగిరానుంది. ఫ్లిప్ కార్ట్ లో మాత్రమే అందుబాటులో ఉండే ఫోన్ పై, హెచ్డీఎఫ్సీ క్రెడిట్, డెబిట్ కార్డులు వాడి కొనుగోలు చేస్తే, మరో 10 శాతం రాయితీ లభిస్తుంది. 5. అంగుళాల స్క్రీన్, 12/13 ఎంపీ కెమెరాలు ఉంటాయి.

ఇన్ఫినిక్స్ నోట్ 4 ధర రూ. 1000 తగ్గి రూ. 7,999కి రానుంది. ఇది కూడా ఫ్లిప్ కార్ట్ లోనే లభిస్తుంది. 4,300 ఎంఏహెచ్ బ్యాటరీతో లభించే ఫోన్ లో 3 జీబీ ర్యామ్, 32 జీబీ మెమొరీ, 13/8 ఎంపీ కెమెరాలుంటాయి.



## మా ఆయన యోధుడు నన్నూ అలాగే మలిచారు : ఇర్ఫాన్ ఖాన్ భార్య

ముంబయి : తన భర్త యోధుడని, ఎలాంటి సమస్యనైనా ఎదుర్కొనే ఆత్మస్థైర్యం తనకు ఉందని బాలీవుడ్ స్టార్ ఇర్ఫాన్ ఖాన్ భార్య సుతాపా సిక్‌దర్ తెలిపింది. తనకు ఓ అరుదైన వ్యాధి సోకిందని ఆయన ఇటీవల సోషల్ మీడియా వేదికగా ప్రకటించి ఫ్యాన్స్‌ని తీవ్ర ఆందోళనకు గురి చేసిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ఆ అరుదైన వ్యాధి ఏమిటో తెలుసుకోవాలని అందరికీ ఆత్రుత పట్టుకుంది. కొందరైతే ఆన్‌లైన్‌లో ఆయన అనారోగ్యంపై ఊహాగానాలు చేయసాగారు. దీంతో ఇక లాభం లేదు... ఏవేవో మనసుకు నచ్చింది దుష్ప్రచారం చేస్తున్నారని భావించిన ఇర్ఫాన్ తానే స్వయంగా రంగ ప్రవేశం చేశారు. తన రోగమేమిటో తానే చెబుతానని, అంత వరకు ఊహాగానాలతో అందరిన బెంబేలెత్తించవద్దని నెటిజన్లకు విజ్ఞప్తి చేశారు. తన భర్త ఆరోగ్యం గురించి ఆందోళన చెందుతూ పలువురు తనకు కాల్స్ చేశారని, సందేశాలు పంపారని సిక్‌దర్ తెలియజేస్తూ, వాటికి బదులు ఇవ్వనందుకు తనను క్షమించాలని కోరారు. ఇర్ఫాన్ ఆరోగ్యం కుదుటపడాలంటూ దేవుడికి ప్రార్థనలు చేసిన వారందరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపింది. తనను కూడా వారియర్‌గా మలిచినందుకు దేవుడికి, తన భర్తకు రుణపడి ఉంటానని ఆమె అంది. ప్రస్తుతం జీవితమనే యుద్ధ క్షేత్రంలో ఎదురొచ్చే ప్రమాదాలను ఎదుర్కొనే వ్యూహాలపై దృష్టి పెట్టానని ఆమె తెలిపింది. ఇర్ఫాన్ అభిమానులు కూడా ఇదే రీతిలో తమ జీవిత పోరాటంలో గెలిచేలా ప్రయత్నించాలని ఆమె విజ్ఞప్తి చేసింది. ఇక సినిమాల విషయానికి వస్తే ఇర్ఫాన్ నటించిన 'బ్లాక్‌మెయిల్' చిత్రం ఏప్రిల్ 6న ప్రేక్షకుల ముందుకు రానున్నది.



# కుర్చీ కావాలంటే కలుపుకొని పోవాల్సిందే?

**● వైసీపీలో అంతర్మథనం ● పొత్తులపై సంకేతాలు ఇవ్వకనే ఇచ్చిన వై.ఎస్.జగన్ ● గతంలో కేవలం ఐదు లక్షలకుపైగా ఓట్లుతో అధికారానికి వైసీపీ దూరం ● జనసేన బాట ఎటు? ● టీడీపీ వ్యతిరేక మహా కూటమికి వైసీపీయే నేతృత్వం వహిస్తుందా? ● అందుకేనా వామపక్షాల పట్ల వైసీపీ సానుకూల వైఖరి? ● సమీప భవిష్యత్తులో కాంగ్రెస్, జనసేనను కూడా వైసీపీ దగ్గరకు తీసుకొంటుందా?**

(ఏపీ–పొలిటికల్‌బ్యూరో) : ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాలలో ఎన్నికల వేడి రోజురోజుకు పుంజుకొంటోంది. అయితే ఏపీలో ప్రత్యేక హోదా అంశం ఇప్పుడు అన్ని రాజకీయ పార్టీలకు ప్రధాన అస్త్రంగా మారడంతో రాష్ట్రంలోని పరిణామాలన్నీ వేగంగా మారుతున్నాయి. మొన్నటి వరకు ఏపీకి ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని స్వాగతించిన టీడీపీ నాయకత్వం సైతం కేంద్రం అన్యాయం చేసిందన్న కారణంతో హోదావైపు తన స్వరాన్ని మళ్లిస్తోంది. దీంతో ఇన్నాళ్లు ఏపీకి ప్రత్యేక హోదా కోసం గళమెత్తిన పార్టీలు టీడీపీపై ఎదురుదాడి చేస్తున్నాయి. వచ్చే ఎన్నికల్లో ఏపీకి ప్రత్యేక హోదా అంశమే కీలకం కావడంతో ఆ పేరుతో సాగే ఉద్యమాలకు, పోరాటాలకు అన్నింటికి తానే నాయకత్వం వహించేలా వైసీపీ సమాలోచనలు చేస్తోంది. తద్వారా ప్రభుత్వం వ్యతిరేక ఓటు చీలకుండా చేస్తే ఇక వచ్చే ఎన్నికల్లో తమదే అధికారం అన్న దిశగా ఆ పార్టీ యోచిస్తోంది. ఈ నేపథ్యంలో అన్ని పార్టీలను ఏకంచేయాలన్న దిశగా వైసీపీ అంతర్గతంగా ప్రయత్నాలు మొదలేసినట్లు సమాచారం. గత ఎన్నికల్లో వైసీపీ కేవలం ఐదు లక్షలకుపై చిలుకు ఓట్లుతో మాత్రమే ఓడిపోయింది. మెజార్టీ బీసీ ఓటర్లు టీడీపీ వైపు ఉండటం, నాటి రాష్ట్రవిభజన పరిస్థితుల్లో టీడీపీ, బీజేపీ కూటమికి ఓట్లు పడటం, సినీహీరో పవన్ జనసేన పార్టీ ప్రకటిం చినప్పటికీ ఆయన కమలం, సైకిల్‌కు మద్దతు పలకడం వంటివి తాము అధికారానికి దూరమవ్వడానికి ప్రధాన కారణాలు అన్ని వైసీపీ సమాలోచనలు చేస్తోంది.



అన్నింటిని ఏకం చేస్తేనే బలం...గెలుపు? : ప్రస్తుత పరిస్థితుల్లో ఏపీకి ప్రత్యేక హోదా అంశం అధికార టీడీపీ ఎంత ఎత్తుకొన్నా నాలుగేళ్లు బీజేపీతో కలసి ఉన్నందున ఆ పార్టీకి ఎన్నికల్లో వచ్చే మైలేజీ కాస్త తక్కువే. కానీ ఈ విషయంలో ప్రతిపక్షాలకు బాగా కలసివస్తుంది. అందులోనూ సహజంగా ప్రధాన ప్రతిపక్షానికి మరింత కలసివస్తుంది. అయితే ఏపీలో ప్రస్తుతమున్న పరిణామాల నేపథ్యంలో వైసీపీ, కాంగ్రెస్ పార్టీ, జనసేన పార్టీలు వేర్వేరుగా రాష్ట్ర విషయాలలో ఆందోళనలు చేస్తే వాటికి వామపక్షాలు మద్దతు ఇస్తున్నాయి. అదే సందర్భంలో ప్రతిపక్ష పార్టీ ఆందోళన చేపట్టినా ప్రతిపక్షాలు ఒకరినొకరు మద్దతు ఇచ్చుకొంటున్నా, అప్పుడప్పుడు వైసీపీ, జనసేన, కాంగ్రెస్‌ల మధ్య పరస్పర విమర్శలు కూడా సర్వసాధారణంగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఏపీలో మూడు కూటములా లేక రెండే కూటములు ఉంటాయా అన్నది కూడా చర్చ సాగుతోంది. ఏపీలో బీజేపీ ఒంటరిగా బరిలోకి దిగినా దానివల్ల ఏ పార్టీకి వచ్చే నష్టంగానీ జరిగే లాభం గానీ ఏమీ ఉండదని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. కానీ టీడీపీయే ఇప్పుడు అన్ని పార్టీలకు ప్రధాన టార్గెట్. ఎందుకంటే ఆ పార్టీయే రాష్ట్రంలో అధికారంలో ఉంది. అయితే ఆ పార్టీని ఎదుర్కోవాలంటే ప్రజా వ్యతిరేక ఓటు చీలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి ప్రతిపక్షాలు. ఇదే అంశాన్ని రాజకీయ వర్గాలు ప్రస్తావిస్తున్నాయి. వైసీపీ, జనసేన, కాంగ్రెస్, వామపక్షాలన్నీ ఏకతాటిపైకి వస్తే వచ్చే ఎన్నికల్లో ఈ కూటమి విజయం సునాయాసం అవుతుందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. అలా కాకుండా ఈ ప్రతిపక్షాల మధ్య విభేదాలతో రెండు కూటములుగా చీలితే మాత్రం ప్రజా వ్యతిరేక ఓటు చీలి అధికార టీడీపీకి మేలు జరుగుతుందని వారి వాదన. ఈ వాదనతో వైసీపీ నాయకత్వం కూడా ఏకీభవిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనూ గత ఆరు నెలల కిందటి నుంచే ఆ పార్టీ పక్కా ప్రణాళికతో ప్రతిపక్షాలను ఏకంచేసే పనిలో పడినట్లు తెలుస్తోంది. మరీ ముఖ్యంగా జనసేన పార్టీని దారిలోకి తెచ్చుయత్నం ఎప్పుడో మొదలైందని వైసీపీలోనే అంతర్గతంగా ప్రచారముంది. రాష్ట్ర రాజకీయాలలో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో జనసేన పార్టీ అందరి కంటే బలంగా ఉందని చెప్పకపోయినా ప్రధాన ప్రతిపక్షం వైసీపీకి మాత్రం అదే బలహీనత అని కూడా రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. వైసీపీని మళ్లీ అధికారానికి దూరం చేయాలంటే జనసేన పార్టీ ఓ పావుగా ఉపయోగపడుతుందని చెబుతున్నారు. ఈ వాస్తవం తెలిసే వైసీపీ నాయకత్వం జనసేన పార్టీని దారిలోకి తెచ్చుకొనేందుకు ఇప్పటికే చర్యలను అంతర్గతంగా చేపట్టారని సమాచారం. అదే సందర్భంలో వామపక్ష పార్టీల మద్దతు కూడా తీసుకోవాలని వైసీపీ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక కాంగ్రెస్ పార్టీ సైతం వైసీపీతో కలవాల్సి వస్తుందని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. వచ్చే ఎన్నికల్లో సీఎం సీటు కావాలంటే రాష్ట్రంలోని అన్ని ప్రతిపక్ష పార్టీలను ఏకతాటిపైకి తెచ్చి వైసీపీ తానే నాయకత్వం వహించాల్సి ఉంటుందని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ విషయాన్ని వైసీపీ వర్గాలు ధృవీకరిస్తున్నాయి.

## మహిళల కోటాలో లోకేష్‌కు మంత్రి పదవి
## వైసీపీ ఎమ్మెల్యే రోజా



హైదరాబాద్, మేజర్‌న్యూస్ : ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ నిరాశజనకంగా ఉందని వైసీపీ ఎమ్మెల్యే రోజా తెలిపారు. ఆమె శనివారం మీడియాతో మాట్లాడుతూ చివరి బడ్జెట్‌లోనూ మహిళలకు అన్యాయం చేశారన్నారు. మహిళల అక్రమ రవాణాలో రాష్ట్రం రెండో స్థానంలో ఉందన్నారు. చంద్రబాబు పాలనలో మహిళకు భద్రత కరువైందని ఆరోపించారు. ఎమ్మార్వో వనజాక్షిపై దాడి చేస్తే ఇప్పటి వరకు శిక్షల్లేవన్నారు. సీఎం నియోజక వర్గంలో మహిళను వివస్త్రను చేసినా పట్టించుకోలేదని ఆమె మండిపడ్డారు. బెల్టు షాపులను దశలవారీగా ఎత్తేస్తామన్న ముఖ్యమంత్రి హామీ ఏమైందన్నారు. మరో వైపు మహిళల కోటాలో లోకేష్‌కు మంత్రి పదవి ఇచ్చారని అన్నారు. లోకేష్‌ను మంత్రిని చేస్తే రాష్ట్రమంతటా ఉద్యోగాలిచ్చినట్లేనా అని ప్రశ్నించారు

## ఆజాం ఖాన్‌పై జయప్రద సంచలన వ్యాఖ్యలు




న్యూఢిల్లీ : సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పీ) సీనియర్ నేత ఆజాం ఖాన్‌పై ఆ పార్టీ బహిష్కృత నేత, నటి జయప్రద తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 2009లో ఉత్తర ప్రదేశ్‌లోని రాంపూర్ లోక్‌సభ నియోజకవర్గానికి జరిగిన ఎన్నికల సందర్భంగా ఆయన తనను తీవ్ర మనోవేదనకు గురి చేశారని ఆమె ఆరోపించారు. ఇటీవల విడుదలైన బాలీవుడ్ చిత్రం 'పద్మావత్'లోని ప్రతినాయక పాత్ర ఖిల్జీతో ఆయనను పోల్చారు. కాగా, 2009 మేలో జరిగిన ఎన్నికల సందర్భంగా తన ప్రతిష్ఠను దిగజార్చడానికి ఆజాం ఖాన్ చౌకబారు కుయుక్తులు ఉపయోగించారని జయప్రద మండిపడిన సంగతి తెలిసిందే. 'పద్మావత్' చిత్రాన్ని చూస్తున్నంత సేపు అందులోని ఖిల్జీ పాత్ర ఆజాం ఖాన్‌జీని ప్రతిబింబించిందని ఆమె వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో పోటీ చేసేటప్పుడు ఆయన తనను వేధించారని ఆమె ఏఎన్‌ఐ వార్తా సంస్థకు తెలిపారు. ఆజాం ఖాన్ తన ఫోటోలను అభ్యంతరకరమైన రీతిలో మార్ఫింగ్ చేసి సీడీల రూపంలో పంపిణీ చేశారని జయప్రద గతంలోనూ తీవ్ర ఆరోపణలు చేశారు. ఇలా పలు సందర్భాల్లో ఆజాం ఖాన్‌పై ఆమె విరుచుకుపడుతూనే ఉన్నారు.

## నది ఒడ్డున బ్యాగు తెరచిచూస్తే 54 నరికిన చేతులు
### రష్యాలోని సైబీరియా ప్రాంతంలో కలకలం



మాస్కో : ఓ నది ఒడ్డున అనుమానాస్పదంగా కనపడిన బ్యాగును గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న పోలీసులు ఆ బ్యాగును తెరచి చూడగా అందులో నరికిన 54 చేతులు కనపడడంతో షాకయ్యారు. ఈ ఘటన రష్యాలోని సైబీరియా ప్రాంతంలోని ఖబరోస్క్ నగరంలో ఉన్న నది ఒడ్డున చోటు చేసుకుంది. ఈ బ్యాగును గుర్తించిన అముర్ అనే వ్యక్తి మీడియాతో మాట్లాడుతూ, తనకు ఆ బ్యాగులో ఓ చేయి కనపడిందని తెలిపాడు. దీంతో స్థానికులకు ఈ విషయం గురించి చెప్పగా వారు పోలీసులకు సమాచారం అందించారని చెప్పాడు. బ్యాగులో ఇలా 54 చేతులు కనపడడంతో రష్యాలోనే కాక ప్రపంచ వ్యాప్తంగా ఈ వార్త సంచనలంగా మారింది. ఆ చేతులకు ఆసుపత్రిలో చుట్టే బ్యాండేజీలు, ప్లాస్టిక్ గ్లౌజులు కూడా చుట్టి ఉన్నాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

# జనసేన స్ట్రాటజీ ఏమిటి?



**● పార్టీ విధానం ఏమిటో ఇప్పటికీ స్పష్టంచేయని జనసేనాని ● ఏపీకి ప్రత్యేక హెూదా అంశం రగులుతున్నా తెరపైకి రాని వైనం ● రోడ్లపైకి వస్తే సమస్య తీరదని జనసేనాని వింత వ్యాఖ్యలు ● ఇకనైనా తన పార్టీ విధానంపై ఓ స్పష్టతతో వస్తారా? ● లేక చివరికి గత పీఆర్‌పీ తరహాలోనే చేతులెత్తేస్తారా? ● మరో ఏడాదిలో ఎన్నికలున్నా తనది ఏ విధానమో స్పష్టత ఇవ్వని జనసేన పార్టీ నాయకత్వం ● ఒంటరి బాట లేక పొత్తులతో అడుగులా? ● పొత్తే కడితే ఎవరితో కలసి పయనం?**


(ఏపీ–పొలిటికల్‌బ్యూరో) : గత 2014 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ కూటమికి జైకొట్టిన జనసేనా పార్టీ వచ్చే సాధారణ ఎన్నికల్లో ఎలాంటి విధానం అవలంభించనున్నది...? మరో ఏడాదిలో రెండు తెలుగు రాష్ట్రాల అసెంబ్లీకి, దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలు జరిగే అవకాశమున్నా ఇంతవరకు తన పార్టీ విధానం ఏమిటో జనంలోకి విస్తృతంగా జనసేన పార్టీ తీసుకోకపోవడంపై రకరకాలు చర్చలు రాజకీయ వర్గాల్లో సాగుతున్నాయి. గతంలో మాధిరిగా ఈ సాధారణ ఎన్నికల్లోనే ఒకరికో ఒకరికి జైకొట్టి ఊరుకొంటారా లేక తనకంటూ ప్రత్యేక ప్రజా విధానాలను తెరపైకి తెచ్చి రాజకీయాలలో ప్రక్షాళనకు పోరాడుతారా అన్న చర్చ సాగుతోంది. ఎప్పుడూ రాజకీయ ప్రక్షాళన, నీతివంతమైన రాజకీయాలు, దేశ ప్రయోజనాలు చెప్పే జనసేన పార్టీ అధినేత జనసేనాని ఈ విషయాలలో ఇంతవరకు ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. మొన్నటి వరకు ఏపీకి ప్రత్యేక హోదాపై గర్జించిన ఆయన ఇప్పుడు ఆ దూకుడు ప్రదర్శించకుండా ఉన్నారు. తమ పార్టీకి చట్టసభల్లో ప్రాతినిధ్యం లేదు కాబట్టి ప్రజలను చైతన్యం చేస్తామని చెప్పి తప్పించుకోవడం తప్పా ప్రజా ఉద్యమాలకు జనసేన పార్టీ సిద్ధంకావడంలేదని రాజకీయ వర్గాల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం పత్రికా ప్రకటనల వల్ల రాజకీయ చైతన్యం ప్రజల్లో రాదని, ప్రజా ఉద్యమాలను నిర్మించి ఏ పార్టీఅయినా జనంలోకి వెళ్లినప్పుడే మార్పు వస్తుందని రాజకీయ విశ్లేషకుల భావన.

ఇంతకి జనసేన విధానం ఏమిటీ...?

ప్రజాస్వామ్య బద్ధంగా శాంతియుత మార్గంలో ప్రజా ఉద్యమాన్ని నడపాలి అనే దాంటో ఎవరికి అభ్యంతరాలు ఉండవు. కానీ జనసేన పార్టీ రాష్ట్రంలో అనేక సమస్యలు నెలకొన్న, ఏపీకి ప్రత్యేక హోదా, విభజన బిల్లులోని హామీల అమలు విషయంలో జాప్యం జరుగుతున్నా ఢిల్లీ కేంద్రంగా గానీ రాష్ట్రం కేంద్రంగా గానీ పోరాడిన దాఖలాలు లేవు. కేవలం అప్పుడప్పుడు పత్రికా సమావేశాలుపెట్టి, ట్వీటర్ ద్వారా స్పందించడ తప్పా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జనంలోకి రావడంలేదని రాజకీయ వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికలు మరో ఏడాది ఉండటంతో టీడీపీ, ప్రధాన ప్రతిపక్షం వైసీపీతో సహా వామపక్ష పార్టీలు సైతం తమ ఉనికిని నిలబెట్టుకొనేందుకు జనంలోకి వెళ్తున్నాయి. అంతేకాకుండా రాష్ట్ర విభజన అపవాదు వల్ల ఏపీలో సర్వంకోల్పోయిన కాంగ్రెస్ పార్టీ కూడా ఈ నాలుగేళ్ల కాలంలో పలు ప్రజా ఉద్యమాలు నిర్వహించి తన ఓటుబ్యాంకును పెంచుకొందని, తన గత పరిస్థితి కంటే మెరుగైన స్థితిలోకి వచ్చిందని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. అలాంటిది వచ్చే ఎన్నికల్లో పోటీకి దిగుతామని ప్రకటించిన జనసేన పార్టీ మాత్రం ఇతర ప్రతిపక్షాల స్థాయిలో ఇప్పటికీ జనంలోకి వెళ్లడంలేదన్న విమర్శలున్నాయి. ఏపీకి ప్రత్యేక హోదాకోసం కేంద్రం దిగొచ్చేలా చేయాలని ప్రకటించే జనసేన పార్టీ కనీసంగా ఆ దిశగా ఇతర ప్రతిపక్షాలపైనా, కేంద్ర, రాష్ట్రాలపైనా స్వయంగా తాను ఒత్తిడి తీసుకొచ్చే ప్రయత్నం స్వయంగా చేయడంలేదన్న విమర్శలున్నాయి. దీంతో జనసేన పార్టీ నేతలలో ఆ పార్టీ నాయకత్వం ఎంతవరకు విశ్వాసం పెంపొందిచ గలుగుతుంది అన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. 2009 ఎన్నికల్లో పీఆర్‌పీ హడావుడిగా రాజకీయాల్లో వచ్చినా ఆ తరువాత 18 ఎమ్మెల్యే సీట్లతో సరిపుచ్చుకొని ఆ తరువాత జెండానే పీకేసి కాలక్రమంలో కాంగ్రెస్ పార్టీలో విలీనమైపోయింది. ఎలాంటి భవిష్యత్ కార్యాచరణ, సరైన పార్టీ విధానం లేకపోవడం వల్లే పీఆర్‌పీ పార్టీ చివరగా కాంగ్రెస్‌లో కలవాల్సి వచ్చిందని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే జనసేన పార్టీని పీఆర్‌పీ తరహాలో కానివ్వనని చెప్పిన పవన్ కళ్యాణ్ తన పార్టీ ఉనికి చాటుకోవడంతోపాటు జనంలో ముద్రవేసుకొనేందుకు ఆయన చేస్తున్న ప్రయత్నం గానీ ప్రజల్లో విశ్వాసం కలిగించేలా ఓ విధాన ప్రకటన గానీ నేటికీ చేయలేకపోతున్నారని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. మరీ జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవంలోనైనా సరే ఇలాంటి ఓ విధాన ప్రకటన వస్తుందేమోనని జనసేన పార్టీ అభిమానులు సైతం ఎదురుచూస్తున్నారు.

మొదటి పేజీ తరువాయి

# హోదా పోరు చంద్రబాబుదా?



మాట్లాడారు. "నాలుగేళ్లుగా అన్యాయమైన పాలనే చేస్తున్నాడు. కనీసం మన రాష్ట్రానికి రావాల్సిన హక్కులు సాధించారా అంటే అదీలేదు. ప్రత్యేక హోదాను చంద్రబాబు కేంద్రం దగ్గర తాకట్టుపెట్టాడు. హోదా ఉంటేనే పరిశ్రమలు, రాయితీలు వస్తాయి, తద్వారా పెద్ద సంఖ్యలో యువతకు ఉద్యోగాలు వస్తాయి. కానీ హోదాపై బాబువి ఎన్ని డ్రామాలో మీరంతా చూస్తున్నారు. మొన్న అరుణ్ జైట్లీ పాతపాటే పాడితే చంద్రబాబు కొత్త నాట్యం చేశారు. 2015లోనే జైట్లీ తెగేసి చెప్పినప్పుడే బాబు తన మంత్రులతో రాజీనామాలు చేయించి ఉంటే, ఈ పాటికి హోదా వచ్చేఉండేది. నాలుగేళ్లపాటు మంత్రి పదవులు అనుభవించి, ఎన్నికలు దగ్గరపడుతుండటంతో ప్లేటు ఫిరాయించారు. సరే ఇప్పటికైనా సరిగా పోరాడతారా అంటే అదీ లేదు, మంత్రి పదవులకు రాజీనామా చేస్తారట, ఎన్డీలో మాత్రం కొనసాగుతూనేఉంటారట, ఇక అసెంబ్లీలోనైతే బీజేపీ–టీడీపీలు ఒకరిపై ఒకరు పొగడ్తలు కురిపించుకుంటారు. పార్లమెంట్లో అవిశ్వాసం పెడదాం రమ్మంటే మాత్రం స్పందించడు. రాష్ట్రానికి రాష్ట్రమే రాజీనామాలు చేస్తే



కేంద్రంలో తప్పక కదలిక వస్తుంది. కానీ ఆ పెద్దమనిషికి చిత్తశుద్ధిలేదు. ఇటీవల ఉత్తమ నటులకు ఇటీవలే ఆస్కార్ అవార్డులు దక్కాయి. పాపం వాళ్లకు మన చంద్రబాబు కనిపించలేదు. నాలుగేళ్లుగా ఆంధ్రప్రదేశ్‌లో ఆయన ఆడుతున్న నాటకాలకు ఖచ్చితంగా ఆస్కార్ అవార్డు దక్కేది అని జగన్ చమత్కరించారు.

# బీసీలంటే ఓటు బ్యాంకేనా?

ఇటు తెలంగాణలోని కేసీఆర్ ప్రభుత్వం కూడా ససేమిరా అంటున్నాయి. ముఖ్యంగా బీసీల జనాభా తేల్చేందుకు టీఆర్ఎస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉన్నట్లు కనిపించడంలేదు. తమిళనాడు తరహాలో బీసీల రిజర్వేషన్లు పెంచుతామని సీఎం కేసీఆర్ పదే పదే వెల్లడిస్తున్నప్పటికినీ... ఆచరణలో ఆ దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు సాగడంలేదని బీసీ నేతలు ఆరోపిస్తున్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఇదివరకే సమగ్ర సర్వే నిర్వహించింది. దీంతో బీసీల జనాభా 52శాతంగా అధికారులు వెల్లడించారు. అలాగే బీసీల సామాజిక, ఆర్థిక, విద్యా, ఉద్యోగ ఇతర అంశాలపై సర్వేలు , అనంత రామన్ కమిషన్, మురళీధర్ రావు కమిషన్, ఆ తర్వాత 1994 నుంచి నాలుగు కమిషన్లు జరిపిన సర్వేలు ఉన్నాయి. అలాగే జాతీయ స్థాయిలో మండల్ కమిషన్ 1993 నుంచి వచ్చిన 7 జాతీయ బీసీ కమిషన్లు జరిపిన సర్వే వివరాలు ఉన్నాయి. దీంతో పాటు 2014లో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన కుల గణన వివరాలు, సమగ్ర సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా, ఉద్యోగ తదితర



వివరాలు ఉన్నాయి. అంగట్లో అన్నీ ఉన్నా... అల్లుని నోట్లో శని ఉందన్న నానుడి మాదిరిగా.. లెక్కలన్నీ ప్రభుత్వం దగ్గర పెట్టుకుని రిజర్వేషన్ల పెంపుపై కాలయాపన చేయడం దేనికి సంకేతమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తెలంగాణలో బీసీల రిజర్వేషన్లు పెంచేందకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ముస్లిం, గిరిజనులకు పెంచిన విధంగా బీసీలకు రిజర్వేషన్లు పెంచకుంటే తెలంగాణలో మరో పోరాటానికి సై అంటూ తెలంగాణ ప్రభుత్వాన్ని [illegible]

మొదటి పేజీ తరువాయి

# పెద్దల సభకు బీసీలను పంపేనా?



రాజ్యసభ అభ్యర్థుల ఖరారు : తెలుగుదేశం పార్టీ రాజ్యసభ అభ్యర్థులు ఆదివారం ఖరారు కానున్నారు. అదే రోజు పార్టీ పొలిట్‌బ్యూరో సమావేశం ఏర్పాటు చేశారు. అందులో అభ్యర్థులను ఖరారు చేస్తారు. అభ్యర్థుల ఎంపికపై పార్టీ అధినేత ఇంతవరకు ఏ సంకేతాలూ ఇవ్వకపోవడంతో పార్టీ నేతల్లో ఉత్కంఠ పెరుగుతోంది. దీంతో ఆశావహులు కూడా పెరుగుతున్నారు. విజయవాడ మాజీ మేయర్ పంచుమర్తి అనూరాధ, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య, పార్టీ అధికారి ప్రతినిధి లంకా దినకర్‌బాబు, చిత్తూరుజిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే హేమలత, కర్నూలు జిల్లాకు చెందిన మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి, మాజీ ఎంపీ గంగుల ప్రతాపరెడ్డి తదితరులు ఆశావహుల జాబితాలో ఉన్నట్లు సమాచారం.

పేర్ల కోసం ఆశావహుల ఎదురుచూపులు : రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపై ముఖ్యమంత్రి చంద్రబాబు కసరత్తు మొదలుపెట్టారు. రాజ్యసభ టికెట్‌ను దక్కించుకోవడం కోసం కొందరు నేతలు పైరవీలు చేస్తున్నట్లు సమాచారం. టికెట్ ఆశించిన ఆశావహులు ఎదురుచూపులు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబును సీఎం రమేష్, మసాల పద్మజ, జూపూడి ప్రభాకర్, కంభంపాటి రామ్మోహన్‌రావు, నల్లగట్ల స్వామిదాసు, బీదా మస్తాన్‌రావు కలిశారు. సీఎం రమేష్ వెంట మంత్రులు గంటా శ్రీనివాసరావు, ఆదినారాయణరెడ్డి వెళ్లారు. ఈ నెల 23న రాజ్యసభ ఎన్నికలు జరగనున్నాయి. తమ పార్టీ తరపున ఇద్దరు అభ్యర్థులను బరిలో దించేందుకు సీఎం చంద్రబాబు కసరత్తు ప్రారంభించారు. ఏపీలో ముగ్గురు అభ్యర్థులకు రాజ్యసభకు ఎంపికయ్యే అవకాశం ఉంది. అందులో వైసీపీ ఒక అభ్యర్థిని ఇప్పటికే నిర్ణయించింది. రెండు రోజుల క్రితం వైసీపీ తరపున వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఇక టీడీపీ తరపున ఇరువురు అభ్యర్థులను ఎంపిక చేయాల్సి ఉంది. ఈ అభ్యర్థుల కోసం పొలిట్‌బ్యూరో సమావేశం ఏర్పాటు చేసి సభ్యులందరి అభిప్రాయాలు సేకరించి నేతలను ఎంపిక చేయడం సర్వసాధారణం.

మరోసారి అవకాశం ఇవ్వాలని కోరిన దేవేందర్‌గౌడ్ : మరోసారి రాజ్యసభ అవకాశం ఇవ్వాలంటూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుకు తెలంగాణ తెలుగుదేశం పార్టీ నేత దేవేందర్ గౌడ్ లేఖ రాశారు. రాజ్యసభకు ప్రజల నుంచి వచ్చిన వ్యక్తినే ఎన్నుకోవాలంటూ చంద్రబాబును కోరారు. దేశ ప్రజల భవిష్యత్తును ప్రభావితం చేసే చట్టాల రూపకల్పనలో రాజ్యసభ సభ్యుల పాత్ర కీలకమైందని, అలాంటి సభకు ప్రజాశ్రేయస్సు కోసం పనిచేసేవారినే ఎన్నుకోవాలని లేఖలో విన్నవించారు. జడ్పీ చైర్మన్‌గా, మూడుసార్లు ఎమ్మెల్యేగా, పది సంవత్సరాలు కేబినెట్ మంత్రిగా, రాజ్యసభ సభ్యుడిగా తనకు పనిచేసే అవకాశం దక్కిందని, ఇకముందు కూడా ప్రజాశ్రేయస్సు కోసం, ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఆ లేఖలో దేవేందర్‌గౌడ్ పేర్కొన్నారు. రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో మంతలు కళా వెంకట్రావు, యనమల, పార్టీ ముఖ్య నేతలతో అమరావతిలో చంద్రబాబు భేటీ అయ్యారు. నేతలందరితో సమాలోచనలు జరిపి రెండు స్థానాలకే పోటీ చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. రాజ్యసభకు పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయడానికి సోమవారం వరకు మాత్రమే గడువు ఉండడంతో అభ్యర్థుల ఎంపికపై ఉత్కంఠ నెలకొంది.



## టిడిపిని బంగాళాఖాతంలో కలుపుదాం : ఎమ్మెల్యే రోజా

మాచవరం, మేజర్ న్యూస్: వైఎస్ జగన్మోహనరెడ్డి ప్రజాసం కల్పయాత్రలో అడుగులు వేస్తుంటే చంద్రబాబుకు గుండెల్లో గుణపాలు గుచ్చినట్లు వుంటుందని, గురజాల నియోజకవర్గంలో కాసు మహేష్‌రెడ్డి పాదయాత్ర చేస్తుంటే రౌడీ ఎమ్మెల్యే అయిన గురజాల ఎమ్మెల్యే యరపతినేని గుండెల్లో గుణపాలు దిగినట్లుగా వుందని వైసిపి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, నగరి ఎమ్మెల్యే రోజా అన్నారు. గుంటూరు జిల్లా మాచవరం మండలం పిన్నెల్లి గ్రామంలో జగన్ ప్రజాసంకల్పయాత్రకు గురజాల నియోజకవర్గ సమన్వయకర్త కాసు మహేష్‌రెడ్డి పాదయాత్ర ముగింపు సభ జరిగింది. ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాజధాని భూములను దోచుకుంటే గురజాల రౌడీ ఎమ్మెల్యే యరపతినేని అక్రమ మైనింగ్ మొదలు కొని మట్టి, ఇసుక చివరకు మరుగుదొడ్ల బిల్లుల వరకు దోపిడీ చేస్తున్నారని ఆమె అన్నారు. కరువు, చంద్రబాబు కవలపిల్లలని, జాబు రావాలంటే బాబు పోవాలని, చంద్రబాబు తనయుడు పప్పుసుద్దబ్బాయికి మంత్రి పదవి తప్ప ఎవరికీ జాబులు రాలేదన్నారు. 600 హామీలతో రాష్ట్రాన్ని చంద్రబాబు నట్టేట ముంచాడని, రైతులను భక్షించే ప్రభుత్వం టిడిపి అన్నారు. యరపతినేనికి గురజాల నియోజకవర్గంలో ఓటు ద్వారా బుద్ధి చెప్పాలన్నారు. రాబోయే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడం తథ్యమని, నక్కజిత్తుల నారా పాలన పారదోలాలని ఆమె అన్నారు. గురజాల నియోజకవర్గంలో యరపతినేనికి డిపాజిట్లు లేకుండా బ్రహ్మానందరెడ్డి మనవడు కాసు మహేష్‌రెడ్డిని అత్యంత మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు.

# కేసీఆర్ హామీలు నీటి మీద రాతలు



- లక్ష ఉద్యోగాలు హుష్‌కాకి
- రాష్ట్రం ఏర్పడ్డాక కేసీఆర్ కుటుంబంలో నలుగురికి ఉద్యోగాలు
- సామాజిక తెలంగాణ కాంగ్రెస్‌తోనే సాధ్యం
- వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ కృషి చేస్తుంది
- 2019లో కాంగ్రెస్‌దే అధికారం
- నిరుద్యోగ చైతన్య యాత్రలో యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి దేవేందర్ కత్వల్, రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షుడు అనిల్ కుమార్ యాదవ్ ఉద్ఘాటన



కొత్తగూడెం, మేజర్‌న్యూస్: ఉన్నతచదువులు చదివి ఉద్యోగాలు రాక రాష్ట్రంలో నిరుద్యోగల కంట కన్నీళ్లు తెప్పిస్తున్న తెరాస ప్రభుత్వానికి బుద్ధిచేప్పే సమయం వచ్చిందని యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి దేవేందర్ కత్వల్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అనిల్ కుమార్ యాదవ్ పేర్కోన్నారు. శనివారం నిరుద్యోగ చైతన్యయాత్రలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో చైతన్య యాత్రలో భాగంగా జరిగిన సభలో నాయకులు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కొసం జరిగిన ఉద్యమంలో ఎంతో మంది త్యాగాల ఫలితంగా రాష్ట్రం ఆవిర్భవించిందన్నారు. రాష్ట్రం ప్రకటించగానే కేసీఆర్ సోనియా గాంధీ కాళ్ళమీద పడి తన జన్మధన్యామైందని చేప్పిన విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో దళితున్ని ముఖ్యమంత్రి చేస్తానని చేపి తానే గద్దెనెక్కడం జరిగిందన్నారు. రాష్ట్రంలో దళిత పాలన కాకుండా దోరల పాలన కొనసాగుతుందన్నారు. కేసీఆర్ ఇచ్చిన హామీలు నీటి మీది రాతలేనాని ప్రజలు సందిగ్దంలో జీవిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ పాలనలకు నాలుగు సంవత్సరాలు పూర్తి కావస్తున్నప్పటికి హామీలు ముందుకు సాగడం లేదని ఆరోపించారు. లక్ష ఉద్యోగాలకు ఒకే సారి నోటిఫికేషన్ జారీ చేసి ఉద్యోగాలను భర్తీ చేస్తానని గొప్పలు చేప్పిన కేసీఆర్ ఉద్యోగాలు ఏమైయ్యాయని ప్రశ్నించారు. నిరుద్యోగులకు యువజన కాంగ్రెస్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు రూ. 3వేల ఆత్మ గౌరవ వేతనం అందచేస్తామన్నారు. రాష్ట్రంలో మహిళలకు గౌరవం లేదని మహిళ మంత్రులు లేని క్యాబినేట్ తెరాస ప్రభుత్వందేనని అన్నారు. వైఎస్సార్ హాయంలో ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ విద్యార్థులకు ఫీజురియంబర్స్‌మెంట్ ఇవ్వడం జరిగిందని



ప్రస్తుత తెరాస ప్రభుత్వంలో ఆ నిధులను మిషన్ భగీరథకు మళ్ళించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో రైతుల ఇబ్బందులు వర్ణానాతీతమని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం ఫామ్ హౌజ్‌లో ఉంటూ రాష్ట్రం సస్యశామలంగా ఉందని పేర్కోవడం హస్యస్పదంగా ఉందన్నారు. కేటీఆర్ మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకోవాలని సూచించారు. రైతులకు సంకెళ్ళు వేసిన ప్రభుత్వం తెరాస ప్రభుత్వమేన్నారు. తెరాస ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నినప్పటికి 2019 ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని స్పష్టం చేశారు. అంతకుముందు భారీగా ద్విచక్రవాహనాలతో యువజన నాయకలు ర్యాలీ నిర్వహించారు. ఈ సభలో రాష్ట్ర ఇంచార్జీ బివి శ్రీనువాస్, మహబూబాబాద్, ఖమ్మం పార్లమెంట్ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పోరిక సాయిశంకర్ నాయక్, రాంరెడ్డి చరణ్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఎస్‌కె జాని, నాయకులు దీలిప్‌రెడ్డి, తాజుద్దీన్, సాంబ మహేష్, కటకం పద్మావతి, లలిత శారధ, సత్యవతి, హరిప్రియా, రాంచంద్రనాయక్, చీమల వెంకటేశ్వర్లు, దళ్‌సింగ్‌నాయక్, జివి భద్రం,ధన్‌రాజ్, మారగాని శ్రీను తదితరులు పాల్గోన్నారు.

## టి- సాట్‌లో వినూత్న కార్యక్రమాలు



హైదరాబాద్, మేజర్‌న్యూస్ః టి-సాట్ నెట్వర్క్ ఛానళ్లు మరో వినూత్న కార్యక్రమ ప్రసారానికి శ్రీకారం చుట్టాయి. విద్య, ఉద్యోగం, పోటీ పరీక్షల శిక్షణ వంటి ప్రసార కార్యక్రమాలే కాకుండ సామాజిక అంశాలపైనా దృష్టి సారించింది. చిన్న పిల్లల భవిష్యత్ ను మార్చేందుకు ఉపయోగపడే బృహత్తర కార్యక్రామానికి శ్రీకారం చుట్టింది. మార్చి 12వ తేదీ నుండి ప్రసారం చేయబోయే బాల్యం భద్రం-భవిత బంగారం కార్యక్రమానికి సంబంధించి టి-సాట్ సీఈవో ఆర్.శైలేష్ రెడ్డి శనివారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. భావి భారత పౌరులను తీర్చిదిద్దేందుకు పునాది బాల్యంలోనే పడాలనే సంకల్పంతో బాల్యంపై ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించినట్లు సీఈవో ప్రకటించారు. బాల్యంలో ప్రభావం చూపే వివిధ అంశాలపై అనుభవజ్ఞులను ఒక వేదికపై చేర్చి సలహాలు-సూచనలు అందించేందుకు కార్యక్రమాన్ని సిద్ధం చేశామన్నారు.


## మాట తప్పడమే తెలంగాణ మోడలా : బీజేపీ



హైదరాబాద్, మేజర్‌న్యూస్ః సీఎం కేసీఆర్ తెలంగాణ మోడల్ దేశవ్యాప్తం కావాలని అంటున్నారని, మాట తప్పడం, ఇచ్చిన హామీని అమలు చేయకపోవడమే తెలంగాణ మోడలా..? అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రావుల శ్రీధర్ రెడ్డి ప్రశ్నించారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ దళితుడ్ని ముఖ్యమంత్రిని చేస్తానని మాట తప్పారని అన్నారు. దళితులకు మూడెకరాల భూ పంపిణి, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వకుండా పేదలను మోసం చేస్తున్నారని విమర్శించారు. సెక్రటేరియట్‌కు రాకుండా ఫామ్ హౌస్ నుంచి పరిపాలన చేస్తున్నారని, కుటుంబ పాలన నిర్వహించడం తెలంగాణ మోడలా అని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికలల్లో ఈ కేసీఆర్ మోడల్‌కు ప్రజలు ముగింపు పలుకనున్నారని, రాష్ట్రాభివృద్ధి కోసం పనిచేయగలిగే బిజేపీ మోడల్‌ను ముందుకు తేవడం ఖాయమని శ్రీధర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.


## నిరుద్యోగులకు ఉచిత ఉపాధి శిక్షణ తరగతులు

**ఏప్రిల్ 3 నుంచి 18 వరకు**



హైదరాబాద్, మేజర్‌న్యూస్ : రాజేంద్రనగర్‌లోని బ్యాంకర్ల గ్రామీణ, ఔత్సాహికుల అభివృద్ధి సంస్థ (బైరెడ్)లో నిరుద్యోగ యువకులకు 6 వారాల ఉచిత ఉపాధి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ యేసేపు తెలిపారు. ఏప్రిల్ 3 నుంచి మే 18వ తేదీ వరకు నిర్వహించే ఈ ఉచిత ఉపాధి శిక్షణ తరగతుల్లో చేరేందుకు ఆసక్తి కలిగిన వారు ఈనెల 10 నుంచి 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తూలను చేసుకోవాలని సూచించారు. ఇందుకో సం 19 నుంచి 30 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. అడ్మిషన్లు పొందిన అభ్యర్థులు ఏప్రిల్ మూడు ఉదయం 9 గంటలలోపు రాజేంద్రనగర్‌లోని బైరెడ్ సంస్థ కార్యాలయంలో విద్యార్హతల ఒరిజినల్, రెండు సెట్ల జీరాక్స్, ఆధార్, ఆహార భద్రత కార్డు, 5 కలర్ పాస్‌పోర్టుసైజు పోటోలతో హాజరు కావాలని సూచించారు. ఈ శిక్షణ లో పదవ తరగతి పాస్, పెయిల్ అయిన వారికి మొబై ల్ సర్వీసింగ్, ఎలక్ట్రీషియన్, వ్యవసాయ పంప్‌సెట్ రీపేర్, ఇంటర్ ఆపైన చదివిన వారికి యంఎస్‌ఆఫీస్, పిసి.హార్డ్‌వేర్, ల్యాప్‌టాప్ సర్వీసింగ్‌లలో శిక్షణ ఉం టుందన్నారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజనం, శిక్షణ పూర్తి అనంతరం అభ్యర్థులకు రాను,పోను చార్జీ లు ఇవ్వటం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు .. లో సంప్రదించాలన్నారు.

## తిరుమలలో మూడురోజులు పల్స్‌పోలియో




తిరుమల, సూర్య ప్రత్యేకప్రతినిధి : శ్రీవారి దర్శనార్థం విచ్చేసే భక్తులు, స్థానికుల సౌకర్యార్థం టిటిడి ఆధ్వర్యంలో తిరుమలలో నేటి నుంచి మూడు రోజుల పాటు పల్స్‌పోలియో కార్యక్రమం జరుగనుంది. ఇందుకోసం టిటిడి వైద్య విభాగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని ముఖ్య వైద్యాధికారి నాగేశ్వరరావు తెలిపారు. ఐదేళ్ల లోపు చిన్నారులకు తప్పక పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ఇందుకోసం వైద్యసిబ్బంది, ఎన్‌సిసి క్యాడెట్లు, ఇతర సిబ్బంది సేవలందిస్తారని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 7.00 నుండి సాయత్రం 6.00 గంటల వరకు శిబిరాల్లో పోలియో చుక్కలు వేస్తారు. తిరుమలలో శ్రీవారి ఆలయంలో 1, భక్తుల కోసం వివిధ ప్రాంతాల్లో 20, స్థానికుల కోసం 4 కలిపి మొత్తం 25 శిబిరాలను ఏర్పాటు చేశారు.

# బీసీ నేతకు కాంగ్రెస్ గాలం

- తెలంగాణలో గుజరాత్ ఫార్ములా అమలుకై రాహుల్ దృష్టి
- బలమైన సామాజిక వర్గాల నేతలను పార్టీలో చేర్చుకునేలా వ్యూహాలు
- ఆర్. కృష్ణయ్యను పార్టీలోకి ఆహ్వానించిన రాహుల్ ప్రత్యేక దూతలు

హైదరాబాద్, మేజర్‌న్యూస్ః తెలంగాణ రాష్ట్రంలో క్రమంగా రాజకీయ వేడి సంతరించుకుంటుంది. పార్టీలను బలోపేతం చేసుకునే దిశగా ప్రధాన రాజకీయ పార్టీలు వ్యూహాలు రచిస్తున్నాయి. రాబోయే ఎన్నికలల్లో తెలంగాణలో అధికారం చేపట్టాలని ఇటు టీఆర్ఎస్, అటు కాంగ్రెస్ పార్టీ పోటాపోటీగా ప్రచారాన్ని సైతం కొనసాగిస్తున్నాయి. తెలంగాణలో సామాజిక వర్గాలను సమీకరించుకునే పనిలో టీఆర్ఎస్ ఉండగా, ప్రభుత్వ వ్యతిరేక శక్తులపై దృష్టి సారించిన కాంగ్రెస్..బలమైన సామాజిక వర్గాల నేతలను సైతం తమ పార్టీలోకి చేర్చుకునే ప్రయత్నాలను ముమ్మరం చేస్తోంది. రాష్ట్ర కాంగ్రెస్‌లో గుజరాత్ ఫార్మూలాను అమలు చేసేందుకు కాంగ్రెస్ అధిష్టానం సామాజిక వర్గాల సమీకరణకు సన్నహాలు చేస్తోంది. అందులో భాగంగానే కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ రాష్ట్ర నేతలతో ప్రమేయం లేకుండా నేరుగా రంగంలోకి దిగి తన దూతల ద్వారా తెలంగాణలోని కీలక నేతలతో చర్చలు జరుపుతున్నట్లు తెలిసింది. ముఖ్యంగా రాష్ట్రంలో బలమైన సామాజిక వర్గమైన బీసీ వర్గాలపై పార్టీ అధిష్టానం దృష్టి సారించింది. ఇప్పటికే తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు రాష్ట్రంలో బలమైన బీసీ సామాజిక వర్గంపై దృష్టి సారించి వారిని ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. బీసీల అభివృద్ధిపై బీసీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ఎంపీలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలను సేకరించారు. అంగే గాక రోజుకో ప్రకటన చేస్తూ కుల సంఘాల భవన నిర్మాణాలకు స్థలాలు, నిధులు కేటాయిస్తున్నారు. వచ్చే బడ్జెట్‌లో బీసీలకు పెద్ద పీట వేస్తామని, ఎంబీసీలకు అధిక నిధులు కేటాయించి, రూ. 1లక్ష నుంచి రూ. 12లక్షల వరకు సబ్సిడీ రుణాలు అందించేలా జీవోను సైతం జారీ చేశారు. దీంతో అప్రమత్తమైన కాంగ్రెస్ పార్టీ అధిష్టానం కూడా బీసీలపై దృష్టి సారించింది. ఇప్పటికే తెలంగాణ కాంగ్రెస్‌లో ఒకే సామాజిక వర్గం పెత్తనం పెరిగిపోయి కాంగ్రెస్ పార్టీ అంటే రెడ్ల పార్టీగా ముద్ర పడింది. దీంతో సొంత పార్టీ నేతల విమర్శలనే ఎదుర్కొంటుంది. ఈ నేపథ్యంలో ఈ అపవాదును చెరిపేసుకునేందుకు అధిష్టానం తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. సామాజిక తెలంగాణ నినాదంతో అన్ని సామాజిక వర్గాలకు పార్టీలో సముచిత స్థానం కల్పించేందుకు నడుం బిగించింది. అందులో భాగంగా బలమైన బీసీ నేతగా పేరుగాంచిన ఆర్.కృష్ణయ్యను కాంగ్రెస్ పార్టీలోకి తీసుకవచ్చేందుకు ప్రయత్నాలు చేస్తోంది. పీసీసీ నేతలతో సంబంధం లేకుండా రాహుల్ గాంధీ దూతలు నేరుగా కృష్ణయ్యతో మంతనాలు జరుపుతున్నట్లు తెలిసింది. 46 ఏళ్ల సుదీర్ఘకాలంలో పదివేలకు పైగా బీసీ ఉద్యమాలను నడిపిన చరిత్ర ఉన్న బీసీ ఉద్యమ నేతగా పేరున్న కృష్ణయ్యను కాంగ్రెస్‌లో చేర్చుకోవడం ద్వారా టీపీసీసీలో ఒకే సామాజిక వర్గానికి పెద్దపీత వేస్తున్నారనే అపవాదును చెరిపేసుకుని సమతుల్యం సాధించే దిశాగా యత్నిస్తోంది. 1982లో ఎన్టీఆర్, అదే విధంగా విజయభాస్కర్ రెడ్డి, వైఎస్ లాంటి కీలక నేతలు ఆర్.కృష్ణయ్యకు పదవులు ఇస్తామని టికెట్ ఇస్తామని పార్టీలోకి ఆహ్వానించినా.. ఆయన వెళ్లకుండా బీసీ ఉద్యమాలకే పరిమితమయ్యారు.



తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం టీడీపీ కృష్ణయ్యను ముఖ్యమంత్రి అభ్యర్తిగా ప్రకటించడంతో ఆయన టీడీపీలో చేరి, ఎల్బీనగర్ నుంచి పోటీ చేసి గెలుపొందారు. మెజార్టీ సీట్లు సాధించకపోవడంతో ఆ పార్టీ ప్రతిపక్ష స్థానానికే పరిమితమైంది. కానీ టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు కృష్ణయ్య ప్రతిపక్ష నేతగా అవకాశం ఇవ్వలేదు సరికదా..పార్టీ అధ్యక్ష పదవీ బాధ్యతలను సైతం ఇవ్వలేదు. దీంతో ఏమాత్రం నిరాశ చెందని కృష్ణయ్య తన ఉద్యమ ఎజెండాను కొనసాగిస్తూనే ఉన్నారు. పార్టీ కార్యక్రమాలను పక్కనబెట్టి బీసీ ఉద్యమాలపైనే దృష్టి సారించారు. అసెంబ్లీ సమావేశాలలోనూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, నిరుద్యోగుల సమస్యలకే ప్రాధాన్యతనిచ్చారు. అంతేగానీ టీడీపీ ఎమ్మెల్యేగా వ్యవహరించలేదు. బీసీ నేతగా కృష్ణయ్య ప్రాధాన్యత ఏమాత్రం తగ్గలేదు. దీంతొ బలమైన సామాజిక వర్గాలను కూడగట్టే క్రమలో కాంగ్రెస్ పార్టీ కృష్ణయ్యపై దృష్టి కేంద్రీకరించింది. గుజరాత్ ఎన్నికల్లో సామాజిక వర్గాల సమీకరణ, వారి నుంచి ఓట్లను రాబట్టుకోవడంలో కాంగ్రెస్ విజయాన్ని సాధించింది. ఇదే తరహాలో తెలంగాణ సీఎం కేసీఆర్ వ్యతిరేక శక్తులతో పాటు, సామాజిక వర్గాలపై దృష్టి సారించింది. ఈ క్రమంలోనే రేవంత్‌ను కాంగ్రెస్‌లోకి చేర్చుకోవడం జరిగింది. గుజరాత్‌లో పటేల్ ఉద్యమాన్ని నడిపించిన హార్ధిక్ పటేల్ తరహాలో తెలుగు రాష్ట్రాల బీసీల ఉద్యమాలను నడిపిన కృష్ణయ్యను పార్టీలో చేర్చుకోవడం ద్వారా లాభం చేకూరుతోందని ఆ పార్టీ అధిష్టానం భావిస్తోంది. ఇటీవల నిర్వహించిన సర్వేల్లో కాంగ్రెస్ పార్టీకి అత్యధిక స్థానాలు వస్తాయని సంకేతాలు అందుతుండటంతో బలమైన సామాజిక వర్గాన్ని తమవైపు తిప్పుకోవడం ద్వారా విజయాన్ని సొంతం చేసుకునే దిశాగా కాంగ్రెస్ యోచిస్తోంది. తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో సీఎం అభ్యర్థులుగా స్వయం ప్రకటిత నేతలు పదుల సంఖ్యలో ఉన్నా.. కేసీఆర్‌కు ధీటైన నాయకత్వం లేదనే వాదన బలంగా ఉంది. పలు సర్వేల్లో ప్రజాధరణ కల్గిన నేతల్లో సీఎం కేసీఆర్‌కు 49శాతంతో తొలి స్థానంలో కొనసాగుతుండగా, 30శాతం ప్రజాధరణ కల్గిన నేతగా ఆర్.కృష్ణయ్య రెండవ స్థానంలో, 16శాతం ప్రజాధరణ పొందిన నేతగా రేవంత్‌రెడ్డి మూడవస్థానంలో కొనసాగుతన్నట్లు సర్వేల్లో తేలింది. కేసీఆర్ వ్యతిరేక శక్తులను కూడగట్టే క్రమంలో ఇప్పటికే రేవంత్‌ను పార్టీలో చేర్చుకున్న కాంగ్రెస్ ఆర్.కృష్ణయ్యను పార్టీలో చేర్చుకునేలా ప్రయత్నాలు కొనసాగిస్తోంది. అందులో భాగంగా కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ రామచంద్ర కుంతియా నేరుగా కృష్ణయ్య ఇంటికి వెళ్లి మూడు గంటలకు పైగా చర్చలు జరిపిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కృష్ణయ్య డిమాండ్లు ఏంటో చెబితే వాటిని అంగీకరించేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. కాంగ్రెస్ పార్టీలో చేరితే కృష్ణయ్యకు గుజరాత్ లేదా కర్ణాటక నుంచి గానీ రాజ్యసభ సభ్యునిగా అవకాశం కల్పించడానికి సిద్ధపడినట్లు సమాచారం. అయితే అధికార దాహం పదవీ వ్యామోహం తనకు ఎంతమాత్రం లేదని, చట్ట సభలలో బిసి రిజర్వేషన్ల సాధనే ధ్యేయమని కృష్ణయ్య చెప్పినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో కృష్ణయ్య కాంగ్రెస్ పార్టీలో చేరుతారనే ఊహాగానాలకు తెరలేపినట్లయింది. ఇటీవల కృష్ణయ్య వ్యవహార శైలిలో వస్తున్న మార్పులను గమనిస్తే ఆయన పార్టీ మారనున్నారని టీడీపీ నేతలు కూడా చెబుతున్నారు. ఉగాది పండగ తరువాత కాంగ్రెస్ పార్టీలోకి చేరేందుకు ముహూర్థం ఖరారైనట్లు తెలిసింది.



# ఖమ్మం కాంగ్రెస్‌లో టాస్క్‌ఫోర్స్ లొల్లి

- ఇది రాజ్యాంగ బద్ధమేనా అని చర్చ
- కాంగ్రెస్ నియమావళిలో ఉందా?
- దీన్ని ఎందుకు ఎవరి కోసం ఏర్పాటు చేశారు?
- కాంగ్రెస్ కమిటీలపై దీనికి ఆధిపత్యం ఉంటుందా?
- సూపర్ బాడీగా వ్యవహరించే అవకాశం కల్పించారా?
- ఏఐసిసి ఆమోదంతోనే ఇది జరిగిందా?
- జరిగితే వీరి అధికారాలు పరిధి గురించి స్పష్టత ఉందా?
- టాస్క్‌పోర్స్ నియామకంపై ఏఐసిసికి ఫిర్యాదు

(ఖమ్మం-సూర్యబ్యూరో): ఖమ్మం జిల్లా కాంగ్రెస్‌లో టాస్క్‌పోర్సు లొల్లి పంచాయతీలకు దారి తీస్తుంది. దేశంలోనే ఎక్కడా లేనిది ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ టాస్క్‌పోర్సును ఏర్పాటు చేసినట్లు తెలుస్తుంది. ఎక్కడ లేని టాస్క్‌పోర్సు ఖమ్మం జిల్లాలోనే ఏర్పాటుచేయాల్సిన అవసరం ఏమోచ్చిందనేది కాంగ్రెస్ పెద్దలకే తెలియాలి. అసలు ఇది రాజ్యాంగబద్ధమేనా? ఎవరి కోసం, ఎవరు ఎందుకు ఏర్పాటు చేశారనేది చర్చనీయాంశమైంది. దీన్నికాంగ్రెస్ పార్టీని జిల్లాలో బలోపేతం చేసేందుకు ఏర్పాటుచే శారా? లేక నిర్వర్యం చేసేందుకు ఏర్పాటు చేశారా? అనే దానిపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ నియమ నిబంధనల ప్రకారం, జిల్లా, రాష్ట్ర ఆలిండియా కమిటీలతో పాటు,బ్లాక్,లేదా మండల కమిటీలు ఏర్పాటుకు అవకాశం ఉంది. ఆ కమిటీలకు అధికారాలు ఉంటాయి. ఆ అధికారాలను కూడా కాంగ్రెస్ పార్టీ రాజ్యంగమే కల్పించింది. నియమనిబంధనల ప్రకారం కమిటీలు పనిచేయాల్సి ఉంటుంది. కాంగ్రెస్ పార్టీ నియమ నిబంధనావళిని మార్చల్సి వస్తే ఏఐసిసికే ఆ అధికారం ఉంటుంది. మధ్యలో వ్యక్తులకు ప్రమేయం ఉండదు. ఒక వేళ ఎవరైనా ఎదైనా నిర్ణయం తీసుకోవాల్సి వస్తే ఏఐసిసి ప్రవర్తనా నియమావళికి లోపడి నడుచుకోవాల్సి ఉంటుంది. పార్టీకి సూపర్‌బాడీ అనేది ఉండదు. పార్టీ పరిధిలోనే జరగాల్సి ఉంటుంది. కాని ఖమ్మంలో ఏర్పాటు చేసిన టాస్క్‌పోర్సు అందుకు భిన్నంగా వ్యవహరిస్తుందనే అభిప్రాయాలు ఉన్నాయి. అలా వ్యవహరించేందుకు టాస్క్‌పోర్సుకు అవకాశం ఉంటుందా? దాన్ని పార్టీ అత్యన్న సంస్థగా బావిస్తున్న ఏఐసిసి కల్పించిందా? అసలు ఆ ఆవకాశం ఉందా? ఉండదు. ఉండకూడదు. అనేది కాంగ్రెస్ పెద్దలు చెబుతున్న మాట. కాని కొత్తగా టాస్క్‌పోర్సు రంగంలోకి వ చ్చింది. ఈ టాస్క్‌పోర్సు అనేది ఒక్క ఖమ్మంలోనే ఉందా? దేశంలో అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేశారా? ఏఐసిసిలో వర్కింగ్ కమిటి ఉంటుంది. వర్కింగ్ కమిటీ తీసుకున్ననిర్ణయాలను సైతం ఏఐసిసి అనుమతి పొందాల్సిందే. అదిరాజ్యంగబద్ధమైందే . కాని రాష్ట్రాలలో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలు ఉన్నాయి. వాటిపై టాస్క్‌పోర్సులను నియమించారా?



నియమిస్తే ఇందులో ఏవరేవరు సభ్యులుగా ఉన్నారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఏ నిర్ణయం తీసుకోవాలన్నా టాస్క్‌పోర్సు అనుమతితో జరగాలని ఉందా? ఇది కాంగ్రెస్‌లో సూపర్‌బాడీనా? అదనపు రాజ్యాంగ హక్కులను కలిగి ఉందా? అనే ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. అసలు ఈ టాస్క్‌పోర్సు లొల్లి ఏమిటనేదానిపై ఉమ్మడి ఖమ్మంజిల్లాలో ఆశక్తికర చర్చ జరుగుతుంది. ఖమ్మంజిల్లాలో కొద్దినెలల క్రితం టాస్క్‌పోర్సును నియమించారు. దీనిలో ముగ్గురు సభ్యులను నియమించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ దానికి అధ్యక్షుడు ఉండగా టాస్క్‌పోర్సు ఎందుకు వచ్చింది? జిల్లా కాంగ్రెస్ కమిటీని నిర్వీర్యం చేసేందుకు ఏర్పాటు చేశారా? అలా అయితే కాంగ్రెస్ రాజ్యాంగం ఒప్పుకుంటుందా? అనే దానిపై ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి , రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జీ డాక్టర్ రామచంద్రకుంతియా, ఏఐసిసి అధ్యక్షుడు రాహుల్‌గాంధీ లు వివరణ ఇవ్వాల్సి ఉంది. ఒక వేళ టాస్క్‌పోర్సుకు అసాదారణ అధికారాలు ఉంటే వాటిని అమలు చేసేందుకు ఆవకాశంకల్పించాలి. అలా కాకుండా జిల్లా కాంగ్రెస్ కమిటీతో నిత్యం పంచాయతీ పెట్టుకునేందుకే దీన్ని ఏర్పాటుచేస్తే ఇది పార్టీకి తీరని నష్టం చేసేదిగా మిగిలిపోతుంది. దీన్ని ఎందుకు ఏర్పాటు చేశారు. అనేది వారిని నియమిస్తున్నప్పుడు ఇచ్చిన నోటులో ఉన్నా కాంగ్రెస్ నియమ, నిబంధనావళి అంగీకరిస్తుందా? లేదా? చూడల్సి ఉంది. ఇటీవలకాలంలో ఖమ్మంలో టాస్క్‌పోర్సు సభ్యులు జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుకి అమె సక్రమంగా పనిచేయటం లేదని నోటిసులు ఇచ్చినట్లు వార్తలొచ్చాయి. ఆలాంటి నోటిసులు తనకు అందలేదని ఆమె పేర్కొన్నారు. ఆమె ఇటీవల మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు వనపర్తి వచ్చిన సందర్భంగా జిల్లా నుంచి కార్లతో అక్కడకు వెళ్లారు. కాని ఆమె వెళ్ళలేదని ఎందుకు వెళ్ళలేదని నోటిసు సారాంశం. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఐతం సత్యం తాము ఏలాంటి నోటిసులు ఎవరికి ఇవ్వలేదని స్పష్టం చేశారు. రైతు విభాగం అధ్యక్షుడుకి కూడా ఇదే విధమైన నోటిసులు జారీ చేసినట్లు వార్త వచ్చింది. ఇటీవల కాలంలో మండలాల్లో కాంగ్రెస్ బిసి సెల్ ఆధ్వర్యంలో బిసి కాంగ్రెస్ కమిటీల నియమించారు. దీనిపై రాష్ట్ర కాంగ్రెస్ బిసి సెల్ అధ్యక్షుడికి ఫిర్యాదులు అందాయని టాస్క్‌పోర్సు అనుమతి లేకుండా కమిటీల నియామకం ఏమిటని పశ్నించారని తెలిసింది. దీనిపై జిల్లా కాంగ్రెస్‌లో పెద్దరచ్చకు దారి తీసింది. రిజర్వుడ్ నియోజకవర్గాల్లో కన్వీనర్లను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ హైకమాండ్ ఆదేశించింది. కాంగ్రెస్ పార్టీ ఆదేశానుసారం జిల్లా అధ్యక్షులు ఆశ్వారావుపేట మినహ మిగతా రిజర్వుడ్ నియోజకవర్గాలకు కన్వీనర్లను నియమించినట్లు తెలిసింది. దీనిపై కూడా టాస్క్‌పోర్సు సభ్యులు అభ్యంతరం పెట్టినట్లు తెలుస్తుంది. అసలు జిల్లా కాంగ్రెస్ కమిటీకి అధికారాలు ఏమిటి? ఏమి చేయాలన్నా టాస్క్‌పోర్సు అనుమతితో జరగాలనే దానిపై రాష్ట్ర కాంగ్రెస్ వివరణ ఇవ్వకపోతే ముందు ముందు మరిన్ని ఇబ్బందులు తప్పవు. టాస్క్‌పోర్సు నియామకంలో జిల్లాకు అసలు సంబంధంలేని వ్యక్తి ఖమ్మంజిల్లా తనదే అంటూ ప్రతి దాంట్లో జోక్యంచేసుకుని కాంగ్రెస్ పార్టీలో కొత్తపంచాయతీలకు ఆజ్యం పోస్తున్నారని ఇది ఇలాగే కొనసాగితే జిల్లాలో కాంగ్రెస్ కనుమరుగు కావటం ఖాయమని పేరు చెప్పడానికి ఇష్టపడని ఒక కాంగ్రెస్ నాయకుడు అన్నారు.

## సింగరేణి కారుణ్య నియామకాలకు గ్రీన్ సిగ్నల్

★ సీఎం కేసీఆర్, ఎంపీ కవితల ఫ్లెక్సీలకు పాలాభిషేకం
★ ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కేసీఆర్ అంటున్న కార్మికులు
★ సంబురాల్లో మునిగిపోయిన బొగ్గుగని కార్మికులు



హైదరాబాద్, మేజర్‌న్యూస్: సింగరేణిలో కారుణ్య నియామకాలను గ్రీన్ సిగ్నల్ లభించింది. సింగరేణి కార్మికులకు ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి కేసీఆర్ నిలబెట్టుకున్నారు. సింగరేణి కారుణ్య నియామకాలను చేపట్టాలని సింగరేణి సంస్థ ఉత్తర్వులు జారీ చేసింది. అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులకు, చనిపోయిన వారి పిల్లలకు కారుణ్య నియామకాలు వరంగా మారాయి. కారుణ్య నియామకాల ఉత్తర్వులు జారీ కావడంతో సింగరేణి కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్, ఎంపీ కవితకు ఈ సందర్భంగా సింగరేణి కార్మికులంతా ధన్యవాదాలు తెలియజేశారు.

**సింగరేణిలో సంబురాలు**

ఈసందర్భంగా.. సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని రుద్రంపూర్‌లో సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం టీబీజీకేఎస్ నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, ఎంపీ కవిత ఫ్లెక్సీలకు కార్మికులు పాలాభిషేకం చేశారు. స్వీట్లు పంచి సంబురాలు చేసుకున్నారు.

సూర్య
హైదరాబాద్
ఆదివారం
11 మార్చి 2018


## రాజధానిలో మరెన్నో బ్రాండెడ్ కంపెనీలు రావాల్సి ఉంది: మంత్రి అచ్చెన్న

విజయవాడ, సూర్య బ్యూరో : ఆదిత్యా బిర్లా వంటి ఎక్స్‌క్లూజివ్ లెనిన్ క్లబ్ షోరూంలు నూతన రాధానిలో ఇంకా ఎన్నో రావాల్సిన ప్రాముఖ్యత ఉందని మంత్రి కింజరవు అచ్చెం నాయుడు, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. బందరురోడ్డు, రాఘవర్య పార్క్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన "లెనిన్ క్లబ్" షోరూంను మంత్రి అచ్చెం నాయుడు, ఎమ్మెల్యే బొండా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూం అధినేత పరుచూరి కిరణ్ కుమార్ మాట్లాడుతూ లెనిన్ దుస్తులు అనగానే ఎవరికైన గుర్తుకు వచ్చేది "ఆదిత్య బిర్లా గ్రూప్" షూటింగ్, షర్టింగ్ దుస్తులు అన్నారు. దేశంలో 162, ఆంధ్రప్రదేశ్‌లో 21 స్టోర్లు కలిగిన లెనిన్ క్లబ్ షోరూంలు విజయవాడ నగరంలో రెండోవ స్టోర్‌ను నేడు ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. సూటింగ్, షర్టింగ్, ఫ్యాబ్రిక్, రెడిమేడ్ల లెనిన్స్, బ్లేజర్స్, మోడి జాకెట్స్, ట్రౌజర్స్, క్యాజువల్ మరియు పార్టీవేర్ షర్టు ప్లెయిన్, చెక్స్, ప్రింటెడ్ల, సూపర్ వంటి రకాలల్లో ఎన్నో మోడాల్స్ కలర్స్‌లలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రూ. 795 నుండి 9,000 వేల వరకు ఎన్నో రకాల ప్యూర్ లెనిన్ దుస్తులు మగ మహారాజుల కోసం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర ప్రముఖులు పాల్గొన్నారు.

# రాజధానిలో ఐటి సొబగులు

- మేధ టవర్‌లో హెచ్‌సీఎల్ కంపెనీ
- భవన నిర్మాణం పూర్తయ్యే వరకు ఇక్కడే
- తాత్కాలికంగా అద్దె భవనంలో ఏర్పాటు
- 65 వేల చదరపు అడుగుల స్థలాన్ని తీసుకున్న హెచ్‌సీఎల్
- వారంలో పూర్తికానున్న ఇంటీరియర్ పనులు
- త్వరలో ప్రారంభం కానున్న కార్యకలాపాలు

(సూర్యవిజయవాడ): రాజధాని అమరావతికి ఐటి సొబగులు సమకూరనున్నవి. అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేలా ఐటి నిపుణుల కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు కంపెనీలను ఇక్కడ ఏర్పాటుచేసేందుకు ఆసక్తి చూపుతోంది. ప్రత్యేకంగా ఐటి శాఖామంత్రి నారా లోకేష్ పలు ప్రముఖ కంపెనీలను రాజధానిలో ఏర్పాటు చేసేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారు. ఈ నేపథ్యంలో మరికొద్ది రోజులలోనే హిందుస్తాన్ కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్‌సీఎల్ ) టెక్నాలజీస్ కార్యకలాపాలు కేసరపల్లిలోని అద్దె భవనంలో ప్రారంభం కాబోతున్నాయి. భవన నిర్మాణం పూర్తి కావటానికి ఎంత లేదన్నా ఏడాది సమయం పడుతుంది కాబట్టి.. ముందుగా తమ సంస్థ కార్యకలాపాలు ప్రారంభించాలని హెచ్‌సీఎల్ సంస్థ నిర్ణయించింది. 'మేథ' టవర్‌లో 65 వేల చదరపు అడుగుల స్థలాన్ని హెచ్‌సీఎల్ సంస్థ అద్దెకు తీసుకుంది. వారం రోజుల్లో హెచ్‌సీఎల్ సంస్థ ఇంటీరియర్ పనులు ప్రారంభించబోతోంది. ఇంటీరియర్ పనులు పూర్తి కాగానే తన కార్యకలాపాలను ప్రారంభిస్తుంది. గన్నవరంలో హెచ్‌సీఎల్ ఏర్పాటు చేయబోయే ప్రాజెక్టును స్పెషల్ ఎకనమిక్ జోన్ (సెజ్) కిందకు తీసుకు రావటానికి ఆ సంస్థ ప్రయత్నాలు చేస్తోంది. హెచ్‌సీఎల్ సంస్థ సెజ్ కింద ప్రాజెక్టును ఏర్పాటు చేయాలనుకుంటున్న విషయాన్ని ఆంధ్రజ్యోతి కథనంగా ప్రచురించింది. ఏపీఐఐసీ నుంచి ఇందుకు కావాల్సిన డాక్యుమెంట్లను హెచ్‌సీఎల్ సంస్థ తీసుకుంటోంది. హెచ్‌సీఎల్‌కు గన్నవరంలో ఏపీఐఐసీ కేటాయించిన 27 ఎకరాలలో హైరైజ్ భవన నిర్మాణానికి శ్రీకారం చుడుతుంది. వారికి కేటాయించిన స్థలంలో పాత భవనాలు, చెట్ల తొలగింపు, నేల చదును వంటి కార్యక్రమాలు జరుగుతున్నాయి. భవన నిర్మాణ పనులు ప్రారంభించటానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని ఈ నెలలోనే నిర్వహించటానికి హెచ్‌సీఎల్ సిద్ధం చేస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు చేత శంకుస్థాపన చేయటానికి ఏర్పాట్లు చేసుకుంటోంది.

### అశోక్ లేల్యాండ్‌తో ఒప్పందం ప్రక్రియ

మల్లవల్లిలో బస్ బాడీ బిల్డింగ్ యూనిట్‌కు అప్పగించిన 75 ఎకరాలకు సంబంధించి అశోక్ లేల్యాండ్ సంస్థతో ఏపీఐఐసీ అధికారులు సేల్ డీడ్ ప్రక్రియను ప్రారంభించారు. నూజివీడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ ప్రక్రియ ప్రారంభమైంది. సేల్ డీడ్ రాసుకోవటం పూర్తయింది. ఏపీఐఐసీ తరవున జడ్‌ఎం శరత్‌బాబు, అశోక్ లేల్యాండ్ ప్రతినిధి శర్మలు పరస్పరం సేల్ అగ్రిమెంట్‌పై సంతకాలు చేసుకున్నారు. అగ్రిమెంట్ ఈ రోజు డేట్‌తోనే ఉంది. సబ్ రిజిస్ట్రార్ వేరే ఒక ముఖ్యమైన పనిలో ఉండి అందుబాటులో లేకపోవటంతో ఆయన సంతకం చేయటమే మిగిలి ఉంది. దాదాపుగా సేల్ అగ్రిమెంట్ కుదిరినట్టే సమాచారం.

## విపక్ష ఎమ్మెల్యేను కావడంతోనే వివక్ష

### వైసీపీ ఎమ్మెల్యే ముస్తఫా

గుంటూరు, మేజర్‌న్యూస్: అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వల్లే అమాయకుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని గుంటూరు ఈస్టు ఎమ్మెల్యే ముస్తఫా ఆరోపించారు. కార్పొరేషన్ సిబ్బంది, ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మంచినీటి పైపులైన్లు లీకేజీ అయి కలుషిత మంచినీరు తాగడంవల్ల గత ఐదు రోజుల్లో పది మంది చనిపోయారని, వందల మంది చికిత్స పొందుతున్నారని తెలిపారు. ప్రభుత్వం డయేరియా రోగులకు నాసిరకం మందుల్ని అందిస్తోందని ఆయన విమర్శించారు. తాగునీరు కలుషితమౌతోందని అనేకసార్లు కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదుచేసినా ఎవరూ పట్టించుకోలేదని, అందువల్లే డయేరియా రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. మురికి నీళ్లు వస్తున్నాయని బాటిల్‌లో నీళ్లు పట్టి చూపించినా అధికారులు స్పందించలేదన్నారు. వైసీపీ ఎమ్మెల్యేను కావడంతోనే తన నియోజక వర్గ అభివృద్ధి పట్ల ప్రభుత్వం వివక్ష చూపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఉద్యోగులతో చంద్రబాబు సర్కారు జూదం

### వైసీపీ నేత కన్నబాబు

కాకినాడ, మేజర్‌న్యూస్: రాష్ట్రంలోని ఉద్యోగుల భవిష్యత్‌తో చంద్రబాబు సర్కారు జూదం ఆడుతోందని, సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని కాకినాడ పార్లమెంట్ వైసీపీ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద నిరహర దీక్షలు చేపట్టిన ప్రభుత్వ ఉద్యోగులకు ఆయన మద్దతు పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైసీపీ అధికారంలోకి రాగానే సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తామని తమ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మాట ఇచ్చారని ఆయన తెలిపారు. జగన్ మాట ఇస్తే వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని వాటికి కట్టుబడి ఉంటారని తెలిపారు.

## ఎఫెక్టివ్ కమ్యూనికేషన్స్‌పై ట్రైనింగ్ వర్క్‌షాప్

విజయవాడ, సూర్య బ్యూరో : ఈ నెల 25 వ తేదీన తమ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు పాలడుగు పార్వతి దేవి ఇంజనీరింగ్ కాలేజీ ఛైర్ పర్సన్ పాలడుగు పార్వతి దేవి తెలిపారు. ఈ మేళాలో 30 కంపెనీలు పాల్గొంటాయని తెలియ జేశారు. బిటెక్, డిగ్రీ చదివే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ మేళాలో అన్ని కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనవచ్చని చెప్పారు. ఇన్ఫోసిస్, హెచ్‌జియస్, టెక్ మహీంద్రా, మెగ్న ఇన్ఫోటెక్, సౌరభ్ ఇన్ఫోటెక్, వర్ టెక్స్ తదితర కంపెనీలు పాల్గొంటాయని చెప్పారు. ఈ నెల 6, 7 తేదీలలో తమ కళాశాలలో ఎఫెక్టివ్ కమ్యూనికేషన్ అనే అంశం పై అంతర్జాతీయ వర్క్ షాప్ నిర్వహించామని చెప్పారు. ఈ వర్క్‌షాప్‌లో ప్రొఫెసర్ జగన్‌రావు, డాక్టర్ రమారావు, ఆస్ట్రేలియాకు చెందిన సదరన్ క్రాస్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ జెర్మీ నోవాక్,ప్రొఫెసర్ మ్యాతుయ్, ప్రొఫెసర్ థెరిసా, పాల్గొని విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ పై అవగాహన కల్పించారు. విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ విద్యార్థులకు ఎంతగానో ముఖ్యమని స్కిల్స్ పై పట్టు సాధిస్తే విజయం సాధిస్తారని అన్నారు. స్కిల్స్ ఉంటే ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని సూచించారు. ఆస్ట్రేలియాకు చెందిన సాయి రిసోర్సెస్ సెంటర్ ఆధ్వర్యంలో గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ స్కిల్స్, పబ్లిక్ స్పీకింగ్ స్కిల్స్ పై కూడా విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ నల్లగట్ల రాఘవేంద్ర సాయి మాట్లాడుతూ తమ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాల ద్వారా ఇప్పటి వరకు 500 మంది విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించామని తెలిపారు. విలేకరుల సమావేశంలో ప్రొఫెసర్ జగన్‌రావు, డాక్టర్ రమ రావ్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## బీసీలకు రాజ్యాధికారం వస్తేనే న్యాయం జరుగుతుంది

### బడుగుల కోసం త్వరలో రాజకీయ పార్టీ

విజయవాడ, సూర్య బ్యూరో : బడుగు, బలహీనవర్గాలు, బీసీల అభ్యున్నతికి రాజ్యాధికారమే ధ్యేయంగా త్వరలో ప్రత్యేక పార్టీని నెలకొల్పుతున్నట్టు బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు దేరంగుల ఉదయ్‌కిరణ్ తెలిపారు. నగరంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఉదయ్‌కిరణ్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వాలు బీసీలకు అన్యాయం చేస్తూనే వున్నాయన్నారు. ఈ రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న బీసీలకు అన్యాయం చేస్తూ, సంపన్నవర్గాల వారే రాజ్యాధికారం చేపడుతున్నారన్నారు. ఈ విధానం మారడానికి పార్టీ నెలకొల్పుతున్నామని బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి, సంక్షేమ ఫలాలు పూర్తిస్థాయిలో అందేవరకు నిరంతరం కృషి చేస్తామన్నారు. ప్రత్యేక రాజకీయ పార్టీతో బీసీ రాజ్యాధికారం చేపట్టాలంటే అందరూ ఐక్యంగా వుండాలని పిలువునిచ్చారు. బీసీ మహిళల హక్కుల కోసం త్వరలో రాష్ట్రస్థాయిలో బహిరంగ సభను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. నెలరోజుల్లో పార్టీ నెలకొల్పి, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ అధికసంఖ్యలో సభ్యులను చేర్పించనున్నట్లు తెలిపారు. వాల్మీకి సేన రాష్ట్ర అధ్యక్షులు యేరూరు రంగస్వామి, విశ్వబ్రాహ్మణ గౌరవాధ్యక్షులు సీహెచ్.ఓంకార్, కొప్పులవెలమ నాయకులు జి.రామకృష్ణ, యువజన నాయకులు లీలాకృష్ణ, బాబయ్య, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీతో వైసీపీ లాలూచీ

### ఏపీ అబ్కారీ శాఖ మంత్రి కె.ఎస్ జవహర్

రాజమహేంద్రవరం, సూర్య ప్రతినిధి : ప్రజలు కోరుకుంటే ఎన్డీఏ నుంచి టీడీపీ బయటకొచ్చేస్తాదని ఏపీ అబ్కారీ శాఖ మంత్రి కె.ఎస్. జవహర్ తెలిపారు. బీజేపీతో వైసీపీ లాలూచీ పడిందని ఆరోపించారు. వైసీపీతో కలిసి పోరాడాల్సిన అవసరం టీడీపీకి లేదని స్పష్టంచేశారు. ప్రధాని నరేంద్ర మోడీపై వైసీపీ నేతలు ఎందుకు అవిశ్వాసం పెడుతున్నారో చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు.

## ఎన్డీఏ నుంచి బయటకు వస్తాం

### టీడీపీ ఎంపీ కేశినేని నాని

విజయవాడ, సూర్య ప్రతినిధి : రాష్ట్ర ప్రయోజనాల కోసం వెనుకాడేది లేదని, ఎన్డీఏ నుంచి బయటకు వస్తామని ఎంపీ కేశినేని నాని స్పష్టం చేశారు. కేంద్రమంత్రులను రాజీనామా చేయించడం, సీఎం చంద్రబాబు తీసుకున్న సంచలన నిర్ణయమని కొనియాడారు. ప్రత్యేకహోదా ఆంధ్రుల హక్కు అని, మన హక్కును మనం కోరుతున్నామన్నారు. వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నారు. ప్రజలను మోసం చేసే విధంగా వైసీపీ వ్యవహరిస్తోందని కేశినేని నాని దుయ్యబట్టారు.

## శ్రీవాసవిలో ఘనంగా ముగిసిన టెక్ ఇఫోరియా 2కె18

### ఏపి నిట్ కో ఆర్డినేటర్ డా.ఎస్. శ్రీనివాసరావు

తాడేపల్లిగూడెం, రూరల్ మేజర్ న్యూస్ : తాడేపల్లిగూడెం శ్రీ వాసవి ఇంజనీరింగ్ కాళాశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న సాంకేతిక విజ్ఞాన మహోత్సవం "టెక్ఇఫోరియా2కె18" శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా శనివారం సాయంత్రం నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిధిగా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఆంధ్రప్రదేశ్ రెసిడెంట్ కో ఆర్డినేటర్ డా.ఎస్. శ్రీనివాసరావు పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. సాంకేతిక విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులు ముఖ్యంగా ఇంజనీరింగ్ విద్యార్థులు కేవలం పాఠ్యాంశాలకే పరిమితమైపోకుండా తమలోని ప్రతిభా పాటవాలను, సాంకేతిక నైపుణ్యాలను ప్రదర్శించడానికి ముందుకురావాలని సూచించారు. వివిధ కళాశాలల్లో నిర్వహించే పలు సాంకేతిక విజ్ఞాన సదుస్సుల్లో పాల్గొనడం ద్వార సాంకేతికను మెరుగుపర్చుకోవాలని అన్నారు. మారుతున్న ప్రపంచానికి అనుగూనంగా సమాజానికి ఉపయోగపడే అంశాలపై దృష్టిని నిలిపి ప్రపంచ మనుగడకు మేలు చేసి నూతన ఆవిష్కరణలు రూపకల్పన చేయాలన్నారు. కళాశాల పాలకవర్గ అద్యక్ష కార్యదర్శులు గ్రంధి సుబ్బారావు, చలంచర్ల సుబ్బారావులు మాట్లాడుతూ తక్కువ సమయంలో టెక్‌ఫెస్ట్‌ను నిర్వహించిన విద్యార్థిని, విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గున్నందుకు సంతోషంగా వుందన్నారు. భవిష్యత్తులో సంవత్సరానికి ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థుల్లోని మరింత మెరుగైన ఆవిష్కరనలు రూపోందించేలా కృషి చేస్తామని అన్నారు. టెక్‌ఫెస్ట్ కన్వీనర్లు డా.రాంబాబు మాట్లాడుతూ ఇంజనీరింగ్ మరియు వివిధ విభాగాలతో కలిపి 35 అంశాలలో పాటీలు నీర్వహించడం జరిగిందని, 22 కళాశాలల నుండి దాదావు 1000 మంది విద్యార్థుల వరకు ఆయా పోటీలలో ఉత్సాహంగా పాల్గొనడం జరిగిందన్నారు. కళాశాలలోని అందరి సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయగలిగామన్నారు. కళాశాల ప్రిన్సిపల్ బ్రహ్మయ్య, టెక్నికల్ డైరక్టరు చెక్కా అప్పారావు తదితరులు ప్రసంగించారు. అనంతరం వివిధ పోటీలలో పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు అతిధుల చేతుల మీదుగా ప్రసంసా ప్రతాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి పాబోలు వెంకటేశ్వరరావు, కోశాధికారి పేరూరి బాలకశయ్య, సభ్యులు జూలూరి నీలకంఠేశ్వరరావు, ఎన్.వి లక్ష్మినారాయణ, గ్రంధి రత్నావతి, కళాశాల డైరక్టరు శ్రీహరిరావు, డీన్లు డా.రత్నాకరరావు, రామారావు, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి.

## 2019లో కేంద్రంలో కాంగ్రెస్‌దే అధికారం

### రాహుల్ గాంధి ప్రధాని కాగానే ప్రత్యేక హోదాపై మొద టి సంతకం

మడకశిర, మార్చి 10(మేజర్ న్యూస్ ప్రతినిధి) : 2019లో యుపిఎ ప్రభుత్వం పగ్గాలు చేపటగానే రాహుల్ గాంధి ప్రధాన మంత్రిగా ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా పై మొద టి సంతకం చేస్తారని తెలిపినట్లు ఏపి పిసిసి ఛీఫ్ డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి తెలిపారు. అనంతపురం జిల్లా మడకశిర మండలం నీలకంఠాపురం గ్రామంలో రఘువీరారెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఏపికి ప్రత్యేకహోదాతో పాటు విభజన హామీలను నెరవేర్చడంలో కేంద్రం విఫలమయ్యిందని మండిపడ్డారు. అధికారం కాంగ్రెస్ వచ్చేవరకు అందరు కలసి పోరాడుదామని అన్ని పార్టీలకు పిలుపునిచ్చారు. అసెంబ్లిలో ప్రత్యేకహోదాతో పాటు హామీలు అమలుకు సవరణలు, చట్టంలో లోపాలు ఉన్నాయని చెబుతున్న ఈ రెండింటిని సవరణలు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఆంధ్రుల ఆత్మగౌరవం కాపాడుకోవడం కోసం మూడు రోజుల పాటు ధీక్ష చేసి దెబ్బతిన్న ఆంధ్రుల ఆత్మగౌరవం నిలబడే విధంగా కేంద్రానికి ధీటైన సమాధానం చెప్పినట్లు తెలిపారు.

## మంచి సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలి

### హోమ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఏఆర్ అనురాధ

విజయవాడ, సూర్య బ్యూరో : మంచి సమాజ నిర్మాణం కోసం పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, పోలీసులు పనిచేయాల్సిన అవసరంతో పాటు క్రిమినల్స్ కూడా సాధారణ జీవితం జరిపేలా వీరు కృషి చేయాల్సిన అవసరం ఉందని హోమ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఏఆర్ అనురాధ తెలిపారు. శనివారం పోలీస్ కమాండ్ల కంట్రోల్ సెంటర్‌లో ఎమర్జింగ్ లీగల్ ట్రెండ్స్ పై ప్రాసిక్యూషన్స్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి వర్క్ షావులో ముఖ్య అతిధిగా హోం శాఖ ముఖ్య కార్యదర్శి ఏఆర్ అనురాధ పాల్గొని మాట్లాడుతూ వుడ్డ సేఫ్టీ, సైబర్ క్రైమ్స్ పై అవగాహన తరగతులు నిర్వహించటం జరుగుతోందని. మారుతున్న కాలానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు లీగల్ ట్రెండ్స్ పై అవగాహన కల్పించటానికి ఇలాంటి వర్క్‌షావులు విచారణ అధికారులకు ఉపయోగపడతాయన్నారు. మారుతున్న చట్టాలకు అనుగుణంగా విచారణ అధికారులు అటు సుప్రీం కోర్టు, హైకోర్టులో వస్తున్న తీర్పులను పరిశీలించి తగిన విధంగా అన్వయించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగా ఇలాంటి వర్క్‌షావుల ఆవశ్యకత ఏర్పాటు ఉందన్నారు. సమాజంలో క్రైమ్ రేటు తగ్గించటంతో పాటు అందరూ సంతోషంగా జీవించేలా ఉండే వాతావరణం కల్పించాల్సిన అవసరం మనపై ఉందన్నారు. తప్పుచేసిన క్రిమినల్స్‌ను శిక్షించాల్సిందేనని కాని అమాయకులను చట్టాల నుంచి కాపాడాల్సిన బాధ్యత పబ్లిక్ ప్రాసిక్యూటర్ల పై ఉందన్నారు. విజయవాడ పోలీస్ జాయింట్ కమీషనర్ కాంతి రాణా టాటా మాట్లాడుతూ సివిల్ సర్వీస్ లోకి రాకమునువు అడ్వకేట్‌గా ఉన్నానన్నారు. విచారణ అధికారులు 41 ఏ సీఆర్‌పీసీ యాక్ట్ పై అవగాహన ఉంటే తగిన విదమైన చట్టాలు నమోదు చుయటానికి అవకాశం ఉందని, చట్టంపై అవగాహన ఉండటం వల్ల నిజమైన దోషులకు శిక్షలు పడేలాగా సకాలంలో చేయవచ్చున్నారు. ఎమర్జింగ్ లీగల్ ట్రెండ్స్ ఒక రోజు వర్క్ షావులో ప్రాసిక్యూషన్స్ అడిషనల్ డైరెక్టర్ (ఎఫ్‌ఏసీ) బీ. రామ కోటేశ్వరరావు, ప్రాసిక్యూషన్స్ జాయింట్ డైరెక్టర్ వీ. రఘురామ్‌తో పాటు, 13 జిల్లాల నుంచి 175 మంది పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ తదితరులు హాజరయ్యారు.

## రెల్లి కులస్థుల జీవితాల్లో వెలుగులు నింపాలి

విజయవాడ, సూర్య బ్యూరో : స్వాతంత్ర్యం వచ్చి 7 దశాబ్దాలు గడిచినా రెల్లి కులస్థుల జీవన విధానంలో మార్పు రాలేదని రెల్లి యూత్ అసోసియేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి తుమ్మిరాజు రెల్లి ఒక ప్రకటనలో ఆవేదం వ్యక్తం చేసారు. రెల్లి కులస్థులు తప్పనిసరి పరిస్థితుల్లో పారిశుధ్ద్య పనిని చేపట్టినందుకు వీరి జీవితాలలో ఆకలి, అవమానం సంక్షోభం తప్ప ఏమీ మిగలలేదని పేర్కొన్నారు. పారిశుద్ధ్య పనులనే వృత్తిగా స్వీకరించి మనుగడ సాగిస్తూ, పారిశుద్ధ్య పనులతో సేవలందిస్తూ జీవనం గడువుతున్న రెల్లి పారిశుద్ధ్య కార్మిక వర్గానికి స్వాతత్ర్యం పూర్వం నుండి కొనసాగుతూ వస్తున్న వారసత్వపు హక్కును గత తెలుగుదేశం ప్రభుత్వం రద్దు చేసిందని తెలిపారు. వారసత్వపు ఉద్యోగాలను రద్దు చేయడంతో చదువు లేని పారిశుద్ధ్య పనివారు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సాంఘిక, విద్య, వైద్య, ఉద్యోగ ఉపాధి రంగాలలో, ఎస్.సి, ఎస్టీ, కమీషన్‌లలో, నామినేటెడ్ల పోస్టుల లో రెల్లి కులస్థులకు కూడా భాగస్వామ్యం కల్పించి రాజ్యాంగ హక్కులు కల్పించినపడే నిజమైన సాంఘిక, సామాజిక న్యాయం చేసిన వారవుతారని ఆయన తెలిపారు. ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా, రెల్లి ప్రజలు ఎటువంటి అభ్యున్నతికి నోచుకోవడం లేదని రాష్ట్రంలో సుమారు 20 లక్షలకు పైగా రెల్లిలు వున్నారని తెలిపారు.

## ముందు తరాల వారికోసం మన సంస్కృతి

# వారసత్వ సంపదను కాపాడాలి

### పురావస్తు శాఖ కమిషనర్ డాక్టర్ వాణీ మోహన్

విజయవాడ, సూర్య బ్యూరో : నీటి ప్రాజెక్టుల నిర్మాణాలతో ముంపు గ్రామాలలో కనుమరుగయ్యే ప్రమాదము ఉన్న మన సంస్కృతి, వారసత్వ సంపదను కాపాడి ముందు తరాల వారికి అందజేసే లక్ష్యంతో రాష్ట్ర పురావస్తు శాఖ పనిచేస్తుందని పురావస్తు శాఖ కమీషనర్ డాక్టర్ వాణీ మోహన్ తెలిపారు. విలేకరుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ పురావస్తు శాఖ కమీషనర్ డాక్టర్ వాణీ మోహన్ మాట్లాడుతూ నాగార్జున యూనివర్శిటీలో 12, 13, 14 మూడు రోజుల పాటు అంతర్జాతీయ వర్క్ షావు నిర్వహిస్తున్నామన్నారు. ఈ వర్క్ షావులో దేశ, విదేశాల నుంచి ఎంతో మంది ప్రముఖులు, ప్రొఫెసర్స్, అసిస్టెంట్ ప్రొఫెసర్స్‌తో పాటు ప్రముఖ యూనివర్శిటీల నుంచి అతిధులు వస్తున్నారన్నారు. మొదటి రెండు రోజులు పాటు వివిధ అంశాలమీద చర్చించటం జరుగుతుందని, మూడవ రోజు క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా పోలవరం ప్రాజెక్టు సందర్శనకు వెళ్లనున్నట్లు తెలిపారు. పోలవరం ప్రాజెక్టులో నవంబర్, 2017 నుంచి ముంవుకు గురౌతున్న ప్రాంతాలలో తవ్వకాలు జరుగుతున్నాయని, వాటిని పరిరక్షించటానికి ప్రభుత్వ ఆదేశాలమేరకు కృషి చేస్తున్నామన్నారు. తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలలో ముంపుకు గురయ్యే రెండు గ్రామాలు రాయునిపేట, రుద్రంకోటలో తవ్వకాలు జరుగుతున్నాయని ఇవి మే 5 వరకు జరపనున్నామని తెలిపారు. ఈ ప్రాంతంలో క్రీస్తు పూర్వం 160 నుంచి 1800 వరకు ఆధారాలు లభించాయని, వీటికి సంబంధించి ఆనాటి ఆదిమానవులు ధరించిన వస్తువులు, మహిళలు ధరించిన అభరణాలు లభించాయన్నారు. ఆ ప్రాంతంలో మనుషూలు ధరించిన వస్తువులు, జంతువుల దంతాలు, వివిధ రకాల టూల్స్, ప్రాచీన మానవుడు లక్ష సంవత్సరాల క్రితం ఉపయోగించిన వస్తువులు, కాపర్ బ్యాంగిల్స్, గొడ్డళ్లు, నాగళ్లు అక్కడ లభించాయన్నారు. బృహత్ శిలా యుగ సంస్కృతిని వెలికితీయడంలో భాగంగా తూర్పు గోదావరి జిల్లా రాయనిపేట, పశ్చిమ గోదావరి జిల్లా రుద్రమ్మకోటలో తవ్వకాలు ఆశించిన ఫలితాలు ఇస్తున్నాయన్నారు. అదే విధంగా పోలవరం సైట్ వద్ద ఒక ప్రదర్శన శాలను నిర్మించి ముంవు ప్రాంతంలో లభించిన వురాతన సంపదను ప్రజల సందర్శనకు ఏర్పాటు చేయనున్నామని ఆమె తెలిపారు. నాగార్జునసాగర్, శ్రీశైలం డ్యామ్‌లు నిర్మిస్తున్నపడు అక్కడ లభించిన వురావస్తు సంపదను రాష్ట్ర వురావస్తు శాఖ వెలికితీసి పరిరక్షించి సురక్షిత ప్రాంతాలకు తరలించిందన్నారు. పోలవరం ప్రాజెక్టు ముంవుకు గురవుతున్న గ్రామాలలో 341 రాతి విగ్రహాలను, రెండు దేవాలయాలను, 4 బృహత్ శిలా యుగ సంస్కృతి గల స్థలాలను గుర్తించి వాటిని సంరక్షించే బాధ్యతను ప్రభుత్వ ఆదేశాల మేరకు సేకరించడం జరిగిందన్నారు. ఈ చర్యలలో భాగంగా వడ్డిగూడెంలో ఉన్న రుద్రకోటేశ్వరస్వామి ఆలయం, కౌండిన్యముఖిలో గల శ్రీముక్తేశ్వరస్వామివార్ల ఆలయాలు తరలింపు కార్యక్రమాలు చేపట్టామన్నారు. మన సంస్కృతి, వారసత్వాలను ఎలా ప్రారంభం అయ్యేవో తెలుసుకోవడానికి ఇవి సాక్షిభూతంగా నిలుస్తాయన్నారు. వాటిని పరిరక్షించుకోవడానికి రాష్ట్ర పురావస్తు శాఖ ప్రయత్నిస్తుందన్నారు.

## అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు

విజయవాడ, సూర్య బ్యూరో : గృహిణిగా, శ్రమ జీవిగా, ఉద్యోగిగా ప్రజా ప్రతినిధిగా అన్ని రంగాల్లో మహిళలు వురుషూలతో సమానంగా రాణిస్తున్నారని పలువురు వక్తలు పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సం పురస్కరించుకొని వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన ప్రతిభావంతులకు మహిళాసాధికారత పురస్కారాలు అందజేశారు. ఇరువురికి అంతర్జాతీయ డాక్టరేట్ అవార్డులు ప్రధానం చేశారు. నగరంలో గ్లోబల్ క్రియేటివ్ ఆర్ట్స్ అకాడమీ, ఫిలాంత్రోఫిక్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ రంగాల్లో కృషి చేస్తున్న మహిళలను గౌరవించాలనే ఉద్దేశ్యంతో పురస్కారాలు అందజేస్తున్నామని చెప్పారు. స్కోర్‌మోర్ ఫౌండేషన్ కో ఫౌండర్ డా॥ శాంతిదేవి, మహిళా శిశు సంక్షేమ శాఖాధికారిణి గొల్ల వరహాలు, ఎపి ఓబిసి ఉమెన్ ఫెడరేషన్ వేమవరపు వరలక్ష్మి, సామాజిక వేత్త నెల్లూరి షర్మిలా సంపత్, సత్యభామ ఛారిటబుల్‌ట్రస్ట్ వ్యవస్థాపకురాలు డా॥ రాయవరపు సత్యభామా, సామాజిక వేత్త దోనేవూడి రమాదేవి, ఉపాధ్యాయురాలు జొన్నల విజయనాగమణి, బాలకోటేశ్వరరావు వృద్ధాశ్రమ సేవా సంఘం వ్యవస్థాపకురాలు కానూరి శేషా మాధురి, మహిళా నిర్భయ సేవా సంఘం అధ్యక్షురాలు లక్ష్మీముత్యం, సామాజిక వేత్త కోయ సుధ మహిళా సాధికారత పురస్కారాలు అందుకున్నారు. చెన్నైకి చెందిన మృదంగ విద్వాంసులు పత్రి సతీష్‌కుమార్, మిమిక్రీ ఆర్టిస్ట్ జాషూవాలకు అంతర్జాతీయ డాక్టరేట్‌ను ప్రధానం చేశారు. తొలుత తన కుమారుడి అవయవాలు దానం చేసిన పేద మహిళ చారుమడి కవితకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఉద్యమనేత, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు మేదర సురేష్‌కుమార్ పర్యవేక్షించగా ఫిలాంత్రోఫిక్ సొసైటీ వ్యవస్థాపకులు డా॥ అద్దంకి రాజాయోనా, గ్లోబల్ క్రియేటివ్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకులు సీతా మాడభూషి, , స్కోర్‌మోర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు తుర్లపాటి పట్టాభిరాం, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షురాలు గెల్లా కృష్ణవేణి, పారుపల్లి సురేష్, బి.సతీష్‌బాబు, కత్తిమండ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



# మార్చిలోనే... మండే సూరీడు

**మార్చి పూర్తి కానే లేదు... కానీ సూర్యుడు నిప్పుల కొలిమిలా మండటం ప్రారంభించాడు. ఉదయం నుంచే భానుడు తన ప్రతాపం చూపిస్తుండటంతో గరిష్ఠ ఉష్ణోగ్రతలు రానురానూ పెరుగుతూ వస్తుండటంతో సాధారణం కంటే 2 నుంచి 5 డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయి. ఉదయం 8 గంటలు దాటితే బయటికి రాలేని పరిస్థితి వచ్చిందంటే ఎండలు ఏ మాత్రం ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.. ఈ ఎండల్లో అత్యవసరమైతే తప్ప ఎవరూ బయట తిరగడం లేదు. కాగా ఇటు ఇంటర్ పరీక్షలు, డిగ్రీ ప్రాక్టికల్స్, 10వ తరగతి పరీక్షలు ప్రారంభం కావటంతో విద్యార్థులకు తిప్పలు తప్పేలా లేవు. ఇక ఉద్యోగస్థుల పరిస్థితి చెప్పనవసరం లేదు. వారానికొక సెలవు రోజుమిగతా రోజుల్లో ఆఫీస్‌లకు వెళ్లాలంటే గంటల తరబడి ట్రాఫిక్‌లో వేచి ఉండాల్సిన పరిస్థితి. ఈ ఎండల్లో కార్యాలయాలకు చేరుకునేసరికి డీలాపడిపోతున్నారు ఉద్యోగులు. మున్ముందు ఇంతకు మించిన ఎండలు ఉండే అవకాశాలుంటాయన్న మీడియా కథనాలతో ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. ఎండల నుంచి రక్షణకు ముందస్తు జాగ్రత్తలే పరిష్కారమని సూచిస్తున్నారు నిపుణులు**

ఎన్నడూ లేని విధంగా మార్చిలోనే సూర్యుడు మండే ఎండ[illegible] వడగాలులు కూడా తోడవడంతో ప్రజలు తల్లడిల్లు[illegible] కారణంగా సంక్రాం తి పండుగ నాటికే చలి పూర్తిగా[illegible] మొదలైంది. ఎన్నడూలేని విధంగా మార్చి నెలలోనే ఎండ[illegible] ఇట్లుంటే ఇక ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఏమిట ని ప్రజ[illegible] రిలయన్స్

చెందుతున్నారు. ప్రకృతి విధ్వసం కారణంగా విపరీత పరిణామాలు ఇంత తీవ్రంగా ఉంటాయని మనం నేటికీ గ్రహించినా పర్యావరణ పరిరక్షణ దిశగా కనీసం కృషి చేయటం లేదు. పైగా ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వినియోగం, రసాయన ఎరువు వాడకం పెంచుకుంటూ పోతున్నాం. దీంతో భూమిలో ఉండాల్సిన నీటి నిలువరులు ఉండకుండా పోతున్నాయి. వర్షాలు లేక భూగర్భజలాలు అడుగం టడంతో వేడి మరింతగా పెరుగుతోంది.

**పెరుగుతున్న ఎండలు**

ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వరకూ, కోస్తా ఆంధ్రాలోనూ, రాయలసీమ లోనూ, ఇటు తెలంగాణ అంతటా ఉష్ణోగ్రతలు రోజు రోజుకూ పెరిగిపోతుండటంతో జనం ఆందోళన చెందు తున్నారు. .మార్చి నెలలోనే సాధారణ ఉష్ణోగ్రతల కంటే 6 నుంచి 8 డిగ్రీల ఉష్ణోగ్రత పెరిగింది. గత రెండు రోజుల్లోనే అకస్మాత్తుగా మూడు నుంచి ఆరు డిగ్రీల వరకూ ఉష్ణోగ్రత పెరగడంతో సామాన్యుడు తాళలేకపోతున్నాడు మరో రెండు మూడు రోజులలో ఉష్ణోగ్రతలు మరింత పెరిగేలా

**జాగ్రత్తలే తగినవి**

ఇలాంటి తరుణంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఎండలు త్రీవంగా ఉన్నప్పు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లరాదని, నిపుణులు హెచ్చరిస్తున్నారు. సూర్యుడి నుంచి వచ్చే ఎండ వేడిలో శక్తిమంతమైన అతినీల లోహిత కిరణాలు(అల్ట్రా వైలెట్ రేస్) నేరుగా మనిషి శరీరంలోకి చొచ్చుకుపోయి కేన్సర్ వంటి వ్యాధులకు దారి తీసే ఆస్కారం ఉందని హెచ్చరిస్తున్నారు.

**నీటికోసం కటకట**

ఇప్పటికే హైదరాబాద్‌తో సహా పలు ప్రాంతాలలో భూగర్భజలాలు పాతాళానికి పడిపోవడంతో పాటు ఎండ తీవ్రత కారణంగా వేల బోర్లు ఎండిపోతున్నాయి. భూగర్భ జలమట్టాలు వేగంగా పడిపోతుండటం తో రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. నిండు వేసవి రాక ముందే అనేక మండలాల్లో పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. గత ఏడాది రాష్ట్రంలో సాధారణ వర్షపాతం, అంతకంటే ఎక్కువే నమోదైనా భూగర్భ జలాలు గతంలోకన్నా అట్టడుగు చేరడం ఆందోళనకర పరిణామం. ఇప్పటికే తెలంగాణలోని సిద్ధిపేట, సంగారెడ్డి, రంగారెడ్డి, నాగర్ కర్నూలు, నల్గొండ జిల్లాతో పాటు మరి 326 మండలాల్లో నీటి ఎద్దడి అప్పుడే ప్రారంభమైంది.

**తాపం తీర్చే పానీయాలు**

వేసవి తాపం తీర్చే పానీయాలు అప్పుడే దర్శనమిస్తున్నాయి. ఎర్రటి ఎండలో తిరుగే వారి సేద తీర్చేందుకు చలివేంద్రాలు వెలుస్తున్నాయి. రోడ్డు ప్రక్కల చెరుకురసం, నిమ్మరసం, బాదంపాలు, కొబ్బరిబొండాలు, ఫ్రూట్ సలాడ్ సెంటర్లు ఇలా వేసవిలో బిజినెస్ చేసుకునే వారికి కొదవే లేదు. ఇదిలా ఉండగా సరిగ్గా పెళ్లిళ్ల సీజన్ మొదలవ్వడంతో ఇక ప్రయాణాలు చేసే వారి కష్టాలు అన్నీ ఇన్నీ కావనుకోండి.

**నీళ్లే శరణ్యం**

ప్రజలు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు, వైద్యులు హెచ్చరిస్తున్నారు. మధ్యాహ్నం వేళల్లో బయటకు వెళ్లే వారు వెంట నీళ్ల బాటిల్ వెంట తీసుకెళ్లడంతోపాటు తేలికపాటి దుస్తులు ధరించడం సబబని సూచిస్తున్నారు.

**పళ్లు తీసుకోండి కానీ...**

ఈ వేడి నుంచి ఉపశమనం పొందేందుకు జిల్లా వాసులు చల్లచల్లని పానీయాలతో పాటు తాజా పండ్లు తీసుకునేందుకు ఆసక్తి చూపుతారు. అందునా వేసవి సీజన్ లో దొరికే అన్ని రకాల ఫలాలు ప్రస్తుతం మార్కెట్‌లో లభ్యమవుతుండటంతో వాటి కొనుగోళ్లు క్రమంగా పెరుగుతున్నాయి. కర్బూజా, ద్రాక్ష, సంత్ర, బొప్పాయి, దోసకాయ, మామిడి పండ్ల రసాలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. తెలుగురాష్ట్రాల లోని అనేక ప్రాంతాలోని ప్రధాన కూడళ్లలో తోపుడు బండ్లపై అమ్మకాలు జరుప ుతున్నాయి. అయితే డిమాండ్‌కు తగ్గ పంటలు ఉన్నప్పటికీ అమ్మకాలు జోరందుకోవటంతో వివిధ రకాల రసాయనాలు, కార్బోరైట్‌ను వినియోగించి పండ్లను మాగబెట్టేందుకు వ్యాపారులు ఆసక్తి చూస్తున్నారు. అయితే పండ్లను సహజంగానే మగ్గబెట్టి విక్రయించాలని, అలా చేయని వారిపై చట్ట ప్రకారం కటిన చర్యలు తీసుకోవాలని హైకోర్టు 2016లో రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలను ఆదేశాలించినా అమలు నామమాత్రమే అవుతోంది. ప్రస్తుత వేసవి సీజన్ ప్రారంభం కావటంతో అప్పుడే పండ్లను రసాయనాలతో మాగేయుటం ప్రారంభమైంది. ఇది ఓ రకంగాప్రజల ప్రాణాలతో చెలగాటమాడటమే. ఇప్పటికైనా ప్రభుత్వాధికారులు ఏమేరకు ప్రాణ నష్టం జరగకముందే పట్టించుకుని పండ్ల గోదాములు, దుకాణాలపై పర్యవేక్షణకు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.











**ప్రకృతి వినాశమే కారణం**

వివిధ కారణాలతో మనం చేజేతులారా చేసిన ప్రకృతి విధ్వంసమే ఇలాంటి ఎండల ను చవిచూడాల్సి రావటానికి ప్రధాన కారణం అన్నది ఎవరు అవున న్నా... కాదన్నా అంగీకరించాల్సిన అక్షర సత్యం. అభివృద్ధి మాటున అటు పట్టణాలలోనూ ఇటు గ్రామీణ ప్రాంతాలలోనూ చెట్లను నరికివేయిటం, ప్రకృతి సహజ సిద్ధంగా ఏర్పడిన కొండలను విధ్వంసం చేయటం, చివరికి నదీ గర్భాలలో, వాగులలోని ఇసుకను ఎత్తేసి జరిపినందుకు జనం అల్లాడి పోవాల్సిన పరిస్దితి వచ్చింది.

వేసవి కాలం పూర్తిగా రాకముందే ఒక్క సారిగా పెరిగిపోయిన ఉష్ణోగ్రతలతో దేశవ్యాప్తంగా వడదెబ్బలకు ప్రజలు పిట్టల్లా రాలుతున్నారన్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. వేసవి కాలం పూర్తిగా రాకముందే ఇంత ఎండ తీవ్రతను భరించడం కష్టంగా మారింది. ప్రాణాలు హరిస్తున్న ఎండలు మార్చిలోనే మొదలైతే మే నెల వరకూ ఎలా బతికేది అనే ఆందోళన అందరిలో కనిపిస్తోంది. ఈ క్రమంలో తాగేందుకు కనీసం నీళ్లు దొరుకుతాయా? అన్న ఆందోళన కూడా జనంలో కనిపస్తోంది.

పంటల సంగతి అటుంచి పశువులను అప్పటి వరకూ బతికించుకోవడం ఎలా అని రైతులు ఆందోళన ఉంటుందని అందుతున్న హెచ్చరికలు ఆందోళన కలుగజేస్తున్నాయి.

రోజు రోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు తల్లడిల్లి పోతూ, ఇళ్ల నుండి బయకు రావటానికి భయపడుతున్నారు. గత రెండు రోజులుగా తెలంగాణ రాష్ట్రంలోని సరాసరి ఉష్ణోగ్రత మూడు డిగ్రీలు పెరిగింది. భానుడి ప్రతాపానికి పగటి వేళ ఉష్ణోగ్రత గరిష్టంగా నమోదౌతుండటంతో రానున్న రోజులలో ఎండలు మరింత పెరిగితే వడదెబ్బ కారణంగా సంభవిరచే మరణాలు పెరిగే ఆస్కారం ఉందని ఇందుకు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యనిపుణులు సూచనలు చేస్తున్నారు.

ఈసారి పెరిగే ఉష్ణోగ్రతలతో అన్ని పట్టణాలు నిప్పుల కొలిమిని తలపిరచడం ఖాయంగా కనిపిస్తోంది. ప్రకృతి ప్రకోపించినవుడు దుష్ఫలితాలు ఏ విధంగా ఉంటాయో ఎండల ద్వారా తెలుపుతు న్నాయని.అకస్మాత్తుగా పెరిగిన ఎండలు మరిన్ని ప్రాణాలు తీయకముందే ప్రభుత్వాలు మేలుకుని చర్యలు తీసుకోవాలన్న డిమాండు వినిపిస్తోంది. మరోవైపు పంటలను, పశువులను కాపాడుకుంటూ జనానికి తగిన భద్రత కల్పించేందుకు యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉంది. ఈమేరకు ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధమవుతున్నాయి.

వచ్చే రెండు నెలల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉండే ప్రమాదం ఉందన్న హెచ్చరికలతో ఎండలు మరింత విపరీతమై రేడియేషన్ పంజా విసరే ఆస్కారం ఉందని, అతినీల లోహిత కిరణాలు విరుచుకు పడితే అనారోగ్యం పాలు కావటం ఖాయమన్న భావన సర్వత్రా వినిపిస్తోంది.. గత మార్చి చివర్లోనే రేడియేషన్ సూచిక ఏకంగా 12కు చేరుకున్న విషయాన్ని గుర్తు చేస్తూ, ఈ ఏడాది పరిస్థితి ఎలా ఉండబోతోందన్నదానిపై పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

– శ్రీవల్లి





# మోడీని మనిషిని చేద్దాం!





మోడీని మనిషిని చేద్దాం' అంటూ 'భరత్ అనే నేను' చిత్ర దర్శకుడు కొరటాల శివ చేసిన ట్వీటు సంచలనం సృష్టిస్తోంది. తన ప్రతి చిత్రంతో ఏదో ఒక సామాజిక సందేశం ఇవ్వడం అనేది ఆనవాయితీగా పెట్టుకొన్న కొరటాల శివ.. తన తాజా చిత్రం 'భరత్ అనే నేను'లో 'ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలోని గొప్పతనాన్ని విశదీకరిస్తున్నట్లుగా తెలుస్తోంది!

ఇప్పటికే కోటిన్నర వ్యూస్ రాబట్టిన 'భరత్ అనే నేను' టీజర్ విడుదలైన నాలుగు రోజుల తర్వాత కూడా అదే జోరు కొనసాగిస్తూ అందర్నీ అబ్బురపరుస్తోంది. సినిమా వర్గాల్లోనే కాకుండా.. రాజకీయవర్గాల్లోనూ ప్రకంపనలు పుట్టిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 20న విడుదలవుతోంది. అదే రోజు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పుట్టినరోజు కావడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది!

మహేష్‌బాబు సరసన కైరా అద్వానీ నటిస్తున్న ఈ చిత్రానికి దేవిశ్రీప్రసాద్ సంగీతం సమకూర్చుతుండగా డి.వి.వి.దానయ్య నిర్మిస్తున్నారు!!

# పౌరుషమున్న పోరగాళ్లంతా పెద్ద పులులే



నువ్వు పెద్ద పులినెక్కినావమ్మో గండి పేట గండి మైసమ్మ' అనగానే ప్రాంతీయబేధం లేకుండా ప్రతి తెలుగు కుర్రాడూ పూనకం వచ్చినట్టు డాన్సులు వేస్తారు. ఎందుకంటే ఆ పాటలో ఉన్న ఎనర్జీ అటువంటిది. ఇప్పుడు ఈ పాటని మన యువ కథానాయకుడు నితిన్, మేఘ ఆకాష్ జంటగా నటిస్తున్న 'ఛల్ మోహన్ రంగ'లో రీక్రియేట్ చేస్తున్నారు. కృష్ణచైతన్య దర్శకత్వం వహిస్తుండగా.. శ్రీమతి నిఖితా రెడ్డి సమర్పణలో- పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్- త్రివిక్రమ్ మరియు శ్రేష్ట్ మూవీస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి!

తెలంగాణ సంస్కృతిని, పెద్దమ్మ తల్లి గొప్పతనాన్ని చాటుతూ బోనాల సంబరాలలో పాడుకునే పాట "పెద్ద పులి". ఆ పాటని అంతే గొప్పగా, దాని స్థాయి ఏ మాత్రం తగ్గకుండా సంగీత దర్శకులు థమన్ మరియు సాహిత్య రచయిత సాహితి చాలా జాగ్రత్తగా రీక్రియేట్ చేశారు.

పెద్ద పులి లాంటి పాట హీరో ఇంట్రడక్షన్ సాంగ్ అయితే, అదీ తెలంగాణ వాస్తవ్యుడైన నితిన్ 25వ చిత్రం అయితే, దానికి థమన్ తన ఫోక్ ఇన్స్ట్రుమెంట్స్‌తో దానిని వేరే స్థాయికి తీసుకుని వెళ్తే, వీటన్నిటికీ మించి ఆ పాటకి శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీలో నితిన్ మాస్ స్టెప్స్ వేస్తే, ఇంకేముంది? థియేటర్లో ఫ్యాన్స్ కి సంబరాలే... సంబరాలు!

ఈమధ్య ఫోక్ సాంగ్స్‌కి కేరాఫ్ అడ్రస్‌గా మారిన రాహుల్ సిపిలిగంజ్ ఈ పాటని పాడారు. ఈ గీతం వరంగల్‌లోని వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజ్‌లో యువత కేరింతలు నడుమ విడుదలయ్యింది!!

# విడుదల సన్నాహాల్లో సమ్మోహనం



అనూహ్యమైన కథాంశంతో ఆద్యంతం వినోదాత్మకంగా తెరకెక్కుతోన్న కొత్తతరం ప్రేమ కథా చిత్రం 'సమ్మోహనం' జూన్ 15న విడుదల కానుంది. సుధీర్‌బాబు హీరోగా.. వరుస విజయాల మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో.. శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. బాలీవుడ్ భామ అదితీరావు హైదరీ ఇందులో నాయికగా నటిస్తున్నారు. శ్రీదేవి మూవీస్ ప్రొడక్షన్ నెంబర్ 10గా ఈ చిత్రం తెరకెక్కుతోంది!!

# పొట్టలు చెక్కలు చేసి.. బుగ్గలు సొట్టలు చేసే పెద్దారెడ్డి



సతీష్ రెడ్డి, మౌర్యానీ, ముంతాజ్ హీరో హీరోయిన్లుగా దర్శకుడు వీజేరెడ్డి రూపొందించిన చిత్రం నెల్లూరి పెద్దారెడ్డి. సిద్ధి విఘ్నేశ్వరా క్రియేషన్స్ పతాకంపై సీహెచ్ రఘునాథ రెడ్డి నిర్మిస్తున్నారు.

గ్రామీణ నేపథ్యంలో సాగే ఆహ్లాదకరమైన ప్రేమకథగా ఈ సినిమా తెరకెక్కింది. నేపథ్యం భావోద్వేగాలతో ఉన్నా... కథనం ఆద్యంతం వినోదాత్మకంగా సాగుతుంది. నెల్లూరి పెద్దారెడ్డి చిత్రానికి సెన్సార్ యూఏ సర్టిఫికెట్ ఇచ్చింది. ఈ నెల 16న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

దర్శకుడు వీజే రెడ్డి మాట్లాడుతూ.... 'పల్లె వాతావరణంలో కథంతా సాగుతుంది. పచ్చటి పైరుల అందాలు ప్రేక్షకులకు ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. ఎక్కడా విసుగు అనిపించకుండా కథనం సాగుతుంది. నలుగురికి మంచి చేసే పెద్దారెడ్డి ఓ యువతి కుటుంబానికి ఆశ్రయమిస్తాడు. ఈక్రమంలో అతనికి అనుకోని పరిస్థితులు ఎదురవుతాయి. వాటి పర్యవసానంగా కథ ఎలాంటి మలుపులు తిరిగింది? అనేది ఆసక్తికరంగా చూపిస్తున్నాం. చింతామణి నాటక రిహార్సల్స్ సన్నివేశాలు ప్రత్యేకంగా రూపొందించాం. ఈ ఎపిసోడ్ ప్రేక్షకుల పొట్టలు చెక్కలు చేస్తుంది' అన్నారు!!



# రాశి-వాసి.. రెండూ ముఖ్యమేనట!

రాశి (క్వాంటిటీ) ముఖ్యమా? లేక వాసి (క్వాలిటీ) ముఖ్యమా? అంటే రెండూ ముఖ్యమే అంటోంది రాశీ ఖన్నా. 'ఊహలు గుసగుసలాడే'తో తెలుగులో ఎంట్రీ ఇచ్చిన ఈ సుందరి.. రీసెంట్‌గా వచ్చిన 'తొలిప్రేమ'తో ఫుల్లుగా మార్కులు కొట్టేసింది!

ఎన్టీఆర్-రాజమౌళి-రామ్‌చరణ్ సినిమాలో సెలెక్ట్ అయ్యిందని వార్తలు జోరుగా వినిపిస్తున్నప్పటికీ.. బ్యూటీ క్వీన్ తనకొచ్చిన అవకాశాల్లో మంచివి సెలెక్ట్ చేసుకోవడంలో ఏమాత్రం అలసత్వం ప్రదర్శించడం లేదు!

నితిన్‌తో 'శ్రీనివాస కళ్యాణం' సినిమా చేస్తున్న ఈ చిన్నది తమిళంలో ఏకంగా మూడు సినిమాలు చేస్తూ యమా బిజీగా ఉంది. తమిళంలో రాశి నటిస్తున్న 'సైతాన్ కా బచ్చా, ఇమైక్క నోడిగల్, అడంగమాడు' చిత్రాలు వివిధ దశల్లో ఉండగా.. తెలుగులో ఆమె గ్రీన్ సిగ్నల్ కోసం పలు చిత్రాలు ఆత్రంగా ఎదురు చూస్తున్నాయి!!

# నగిషీలు చెక్కుకుంటున్న నికిషా పటేల్



అదేంటోగానీ మెగా హీరోల సరసన నటించడం ద్వారా ఎంట్రీ ఇచ్చిన హీరోయిన్స్ కెరీర్ ఎప్పుడూ అంత ఆశాజనకంగా ఉండదు. అది 'అందరివాడు'లో అలరించే ప్రయత్నం చేసిన రిమ్మీసేన్ కావొచ్చు. 'చిరుత'లో నటించిన నేహా శర్మ కావచ్చు. 'బన్నీ'లో నటించిన గౌరీ ముంజల్ కావొచ్చు. మరొకరు కావొచ్చు. ఇంకెవరైనా కావొచ్చు. పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్‌కి జంటగా 'కొమరం పులి'లో నటించడం ద్వారా గంపెడు ఆశలతో తెలుగు తెరంగేట్రం చేసిన బ్రిటీష్ ఇండియన్ మోడల్ టర్న్డ్ యాక్ట్రెస్ నికిషా పటేల్ పరిస్థితి కూడా అంతే!

'కొమరం పులి' తర్వాత ఈ అమ్మడికి ఆశించిన స్థాయిలో తెలుగులో అవకాశాలు లభించలేదు. అందుకే తమిళ్, కన్నడ సినిమాలు చేసుకుంటూ కాలక్షేపం చేస్తున్న ఈ కుర్రది తెలుగులో 'ఓమ్ 3డి, అరకురోడ్‌లో' వంటి రెండు మూడు చిత్రాలు చేసినా అవి కూడా ప్రేక్షకుల ఆదరణకు అంతగా నోచుకోలేదు!

అలా అని అంతటితో ఆగిపోకూడదు కదా? అందుకే ఈ ఆడపులి అడపాదడపా తన సొగసుల పంజా విసురుతూ తన ఉనికిని కాపాడుకుంటోంది. మరి నికిషా పటేల్ పడుతున్న పాట్లు మన దర్శకనిర్మాతల దృష్టిని ఏమేరకు ఆకర్షిస్తాయో వేచి చూడాల్సిందే!!

# రంగమ్మతో రంగమెక్కి.. మంగమ్మతో మొత్తుకుంటోంది!



నా మనసు దోచి, నన్ను మనువాడే నా మగాడు నన్ను అస్సలు పట్టించుకోవడం లేదు చూడంటూ' తనకెదురొచ్చిన రంగమ్మకు, మంగమ్మకు ఫిర్యాదు చేసుకుంటున్న వైనాన్ని చూడడం కోసమైనా 'రంగస్థలం' చిత్రాన్ని చూడాలి. లెక్కలేనన్ని తన చిలిపి ఫిర్యాదులతో సమంతమ్మ ఎన్ని ఒయ్యారాలు పోయిందో చూసే తీరాలి!

సుకుమార్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న 'రంగస్థలం' చిత్రం షూటింగ్‌కి ఎట్టకేలకు గుమ్మడికాయ కొట్టేశారు. మరో రెండు వారాల్లో, మార్చి 30న ఈ చిత్రం ప్రేక్షకులకు కనువిందు చేయనుంది. దీంతో ఈ చిత్రం ప్రచారాన్ని మరింత ముమ్మరం చేశారు దర్శకనిర్మాతలు!

ఇప్పటికే విడుదలైన రెండు పాటలు (ఎంత సక్కగున్నావే, రంగస్థలమా) విశేష ప్రజాదరణ పొందుతుండగా.. తాజాగా మూడో పాట విడుదల చేసింది చిత్రబృందం. 'మంగమ్మ.. రంగమ్మా' అంటూ సాగే ఈ పాట కూడా ఇన్‌స్టంట్ హిట్ అయిపోయింది!

మార్చి 30న విడుదలవుతున్న ఈ చిత్రం రామ్‌చరణ్ కెరీర్‌లో ఓ మైలురాయిలా నిలిచిపోతుందనే అంచనాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. అందుకు తగ్గట్లుగా ఈ చిత్రం ప్రి-రిలీజ్ ఆడియో ఫంక్షన్‌ను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు దర్శకనిర్మాతలు రంగం సిద్ధం చేస్తున్నారు!!

# గొడుగు పట్టి.. అడుగులకు మడుగులొత్తి



ఆమె అతని జీవితంలోకి (భార్యగా) పూర్తిగా ప్రవేశించిందో.. లేక (ప్రియురాలిగా) సగమే ప్రవేశించిందో మనకు సరిగ్గా తెలియదు కానీ.. మంచి లక్షణాలున్న ఈ అబ్బాయి మాత్రం తన భార్య లేదా ప్రియురాలి అడుగులకు మడుగులొత్తుతూ గొడుగు పడుతున్నాడు!

ఎండ బారిన పడి ఆమె అందం ఎక్కడ దెబ్బ తింటుందోనని మితిమీరిన ప్రేమతో అల్లాడిపోతున్నాడు. ఆవిడగారు మొక్కలకు నీరు పోస్తుంటే.. ఇతగాడు ఆవిడకు గొడుగు పట్టి.. తన జన్మ ధన్యమైపోయినట్లుగా మురిసిపోతున్నాడు!

'లక్ష్మీ కళ్యాణం' చిత్రంలో కళ్యాణ్‌రామ్‌తో నటించడం ద్వారా తెలుగు తెరంగేట్రం చేసిన కాజల్ అగర్వాల్.. పుష్కరకాలం అనంతరం మళ్లీ ఆతనితో జత కడుతున్న చిత్రంగానూ అందరి దృష్టినీ ఆకట్టుకుంటున్న 'ఎం.ఎల్.ఎ' షూటింగ్ దాదాపుగా పూర్తి కావచ్చింది!

త్వరలో టైటిల్ లోగో ఆవిష్కరణ జరుపుకోనున్న ఈ చిత్రం ఈ వేసవిలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది!!

# కళ్యాణం.. కమనీయం..



ప్రముఖ నిర్మాత సి.కళ్యాణ్ కుమారుడు తేజ వివాహం హైద్రాబాద్‌లోని ఇమేజ్ గార్డెన్స్‌లో అత్యంత వైభవంగా జరిగింది. మెగాస్టార్ చిరంజీవి తన సతీమణి సురేఖ సమేతంగా హాజరైన ఈ వివాహ వేడుకలో హీరోలు నందమూరి బాలకృష్ణ, గోపిచంద్, దర్శకుడు వి.వి.వినాయక్, ప్రముఖ రాజకీయ నాయకురాలు, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, కోనేరు కల్పన తదితర రాజకీయ, సినీ ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. తమ ఆహ్వానాన్ని మన్నించి.. వివాహ వేడుకకు విచ్చేసి, తమ ఆతిధ్యం స్వీకరించి, తమను ఆనందింపజేసిన ప్రతి ఒక్కరికీ సి.కళ్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు!!





# సమోసా ఇచ్చి మతం మారాలన్నారు

ఆగ్రా : బస్తీలో నివసించే కొందరికి సమోసాలు ఇచ్చి, క్రైస్తవ మతంలోకి మార్పించే యత్నం చేయడం స్థానికంగా చర్చనీయమైంది. ఆగ్రాలోని జగదీశ్‌పూర్‌లో మూడు రోజుల క్రితం జరిగిన దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. 'జగదీశ్‌పూర్‌లోని సెక్టార్-4 వికాస్ కాలనీలో మురికివాడల్లో కొందరు నివాసం ఉంటున్నాం. గురువారం క్రైస్తవ మత ప్రచారకులు కొందరు మా వద్దకు వచ్చారు. వారిలో ఓ పాస్టర్, నలుగురు సిస్టర్స్ ఉన్నారు. మొదట మమ్మల్ని కలిసిన వెంటనే వారు మాకు, మా పిల్లలకు సమోసాలు పంచిపెట్టారు. సమోసాలు తింటుంటే క్రైస్తవ మతంలోకి మారాలని సూచించారు. తాము ఆశ్చర్యపోయి చూస్తుంటే మీరే ఆందోళన చెందవద్దు. మీకు ఎన్నో వసతులు కల్పిస్తాం. మీ పిల్లలకు చదువు చెప్పిస్తామని ఆ పాస్టర్, సిస్టర్స్ చెప్పారు. అదే సమయంలో ఓ వ్యక్తి ఏమి జరుగుతోందని ప్రశ్నించాడు. పోలీసులకు సమాచారం అందించాడు. ఆ వెంటనే పాస్టర్ తన దుస్తులు మార్చుకుని అక్కడ నుంచి వెళ్లిపోయారు' మాయా అనే స్థానికురాలు తెలిపారు. ఆగ్రా ఎస్పీ సన్వార్ అనుపమ్ సింగ్ మాట్లాడుతూ, 'ఓ సంస్థ నుంచి ఫిర్యాదు అందగా విచారణ చేపట్టాం. చిన్నారుల విద్య గురించి బస్తీ వారికి అవగాహన కల్పించడానికి మహిళా దినోత్సవం రోజు వెళ్లినట్లు క్రైస్తవ మిషనరీ పేర్కొంది. అవగాహన కల్పించి అక్కడి నుంచి వెళ్లిపోయామని వారు చెప్పారు. కాగా, మురికివాడ నుంచి మాత్రం తమకు ఎలాంటి ఫిర్యాదూ అందలేదు' అని వివరించారు. అయితే, ఓ వర్గం మాత్రం మత మార్పిడి యత్నం జరిగిందని ఆరోపించింది.

# 'మాండరిన్' భాషపై పట్టుకు భారత జవాన్ల కసరత్తు



- చైనా వెన్నులో వణుకు
- భారత సైన్యం 'మాండరిన్' నేర్చుకుంటే తమ ప్రయోజనాలకు దెబ్బ అని చైనా భావన
- ఇరు దేశాల సరిహద్దు ప్రాంతాలపై పట్టు సాధిస్తారేమోనన్న భయం
- తమ సైన్యానికి హిందీ భాష అవసరమని చైనా అధికారుల సిఫారసు
- పాక్‌పై భారత్ నిప్పులు
- మాకు పాఠాలు చెప్పే స్థితిలో పాక్ లేదు
- పాకిస్తాన్ ముమ్మాటికీ ఉగ్ర దేశమే
- ముంబయి కాల్పులను, యూరీ దాడులనూ మరచిపోలేము
- సమితి వేదికగా నిప్పులు చెరిగిన భారత్

న్యూఢిల్లీ : భారత జవాన్లు తమ 'మాండరిన్' భాషను నేర్చుకోవడం చైనా వెన్నులో వణుకు పుట్టిస్తున్నట్లుంది. తమ భాషపై భారత సైన్యం పట్టు సాధిస్తే అది తమకు నష్టమేనన్న భావనను ఆ దేశ భద్రతా అధికారులు వ్యక్తం చేసున్నారు. భాషా నైపుణ్యం వల్ల ఇరు దేశాల మధ్య భవిష్యత్తులో ఏవైనా ఘర్షణలు లేదా స్వల్ప యుద్ధాలు సంభవిస్తే భారత జవాన్లు పైచేయి సాధిస్తారని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 25 మంది సభ్యులతో కూడిన భారత జవాన్లు, ఐటీబీపీ అధికారుల బృందం మధ్య ప్రదేశ్‌లోని రైసెన్ జిల్లాలో ఉన్న సాంచీ యూనివర్శిటీ ఆఫ్ బుద్దిస్ట్ -ఇండో స్టడీస్‌లో చైనా భాషకు సంబంధించిన ఏడాది కోర్సును అధ్యయనం చేయనున్నట్లు గత నెలలో పీటీఐ వార్తా సంస్థ ఓ కథనాన్ని ప్రచురించిన సంగతి తెలిసిందే. భారత జవాన్లు మాండరిన్ భాషను నేర్చుకోవడం వల్ల ఇరు దేశాల సరిహద్దు ప్రాంతాల్లో అపార్థాలను తగ్గించవచ్చని అధికారులు అభిప్రాయపడుతున్నారు. కానీ, చైనాకు చెందిన పలువురు భద్రత అధికారులు మాత్రం ఈ విషయంలో ఆందోళన చెందుతున్నారు. శాంతి కోరుకునే సమయంలో భారత జవాన్ల చైనా భాషా సామర్థ్యం ఇరు వర్గాల మధ్య చక్కటి సంభాషణలకు అవకాశం కల్పిస్తుందని, అదే యుద్ధ సమయంలో అదే భాష ఆయుధంలా మారి పరిస్థితులను మరింత జటిలం చేయవచ్చనే అభిప్రాయాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో చైనా సైనిక నిపుణుడు సోంగ్ ఝోంగ్‌పింగ్ మరో అడుగు ముందుకు వేసి, ఘర్షణల సమయంలోనే కాక ప్రశాంత పరిస్థితుల్లోనూ సరిహద్దు ప్రాంతాలపై భారత్ పట్టు సాధించవచ్చని హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో తమ సైనికులు కూడా హిందీ భాషను నేర్చుకోవాలని పలువురు చైనా సైనికాధికారులు గతంలో సూచించడం గమనార్హం.

**పాకిస్తాన్ నుంచి తాము పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం లేదు**

మానవ హక్కులను కాపాడే విషయంలో పాకిస్తాన్ నుంచి తాము పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం లేదని భారత్ నిప్పులు చెరిగింది. కాశ్మీర్ విషయంలో పాకిస్తాన్ ఐక్యరాజ్య సమితి వేదికగా చేస్తున్న ఆరోపణలను భారత్ ఖండిస్తూ, ఆ దేశం ముమ్మాటికీ ఉగ్రవాద దేశమేనని ఉటంకించింది. ఓ ఉగ్ర దేశం గురించి మాట్లాడాల్సిన అవసరం లేదంటూనే విమర్శలు గుప్పించింది. ఉగ్రవాదాన్ని పెంచి పోషించే పాక్ తమకు పాఠాలు చెప్పే స్థాయిలో లేదని ఎద్దేవా చేసింది. మానవ హక్కుల గురించి పాకిస్తాన్ చెబితే నేర్చుకోవాల్సిన స్థితిలో ఇండియా లేదని సమితిలో భారత కార్యదర్శి మాట్లాడారు. ముంబయి కాల్పులను, యూరీ దాడులను తాము మరచిపోలేదని చెప్పిన మినీదేవీ కుమమ్, పాకిస్తాన్‌లో ఉగ్రవాదులు ఎక్కడ లేనీ స్వేచ్ఛనూ అనుభవిస్తున్నారని, ఓ విఫలమైన దేశం నుంచి ప్రపంచానికి ఎటువంటి సలహాలు, సూచనలూ అక్కరలేదని అన్నారు. గతంలో ఒసామా బిన్ లాడెన్‌కు పాకిస్తాన్ ఆశ్రయం ఇచ్చి అంతర్జాతీయ సమాజం ముందు దొరికిపోయిందని, ముంబయి దాడుల ప్రధాన నిందితుడు హాఫీజ్ సయీద్ ఇప్పటికీ పాక్‌లో స్వేచ్ఛగా తిరుగుతున్నాడని ఆమె ఆరోపించారు. ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన పాక్ సర్కార్ వారిని పెంచి పోషిస్తోందని చెబుతూ, అమెరికా సైతం హాఫీజ్‌ను అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించిందన్న సంగతిని గుర్తు చేశారు.




## అనుమానాస్పద స్థితిలో టీవీ నటి మృతి



కోలకతా : కోలకతాలో ఓ టీవీ నటి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. మౌమిత సాహా (23) అనే నటి నగరంలోని రేజెంట్ పార్క్ సమీపంలోని తన ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించింది. అయి తే, ఆమె ఆత్మహత్య చేసుకుందా? లేక ఎవరైనా హత్య చేశారా? అన్న కోణంలోనూ పోలీసులు దర్యా ప్తు చేస్తున్నారు. ఆమె శుక్రవారం మధ్యాహ్నం నుంచి తలుపు తెరవకపోవడం తో అనుమానం వచ్చిన ఇంటి యజమాని పోలీసులకు ఫోన్ చేశారు. దీనితో పోలీసులు వచ్చి తలుపులు తెరచి చూడగా గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఆమె మృత దేహం వేలాడుతూ కనిపించింది. ఘటనపై దర్యాప్తు ప్రారంభించామని పోలీసు లు తెలిపారు. ఇంటిలో ఆత్మహత్యకు సంబంధించి ఆమె రాసిన ఒక లేఖ కనిపించినట్లు చెప్పారు. ఆమె తీవ్రమైన ఒత్తిడితోనే ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. సోషల్ మీడియాలో ఆమె ఖాతాను పరిశీలించగా చివరిగా ఆమె పెట్టిన పోస్ట్ మానసిక ఒత్తిడితోనే రాసినట్లు కనిపించిందని చెప్పారు. ఆమె ఫోన్ కాల్స్‌ను కూడా పరిశీలించనున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## కన్యత్వ పరీక్షలు.. వాట్సాప్ గ్రూప్‌పై మండిపాటు



న్యూఢిల్లీ : దేశంలో దురాచారాలకు కొదవే లేదు. పెళ్లైన నవ వధువుకు కన్యత్వ పరీక్షలు చేస్తున్న అనాగరిక ఆచారం ఓ వైపు.. తమ తెగలోని మహిళలకు ఎదురయ్యే పరిస్థితులను సోషల్ మీడియా వేదికగా బయటపెడుతున్న ప్రబుద్ధులు మరో వైపు. వెరసి కంజర్‌భట్ దురాచార బాధితుల సమాచారం వాట్సాప్‌లో వైరల్ కావడం చర్చనీయంగా మారింది. విషయం ఏమిటంటే, కంజర్‌భట్ తెగలో తొలి రాత్రి మహిళలకు కన్యత్వ పరీక్షలు నిర్వహిస్తారు. ఈ ఆచారానికి వ్యతిరేకంగా 'స్టాప్ ద వీ-రిచువల్' పేరిట ఓ వాట్సాప్ గ్రూప్ బాధితుల ఫోటోలను, సమాచారాన్ని వైరల్ చేస్తోంది. అయితే, ఆ వాట్సాప్ గ్రూప్ కుట్ర పూరితంగా వ్యవహరిస్తోందని.. తమ జాతిని అవహేళన చేస్తోందని సదరు తెగ నాయకులు ధ్వజమెత్తుతున్నారు. కన్యత్వ పరీక్షల ఆచారం వల్ల ఏ మహిళ కూడా బాధితురాలిగా మిగలలేదని తెలియజేస్తూ, తమ జాతిపై తప్పుడు ప్రచారం చేసిన వాట్సాప్ గ్రూప్ అడ్మిన్ క్షమాపణలు చెప్పాలని కమ్యూనిటీ సభ్యురాలు భావనా మనేకర్ డిమాండ్ చేశారు. అత్తింటివారి, పుట్టింటి వారి మద్దతుతోనే ఈ పరీక్షలు జరుగుతాయనీ, వీటిలో ఎవరి జోక్యమూ అవసరం లేదనీ అదే తెగలోని మరో వర్గం మండిపడుతోంది. వాస్తవాలను మరుగున పరచి ఆర్థికంగా లాభం పొందడానికి కొందరు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని వారంటున్నారు. కాగా ఈ వాట్సాప్ గ్రూప్‌పై చర్యలు తీసుకోవాలని తెగ నాయకులు కొందరు కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథవాలేకు ఫిర్యాదు చేశారు కూడా.

# చీకట్లో మగ్గిపోతున్న అమెరికా




- అంధకారంలో 50 లక్షల మంది!
- అమెరికాలో ఎన్నడూ లేని పరిస్థితులు
- విద్యుత్ లేక, కనీస అవసరాలు తీరక ప్రజలు ఇబ్బందులు
- వచ్చే వారం మరో మంచు తుపాను
- వేలాది విమానాలు రద్దు
- ఉత్తర కరోలినాలో ఘోరం
- బోటింగ్‌కు వెళ్లిన వేళ విషాదం
- నీటిలో పడిపోయిన ఇద్దరు
- ఒకరి మృతి, తప్పించుకున్న మరొకరు

వాషింగ్టన్ : అగ్ర రాజ్యం అమెరికా ప్రజలు కనీ వినీ ఎరుగని అగచాట్లు ఎదుర్కొంటున్నారు. మంచు తుపాను దెబ్బకు అల్లాడిపోతున్నారు. వారం వ్యవధిలో సంభవించిన రెండు తుపాన్లకు అమెరికాలోని న్యూజెర్సీ, మాసాచుసెట్స్, న్యూహ్యాంప్‌షైర్, పెన్సిల్వేనియా తదితర ప్రాంతాల్లో జన జీవనం అస్తవ్యస్తమైంది. తుపాను ధాటికి విద్యుత్ వ్యవస్థ కుప్పకూలడంతో జనం కారు చీకట్లలో మగ్గిపోతున్నారు. దాదాపు 10 లక్షల మంది కరెంటు లేక విలవిల్లాడిపోతున్నారు. విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరించేందుకు మరికొన్ని రోజులు పట్టే అవకాశం ఉండడంతో అప్పటి వరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని విద్యుత్ అధికారులు ప్రజలకు సూచించారు. మరో వైపు ప్రతికూల వాతావరణం కారణంగా అమెరికా వ్యాప్తంగా 2,700 విమాన సర్వీసులు రద్దు కాగా, 2400 విమానాలు ఆలస్యంగా నడిచాయి. మంచు తుపాను తాకిడికి గ్రామీణ ప్రాంతాల ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. విద్యుత్ లేక, ఆహార పదార్థాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. వరుసగా రెండు తుపాన్లతో అల్లాడుతుంటే వచ్చే వారం మరో తుపాను వచ్చే అవకాశం ఉందన్న వార్తలతో ప్రజలు భయం భయంగా గడుపుతున్నారు.

**అమెరికాలో నీట మునిగి తెలుగు విద్యార్థి దుర్మరణం**

కాసేపు సేద తేరేందుకు బోటింగ్‌కు వెళ్దామని భావించిన ఓ తెలుగు విద్యార్థి అమెరికాలో దుర్మరణం పాలయ్యాడు. యుఎస్‌లోని ఉత్తర కరోలినాలో జరిగిన ఘటన గురించిన మరిన్ని వివరాల్లోకి వెళితే, ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన దేవినేని రాహుల్ (19) తన తల్లిదండ్రులతో కలసి నివాసం ఉంటున్నాడు. బుధవారం సాయంత్రం రాహుల్ తన మిత్రులతో కలసి వ్యాహ్యాళి నిమిత్తం ఓ సరస్సు వద్దకు వెళ్లాడు. సరదాగా బోటింగ్ చేస్తున్న సమయంలో ప్రమాదశావత్తు పడవ మునిగిపోయింది.



రాహుల్‌తో పాటు అతని ఫ్రెండ్ కూడా నదిలో పడిపోయారు. ఘటనను గమనించిన స్థానికులు ఆ ఇద్దరినీ బయటకు తీసి దగ్గర్లోనే ఉన్న ఆసుపత్రికి తరలించగా, అప్పటికే రాహుల్ మృతి చెందాడు. అతని స్నేహితుడు మాత్రం స్వల్ప గాయాలతో కోలుకుంటున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్న ఘటనకు సంబంధించిన పూర్తి సమాచారం వెలువడాల్సి ఉంది.

## ఫ్రాన్స్ అధ్యక్షుడిని కలవాలని రాహుల్ నిర్ణయం



న్యూఢిల్లీ : ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్న ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మానుయేల్ మాక్రాన్‌ను కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ కలుసుకోనున్నారు. థాయిలాండ్, సింగపూర్, మలేషియా దేశాల పర్యటనకు వెళ్లిన ఆయన తిరిగి ఇండియాకు వస్తారని, ఆపై వారి భేటీ ఉంటుందని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. అయితే, ఈ సమావేశంలో రాహుల్ రఫాలే యుద్ధ విమానాల కొనుగోలు డీల్ గురించిన ప్రస్తావన తేబోరని కాంగ్రెస్ పార్టీ సమాచార విభాగం ఇన్‌చార్జ్ రణదీప్ సుర్జేవాలా వెల్లడించారు. నరేంద్ర మోడీ ప్రధానిగా ఉన్న సమయంలో 2015 ఏప్రిల్‌లో ఫ్రాన్స్‌లో పర్యటించి రఫాలే డీల్‌ను కుదుర్చుకుని రాగా, ఆపై అది వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. ఈ డీల్ గురించి రాహుల్, మాక్రాన్ మధ్య ఎటువంటి చర్చలూ ఉండవని, రఫాలే డీల్ భారత అంతర్గత అంశమని, తమ ప్రశ్నలకు భారత ప్రభుత్వం నుంచి సమాధానం రావాలే తప్ప ఫ్రాన్స్ ప్రభుత్వం నుంచి కాదని ఆయన స్పష్టం చేశారు. భారత ప్రజల డబ్బులు వృథా కారాదన్నదే కాంగ్రెస్ ఉద్దేశమని వెల్లడించారు. ఈ విమానం ధర చాలా అధికంగా ఉందని, దీని వల్ల ప్రభుత్వానికి రూ. 12,612 కోట్లు నష్టమని కాంగ్రెస్ ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. ఖతార్, ఈజిప్ట్ సంస్థలకు ఇవే రఫాలే విమానాలను దస్సాల్ట్ ఏవియేషన్ అందించిందని గుర్తు చేసిన ఆయన ఆ దేశాలు ఇచ్చిన మొత్తంతో పోలిస్తే అధికంగా ఇండియా ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించారు. ఒక్కో విమానాన్ని రూ. 351 కోట్లు చెల్లించి ఎందుకు కొనుగోలు చేయాలని సుర్జేవాలా ప్రశ్నించారు.

## వేదికపై అద్వానీని పట్టించుకోని మోడీ



అగర్తలా : త్రిపురలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన భారతీయ జనతా పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అగర్తలాలోని అసోం రైఫిల్స్ మైదానంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా విప్లవ్ కుమార్ దేవ్ ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి వచ్చిన బీజేపీ సీనియర్ నేత ఎల్కే అద్వానీని ప్రధాని నరేంద్ర మోడీపట్టించుకోకుండా అవమానించారని కొందరు విమర్శలు గుప్పిస్తున్నారు. మోడీ వేదికపైకి వస్తున్న సమయంలో తమ పార్టీ నేతలందరికీ నమస్కరించిన నరేంద్ర మోడీ అద్వానీని మాత్రం పట్టించుకోలేదు. రెండు చేతులతో అద్వానీ నమస్కారం చేస్తున్నప్పటికీ మోడీ ప్రతి నమస్కారం చేయకుండా వెళ్లిపోయారని నెటిజన్లు విమర్శిస్తున్నారు. వేదికపై ఉన్న మిగతా నాయకులందరితో ఆప్యాయంగా మాట్లాడి అద్వానీకి కనీసం నమస్కారం కూడా పెట్టలేదని అంటున్నారు.

# శ్రీలంకలో అల్లర్లకు కారణాలేమిటి?

కొలంబో : శ్రీలంకలో ముస్లింలకు వ్యతిరేకంగా జరుగుతున్న అల్లర్లలో పదుల సంఖ్యలో వ్యాపార సంస్థలు, ముఖ్యంగా ముస్లింల హోటళ్లు, 24 మసీదులు ధ్వంసమయ్యాయి. 41 ఏళ్ల ఓ బుద్ధిస్ట్ సింహళీయుడు అనే డ్రైవర్‌ను కొంత మంది ముస్లిం అతివాదులు హత్య చేయడంతో ఈ అల్లర్లు మొదలయ్యాయి. హత్యకు గురైన సింహళీయుడి భౌతికకాయాన్ని అప్పగించేందుకు శ్రీలంక పోలీసులు నిరాకరించడంతో ఆగ్రహోదగ్రులైన సింహళీయులు, ముస్లింలకు వ్యతిరేకంగా దాడులకు దిగారు. ఇలాంటి అల్లర్లకు ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక కారణాలు ఉంటాయని తెలిసిందే. వాటికి తోడు శ్రీలంకలో ముస్లింల వ్యతిరేకత పెరగడానికి కొన్ని అపోహలు తోడ్పడ్డాయి. సింహళీయుల్లో సంతానం పెరగకుండా నియంత్రించేందుకు వారు నిర్వహిస్తున్న హోటళ్లలో సంతానోత్పత్తిని తగ్గించే మాత్రలను కలుపుతున్నారన్నది అలాంటి అపోహ. నలుగురు మహిళలను పెళ్లి చేసుకునే అవకాశం ఉన్న ముస్లింలు కుటుంబ నియంత్రణను సక్రమంగా పాటించకుండా ఎక్కువ సంతానాన్ని కంటున్నారు. ఇటు సింహళీయుల్లో సంతానాన్ని నియంత్రించడం, అటు వైపు ముస్లింల జనాభాను పెంచుకొని శ్రీలంకను ఇస్లాం రాజ్యం చేయడం ముస్లింల లక్ష్యమని స్థానిక సింహళీయులు భావిస్తున్నారు. ఇక ముస్లింలు కూడా మొహమ్మద్ ఐబిన్ అబ్దుల్ వాహెద్ అతివాద దృక్పథాన్ని ఎక్కువ ఆచరిస్తున్నారు. ముస్లిం గురువుల సమాధులను కూల్చివేయడం, బారుడు గడ్డాలు పెంచడం, ఇస్లాం సిద్ధాంతాలను కఠినంగా పాటించడం అబ్దుల్ వాహెద్ అతివాదం. ఈ వాదం నుంచే అల్‌ఖైదా, బోకో హరామ్ వంటి టెర్రరిస్టు సంస్థలు పుట్టుకువచ్చాయి.




సౌదీ అరేబియా నిధులతో ఏర్పాటైన కొన్ని సంస్థలు ఇక్కడ ఈ అతివాదాన్ని ప్రోత్సహిస్తున్నాయి. సింహళీయుల ఆపత్యానికి వ్యతిరేకంగా తమిళులు విముక్తి పోరాటం జరిపిన 1980, 1990 దశకాలలో సింహళీయులు, ముస్లింలు బాగా కలసిపోయారు. అప్పుడే సామాజికంగా, ఆర్థికంగా ముస్లింలు అభివృద్ధి చెందారు. అప్పుడే వారు హోటల్, ఇతర వ్యాపారాల్లో రాణించారు. శ్రీలంకలో చిన్నప్పటి నుంచే పిల్లల మధ్య మత బీజాలు బలంగా నాటుకోవడానికి కారణం ముస్లింలకు, సింహళీయులకు, తమిళులకు ప్రత్యేక భాషా పాఠశాలలు ఉండడమే. ఉమ్మడి పాఠశాలు, ఉమ్మడి భాష ఉన్నప్పుడే వారి మధ్య సామాజిక బంధాలు ఏర్పడే అవకాశం ఉంటుంది.

## అర్థాంతరంగా గద్దె దిగనున్న మారిషస్ అధ్యక్షురాలు



పోర్ట్ లూయిస్ : మారిషస్ తొలి మహిళా అధ్యక్షురాలు అమీనా గురీబ్-ఫకీమ్ వచ్చే వారం గద్దె దిగనున్నారు. ఈ విషయాన్ని ఆ దేశ ప్రధాని ప్రవీంద్ జుగ్నౌత్ శుక్రవారం వెల్లడించారు. ఈ నెల 12న మారిషస్ 50వ స్వాతంత్ర్య వేడుకలు ముగిసిన తరువాత ఆమె తన పదవి నుంచి తప్పుకుంటారని ఆయన తెలిపారు. ప్లానెట్ ఎర్త్ ఇన్‌స్టిట్యూట్ అనే అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ జారీ చేసిన క్రెడిట్ కార్డుతో దుస్తులు, బంగారు ఆభరణాలు కొనుగోలు చేశారని అధ్యక్షురాలిపై ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో ఆమె తన పదవి నుంచి తప్పుకునేందుకు నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇది ఇలా ఉంటే, అధ్యక్షురాలి క్రెడిట్ కార్డు ఖర్చుల వివరాలను తెలపడానికి ప్రధాని నిరాకరించినప్పటికీ, ప్రతి ఒక్కరూ తమ తప్పులకు బాధ్యత వహించాలని అంతకుముందు మీడియాకు స్పష్టం చేశారు. కాగా, కెమిస్ట్రీ ప్రొఫెసర్ అయిన ఫకీమ్ 2015లో అత్యున్నతమైన మారిషస్ అధ్యక్ష పదవిని అలంకరించారు. మరో వైపు తనపై వస్తున్న ఆరోపణలను ఆమె నిర్ద్వంద్వంగా తోసిపుచ్చారు. తాను ఏ తప్పూ చేయలేదని స్పష్టం చేశారు. షాపింగ్ కోసం తాను ఖర్చు చేసిన మొత్తాన్ని తిరిగి చెల్లించేశానని ఆమె తెలిపారు. కాగా, అధ్యక్షురాలు ఫకీమ్ స్వచ్ఛంద సంస్థ జారీ చేసిన క్రెడిట్ కార్డును ఉపయోగించి ఇటలీ, దుబాయి దేశాల్లో షాపింగ్ చేశారని స్థానిక వార్తాపత్రిక 'ఎల్ ఎక్స్‌ప్రెస్' ఓ కథనాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే.

## ఆరెస్సెస్ ప్రధాన కార్యదర్శిగా మళ్లీ భయ్యాజీ



నాగ్‌పూర్ : రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్ఎస్) ప్రధాన కార్యదర్శిగా సురేష్ 'భయ్యాజి' జోషి మరోసారి ఎన్నికయ్యారు. మరి మూడేళ్ల వరకు అంటే 2021 వరకు జోషి జనరల్ సెక్రటరీగా కొనసాగుతారని నాగ్‌పూర్‌లో జరిగిన అఖిల భారతీయ ప్రతినిధి సభలో నిర్ణయించారు. ఈ విషయాన్ని ఆరెస్సెస్ తన ట్విటర్ ఖాతాలో వెల్లడించింది. జోషి ఈ బాధ్యతలు చేపట్టడం వరుసగా ఇది నాలుగో సారి. భయ్యాజీ 2009లో తొలి సారిగా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆ తరువాత రెండు సార్లు కూడా జోషీనే ఎన్నుకున్నారు. ప్రస్తుతం ఆరెస్సెస్ చీఫ్‌గా ఉన్న మోహన్ భగవత్ కూడా గతంలో ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. ఆ సమయంలో కేఎస్ సుదర్శన్ చీఫ్‌గా ఉన్నారు. ఈ సారి జోషి స్థానంలో జాయింట్ జనరల్ సెక్రటరీగా ఉన్న దత్తాత్రేయ హోసబాలేను తీసుకుంటారని ఊహాగానాలు వెలువడ్డాయి. అయితే, చివరికి జోషీనే మరోసారి ఎన్నుకున్నారు.

# జీతాలు పెంచవద్దంటున్న వైద్యులు

ఒట్టావా : సాధారణంగా ఉద్యోగులు తమకు జీతాలను పెంచాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగుతారు. కదా! కానీ కెనడియన్ వైద్యులు మాత్రం ఇందుకు విరుద్ధంగా స్పందించారు. తమ జీతాల పెంపును నిరసిస్తూ ఆందోళనకు దిగారు. తమకు ఎక్కువ జీతాలు వద్దు అని వందలాది మంది వైద్య సిబ్బంది ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దాదాపు 500 మంది డాక్టర్లు సహా, ఇతర సిబ్బంది ఈ మేరకు ఒక బహిరంగ లేఖ రాశారు. ప్రజా ఆరోగ్యాన్ని ప్రోత్సహించడానికి, రోగుల అవసరాలను తీర్చడానికి వినియోగించాలని లేఖలో డిమాండ్ చేశారు. దీనితో పాటు నర్సులపై పడుతున్న పని భారాన్ని, ప్రజలకు అవసరమైన వైద్య సౌకర్యాల ప్రాధాన్యతను పేర్కొంటూ ఈ లేఖ రాయడం విశేషం. మెడికల్ ఫెడరేషన్ చేపట్టిన ఇటీవలి జీతాల పెంపును క్విబెక్ వైద్యులు వ్యతిరేకించారు. 213 మంది జనరల్ ప్రాక్టీషనర్స్, 184 మంది స్పెషలిస్టులు, 149 మంది రెసిడెంట్ మెడికల్ డాక్టర్లు, 162 మంది మెడికల్ విద్యార్థులు తమ పెరిగిన జీతాలను తిరిగి ప్రభుత్వానికి ఇచ్చేయాలని నిర్ణయించుకున్నారు. నర్సులు, రోగులు బాధలు పడుతున్నప్పుడు తమకు జీతాల పెంపు ఎందుకని ప్రశ్నించారు. నర్సులు, క్లర్కులు సహా ఇతర ఉద్యోగులు అనేక కష్టాలను అనుభవిస్తున్న తరుణంలో తమకు జీతాల పెంపు వద్దని కరాఖండిగా తేల్చి చెప్పారు. వివిధ దేశాలలోని అనేక మంది నర్సులు చాలా తక్కువ వేతనం కోసం ఎక్కువ గంటలు పని చేస్తారు. అయితే, కెనడాలో ఒక సోషలిస్టు ప్రజా ఆరోగ్య వ్యవస్థలో కూడా నర్సులు తక్కువ వనరులతో



ఎక్కువ పని గంటలు పని చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పని భారంతో నర్సులు బాగా అలసిపోతున్నారని, దీర్ఘ కాలంగా సిబ్బంది కొరత కారణంగా ఓవర్‌టైమ్ (కొన్నిసార్లు కచ్చితంగా) పని చేయాల్సి వస్తోందని తమ లేఖలో పేర్కొన్నారు. అంతే కాదు. ఇటీవల ఆరోగ్య శాఖ తీసుకున్న చర్యల కారణంగా సరైన వైద్య సదుపాయాలు అందుబాటులో లేక రోగులు సతమతమవుతున్నారని వారు తమ లేఖలో పేర్కొన్నారు. తమకు ప్రజా వ్యవస్థ మీద అపారమైన నమ్మకం ఉందనీ, పెరిగిన తమ జీతాలను రద్దు చేసి, వాటిని ప్రజలకు మెరుగైన వైద్య సేవలకు వినియోగించాలని ప్రభుత్వాన్ని కోరారు. అంతిమంగా ఇది రోగి సంరక్షణ భాధ్యత మీద ప్రభావం చూపుతుందని వైద్యులు వాదించారు.

## అభియోగాలు రుజువైతే ముషారఫ్‌కు ఉరిశిక్ష



ఇస్లామాబాద్ : పాకిస్తాన్ మాజీ అధ్యక్షుడు పర్వేజ్ ముషారఫ్ (74) పీకల్లోతు కష్టాల్లో చిక్కుకున్నారు. రాజద్రోహం కేసును ఎదుర్కొంటున్న ఆయనపై నమోదైన అభియోగాలు రుజువైతే ఉరిశిక్ష లేదంటే జీవిత ఖైదు విధించే అవకాశాలు ఉన్నాయి. పాక్ అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టిన తరువాత దేశంలో అత్యవసర పరిస్థితి విధించిన ముషారఫ్ సుప్రీం కోర్టు న్యాయమూర్తులను గృహ నిర్బంధంలో పెట్టారు. వంద మంది న్యాయమూర్తులను తొలగించారు. ఈ కేసులో ముషారఫ్‌పై 2014లో ప్రత్యేక ట్రిబ్యునల్ అభియోగాలు నమోదు చేసింది. తాజాగా ముషారఫ్‌ను అరెస్ట్ చేయడంతో పాటు, ఆయన ఆస్తులను జప్తు చేయాలని ప్రత్యే కోర్టు ఆదేశించింది. తాజాగా ఈ కేసులో హోమ్ శాఖ అధికారులు ముషారఫ్ ఆస్తుల వివరాలు కోర్టుకు సమర్పించారు. 1999 నుంచి 2008 వరకు పాక్‌ను పాలించిన ముషారఫ్ మాజీ ప్రధాని బెనజీర్ భుట్టో హత్య కేసుతో పాటు వివిధ కేసుల్లో నిందితుడిగా ఉన్నారు. 2016లో చికిత్స పేరుతో దుబాయి పారిపోయిన ముషారఫ్‌ను కోర్టు పరారీలో ఉన్న నిందితుడిగా పేర్కొంది. ముషారఫ్ కేసును విచారించేందుకు వివిధ హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులతో ఏర్పాటైన ప్రత్యేక కోర్టుకు పెషావర్ హైకోర్టు సీజే యెహ్యా అఫ్రిది నేతృత్వం వహిస్తున్నారు.

# సునీల్ దేవ్‌ధర్ ట్వీట్ : త్రిపురలో కలకలం

అగర్తలా : త్రిపుర అభివృద్ధి బాటలో మాణిక్ సర్కార్‌ను కూడా కలుపుకొని వెళతామంటూనే ఆయనను ఇరుకునపెట్టే ప్రయత్నాలను ముమ్మరం చేసింది బీజేపీ! కాషాయ దళం విజయానికి కారకుడైన సునీల్ దేవ్‌ధర్ శనివారం పేల్చిన ఓ ట్వీట్ రాజకీయంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. 'త్రిపుర ముఖ్యమంత్రి విప్లవ్ దేవ్‌కు నాదొక విన్నపం. అధికారిక నివాసాల్లోకి చేరబోయే ముందు అక్కడి సెప్టిక్ ట్యాంకులను ఓ సారి శుభ్రం చేయించండి. గతంలో మాణిక్ సర్కార్ నివాసంలో మహిళ అస్థిపంజరం లభించిన అనుభవం దృష్ట్యా మీరు ఈ పని తప్పక చేయాలి' అని దేవ్‌ధర్ కామెంట్ చేశారు.

సీఎం నివాసంలో అస్థిపంజరమా? : అగర్తలాలోని ముఖ్యమంత్రి అధికారిక నివాసంలో మాణిక్ సర్కార్ 1998 నుంచి మొన్నటి వరకు ఉన్నారు. కాగా, 2005 జనవరి 4న ఆ అధికారిక నివాసంలోని సెప్టిక్ ట్యాంకులో ఓ మహిళ అస్థిపంజరం బయటపడడం అప్పట్లో పెను సంచలనం సృష్టించింది. సెప్టిక్ ట్యాంకును శుభ్రం చేయడానికి వచ్చిన మునిసిపల్ సిబ్బంది దానిని గుర్తించారు. ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న మాణిక్ సర్కార్ కేసును సీఐడీకి అప్పగించింది. ఆ తరువాత అది సీబీఐకి బదలీ అయింది. 13 ఏళ్లు గడుస్తున్నప్పటికీ ఆ కేసు ఇంకా కొలిక్కిరాకపోవడంతో పలు విమర్శలకు తావిచ్చినట్లైంది. ఇది మాణిక్ నియంత పాలనకు నిదర్శనమని సీపీఎం ప్రత్యర్థులు ఆరోపిస్తారు. ఇప్పుడు ఉన్న పళంగా సునీల్ దేవ్‌ధర్ అస్థి పంజరం ఉదంతాన్ని కోట్ చేస్తూ ట్వీట్ చేయడం వ్యూహంలో భాగమా, లేక యాదృచ్ఛికమా అనేది తెలియాల్సి ఉంది.

ఇంతకీ ఆ స్కెలిటన్ ఎవరిది? : సీఎం నివాసంలోని సెప్టిక్ ట్యాంక్‌లో తేలిన అస్థిపంజరం ఎవరిదనేదానిపై త్రిపురలో భిన్న కథనాలు ప్రచారంలో ఉన్నాయి. నేపాల్‌కు చెందిన పని అమ్మాయిని సీఎం సిబ్బందిలో ఒకరు లేదా కొందరు అత్యాచారం చేసి, హతమార్చి ఉంటారని నాటి కాంగ్రెస్ నేత సమీర్ రాజన్ బర్మన్ ఆరోపించారు. హత్యాచారం కేసును తొక్కిపెట్టే క్రమంలో మృతురాలి కుటుంబాన్ని బలవంతంగా నేపాల్‌కు పంపించేశారని ఆయన ఆరోపించారు. మాణిక్ సర్కార్‌పై దినేశ్ కాంజీ అనే రచయిత 'మాణిక్ సర్కార్ : ది రియల్ అండ్ వర్చువల్' అనే పుస్తకంలోనూ అస్థిపంజరం వ్యవహారాన్ని ప్రస్తావించారు.



అప్పట్లో జాతీయ స్థాయి మీడియాలో సైతం చర్చనీయమైన ఈ కేసులో బర్మన్ (కాంగ్రెస్ నేత) ఆరోపణలను ఏ ఒక్కరూ పట్టించుకోకపోవడం కొంత ఆశ్చర్యం అనిపిస్తుందని రచయిత రాసుకొచ్చారు. దేవ్‌ధర్ తాజా ట్వీట్‌పై సీపీఎం శ్రేణులు ఏకాస్త స్పందించాల్సి ఉంది.

## కోహ్లి చాలెంజ్.. మీసం మెలేసి స్వీకరించిన ధావన్



న్యూఢిల్లీ : భారత క్రికెట్ కెప్టెన్ విరాట్ కోహ్లి శిఖర్ ధావన్‌కు ఓ చాలెంజ్ విసిరాడు. కోహ్లి ఓ ప్రముఖ బ్యాగ్‌ల కంపెనీకి బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్న సంగతి తెలిసిందే. ఇటీవల కోహ్లి ఓ బ్యాగ్‌ను భుజానికి తగిలించుకుని డ్యాన్స్‌తో దుమ్ములేపాడు. అయితే శిఖర్ ధావన్‌కు తనలాగే బ్యాగ్ తగిలించుకుని డ్యాన్స్ చేయాలని విరాట్ తన ట్విటన్ ద్వారా ఛాలెంజ్ విసిరాడు. నా కంటే నువ్వు బాగా డ్యాన్స్ వేయగలవా? నీ డ్యాన్స్ స్టెప్పులు చూపించు అని కోహ్లి తాను డ్యాన్స్ చేసిన ఓ వీడియోను ట్విట్ చేశారు. దీంతో లంక పర్యటనలో ఉన్న ధావన్ కోహ్లి ఛాలెంజను స్వీకరించాడు. ధావన్ తాను కూడా బ్యాగ్ తగిలించుకుని మీసం మెలేసి, తొడకొట్టి స్టెప్పులేసిన వీడియోను తన ట్వీటర్‌లో పంచుకున్నారు. ప్రస్తుతం ముక్కోణపు టోర్నీ నుంచి కోహ్లికి బీసీసీఐ విశ్రాంతి కల్పించిన సంగతి తెలిసిందే.

# భళా బంగ్లా

- భారీ లక్ష్యాన్ని అలవోకగా ఛేదించి...
- శ్రీలంకకు గట్టి షాక్ ఇచ్చిన కూనలు
- రెచ్చిపోయిన ముష్ఫికర్...
- అజేయంగా అర్ధ శతకంతో శ్రీలంక ఆశలకు గండి
- అన్ని జట్లు తలా ఓ విజయంతో రసవత్తరంగా మారిన ముక్కోణపు టీ20 సీరీస్
- రేపు భారత్-శ్రీలంక రెండో మ్యాచ్



కొలంబో: ముక్కోణపు టీ20 టోర్నీలో బంగ్లాదేశ్ రికార్డు సృష్టించింది. శ్రీలంక నిర్దేశించిన 215 పరుగుల భారీ లక్ష్యాన్ని బంగ్లాదేశ్ 19.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కొలంబోలోని ప్రేమదాస స్టేడియం దీనికి వేదికైంది. లంక బ్యాట్స్‌మెన్ పెరీరా 74 పరుగులు (8 ఫోర్లు, 2 సిక్స్‌లు), కుశాల్ మెండిస్ 57 పరుగులు (2 ఫోర్లు, 5 సిక్స్‌లు) సాధించారు. అనంతరం లక్ష్య ఛేదనలో బంగ్లా ఓపెనర్లు తమీమ్ ఇక్బాల్47 పరుగులు(6స4, 1స6), దాస్ 43 పరుగులు (2 ఫోర్లు, 5 సిక్స్‌లు) చేసి విజయానికి బాటలు వేశారు. తర్వాత వచ్చిన వికెట్ కీపర్ ముష్ఫికర్ రహీమ్ 72 పరుగులతో (5 ఫోర్లు, 4 సిక్స్‌లు) అజేయంగా నిలిచి బంగ్లా అభిమానులకు మరచిపోలేని విజయాన్ని అందించాడు. తన వీరోచిత ఇన్నింగ్స్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

అంతకు ముందు టాస్ కోల్పోయిన శ్రీలంక బంగ్లా నిర్ణయంతో తొలుత బ్యాటింగ్ చేసింది. ఆదినుంచి దూకుడుగా ఆడిన శ్రీలంక ఓపెనర్లలో దనుషా గుణతిలకా (26;19 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్సర్) దాటిగా ఆడే క్రమంలో తొలి వికెట్‌గా పెవిలియన్ చేరగా, కుశాల్ మెండిస్ (57;30 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లు) బ్యాట్‌ను ఝుళిపించాడు. ఇక ఫస్ట్ డౌన్ ఆటగాడు కుశాల్ పెరీరా (74; 48 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లు) చెలరేగి ఆడాడు. క్రీజ్‌లోకి వచ్చీ రావడంతోనే బౌండరీలతో విరుచుకుపడ్డాడు. ఈ క్రమంలోనే కుశాల్ ద్వయం 85 పరుగులు జోడించింది. అయితే ఓ దశలో 8 పరుగుల వ్యవధిలో షనకా (0), చండిమాల్ (2)లు పెవిలియన్ చేరడంతో శ్రీలంక తడబాటుకు గురైంది. అటు తర్వాత పెరీరాకు జత కలిసిన ఉపుల్ తరంగా సమయోచితంగా ఆడాడు. మరొకవైపు పెరీరా బౌండరీలతో ఎదురుదాడి చేస్తూ లంక బోర్డును పరుగులు పెట్టించాడు. వీరిద్దరూ 55 పరుగులు జోడించిన తర్వాత పెరీరా ఐదో వికెట్‌గా అవుటయ్యాడు. ఇక ఉపుల్ తరంగా (32 నాటౌట్; 15 బంతుల్లో 4 ఫోర్లు, 1 ఫోర్) కడవరకూ క్రీజ్‌లో ఉండటంతో లంక జట్టు నిర్ణీత ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 214 పరుగులు చేసింది. ఫలితంగా అంతర్జాతీయ టీ20ల్లో శ్రీలంక నాల్గో అత్యుత్తమ స్కోరును నమోదు చేసింది. అదే సమయంలో బంగ్లాదేశ్‌పై అత్యధిక టీ 20 స్కోరును సాధించి కొత్త అధ్యాయాన్ని లిఖించింది. బంగ్లాదేశ్ బౌలర్లలో ముస్తాఫిజుర్ రెహ్మాన్ మూడు వికెట్లు సాధించగా, మహ్మదుల్లా రెండు వికెట్లు తీశాడు. తస్కిన్ అహ్మద్‌కు వికెట్ దక్కింది.

ఇప్పటికే లంక, భారత్ జట్లు తలో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నాయి. తాజాగా బంగ్లా కూడా విజయం సాధించడంతో ముక్కోణపు టీ20 సిరీస్ రసవత్తరంగా మారనుంది. సోమవారం భారత్, శ్రీలంక జట్లు తలపడనున్నాయి.

# అజ్లాన్‌షా ఐదో స్థానం

## ఐర్లాండ్‌పై భారత్ ఘన విజయం



ఇఫో(మలేసియా) : ప్రతిష్టాత్మక అజ్లాన్‌షా హాకీ టోర్నమెంట్లో భారత్ బదులు తీర్చుకుంది. శుక్రవారం ఏ జట్టు చేతిలో అయితే ఓడిపోయి పతక ఆశలను ఆవిరి చేసుకుందో శనివారం అదే జట్టుపై గెలిచి ప్రతీకారం తీర్చుకుంది. 2-3తో ఐర్లాండ్ చేతిలో పరాజయం పాలైన భారత్ శనివారం 4-1తో విజయం సాధించింది. టోర్నీలో భాగంగా భారత్-ఐర్లాండ్ మధ్య ఐదు, ఆరు స్థానాల కోసం పోటీ నిర్వహించారు. మొదటి నుంచి దూకుడుగా ఆడిన భారత్ ఐదో నిమిషంలోనూ తొలి గోల్ నమోదు చేసింది. ఆట ముగిసే సమయానికి భారత్ ఖాతాలో 4 గోల్స్ వచ్చి చేరాయి. దీంతో 4-1 తేడాతో విజయం సాధించిన భారత జట్టు ఐదో స్థానంతో సరిపెట్టుకుంది.

# ముంబయి టీ20 లీగ్ నేటి నుంచే




ముంబయి : ముంబయి టీ20 లీగ్ మొదటి సీజన్ నేడు ప్రారంభంకానుంది. ఈ మేరకు నిర్వాహకులు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ లీగ్‌కు మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారు. మాజీ ఆటగాడు సునీల్ గావస్కర్, దిలీప్ వెంగ్‌సర్కార్.. లీగ్ కమిషనర్, చీఫ్ మెంటార్లుగా వ్యవహరిస్తున్నారు. లీగ్‌లోని అన్ని మ్యాచ్‌లు ముంబయిలోని వాంఖడే మైదానంలోనే జరగనున్నాయి. నార్త్ ముంబయి పాంథర్స్-ఆర్కో అంథేరీ, సోబో సూపర్‌సోనిక్స్-ముంబయి నార్త్ ఈస్ట్ నైట్స్ మధ్య తొలి రోజు మ్యాచ్‌లు జరగనున్నాయి. యువ ఆటగాళ్లలోని ప్రతిభను వెలికి తీసేందుకు ఈ లీగ్ నిర్వహిస్తున్నట్లు టోర్నీ నిర్వాహకులు తెలిపారు. రహానె, రోహిత్‌శర్మ లాంటి టీమిండియా ఆటగాళ్లు ఈ టోర్నీలో ఆడుతున్నారు. రోహిత్ ప్రస్తుతం లంక పర్యటనలో ఉన్న నేపథ్యంలో చాలా మ్యాచ్‌లకు దూరమయ్యే అవకాశం కనిపిస్తోంది. ముంబయి పేసర్ ధావల్ కులకర్ణి గాయం కారణంగా లీగ్‌కు దూరమయ్యాడు. ప్రతిరోజూ మధ్యాహ్నం 3.30గంటలకు, రాత్రి 7 గంటలకు మ్యాచ్‌లు ప్రారంభంకానున్నాయి. ఈ నెల 21న ఫైనల్ జరగనుంది.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో శ్రీలంక క్రికెటర్ అరెస్ట్



కొలంబో : తాగి కారు నడపడమే కాకుండా ఇద్దరు యూనివర్సిటీ విద్యార్థులపై దాడికి పాల్పడిన శ్రీలంక క్రికెటర్ రమిత్ రామ్‌బుక్వెల్లాను శ్రీలంక పోలీసులు అరెస్ట్ చేశారు. విద్యార్థులపై దాడి చేసిన తర్వాత కొలంబోని నవాలా రహదారిపై వెళుతున్న సమయంలో రమిత్‌ను అరెస్ట్ చేసిన విషయాన్ని పోలీసులు తెలిపారు. అతన్ని అలుత్‌కేడ్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచనున్నట్లు పోలీస్ అధికారి పేర్కొన్నారు. రమిత్ తాజా వ్యవహారంపై శ్రీలంక క్రికెట్ బోర్డు ఆగ్రహం వ్యక్తం చేసింది. రమిత్‌పై చర్యలు తీసుకుంటామని లంక బోర్డు అధికారి ఒకరు తెలిపారు. ప్రధానంగా శ్రీలంక క్రికెటర్ల కాంట్రాక్ట్ జాబితాలో రమిత్ చోటు కోల్పోయే అవకాశం ఉంది. రెండేళ్ల క్రితం ఒకసారి డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకసారి అరెస్టైన రమిత్..తాజాగా మరో వివాదానికి కారణమయ్యాడు. 2013లో శ్రీలంక జాతీయ జట్టులో అరంగేట్రం చేసిన రమిత్.. 2016 జూలైలో ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో చివరిసారి కనిపించాడు. శ్రీలంక తరవును రెండు టీ 20ల్లో మాత్రమే రమిత్ ప్రాతినిథ్యం వహించాడు.

# వార్నర్‌ను అవమానపరిచారు..!



పోర్ట్ ఎలిజిబెత్ : ఇటీవల ఆస్ట్రేలియా-దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరిగిన తొలి టెస్టు నాల్గో రోజు ఆటలో డేవిడ్ వార్నర్-డీకాక్‌ల మధ్య తారాస్థాయిలో వాగ్వాదం చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఒకానొక సమయంలో సహనం కోల్పోయిన డేవిడ్ వార్నర్.. డీకాక్‌పై దూసుకెళ్లే యత్నం చేశాడు. అయితే సహచర ఆటగాళ్లు వార్నర్‌ను ఆసీస్ డ్రెస్సింగ్ రూమ్‌లోకి తీసుకెళ్లి గొడవను సద్దుమణిచే యత్నం చేశారు. అయితే ఇంత దురుసుగా ప్రవర్తించడానికి తన భార్యను టార్గెట్ చేస్తూ డీకాక్ తిట్టడమేనని వార్నర్ వివరణ కూడా ఇచ్చాడు. అతని ప్రవర్తనకు గాను మ్యాచ్ ఫీజులో 75 శాతం జరిమానా కూడా పడింది. అయితే ఈ వివాదానికి మరోసారి ఆజ్యం పోసేలా వ్యవహరించారు దక్షిణాఫ్రికా క్రికెట్ అధికారులు. ప్రధానంగా వార్నర్‌ను అవమానపరిచేలా వ్యవహరించారు. వార్నర్ భార్య కాండిస్ మాజీ ప్రియుడైన సోనీ బిల్ విలియమ్స్ మాస్క్‌లు ధరించిన సౌతాఫ్రికా అభిమానులతో కలిసి ఆ దేశ క్రికెట్ ఎగ్జిక్యూటివ్‌లు క్లైవ్ ఎక్‌స్టీన్, అల్తాఫ్ ఖాజీలు ఫోటోలకు ఫోజిచ్చారు. ఇదంతా పోర్ట్‌ఎలిజిబెత్‌లో రెండో టెస్టుకు ఆరంభానికి ముందు జరిగింది. ఈ వ్యవహారంలో డేవిడ్ వార్నర్‌కు సీఎస్ఏ క్షమాపణలు తెలియజేసింది. వీరిపై చర్యలు తీసుకునేందుకు నడుంబిగించింది. ఇలా తమ దేశ క్రికెటర్‌ను కించపరిచేందుకు దక్షిణాఫ్రికా క్రికెట్ అధికారులు సహకరించడంపై ఆసీస్ గుర్రుగా ఉంది. గతంలో న్యూజిలాండ్ రగ్బీ ఆటగాడైన సోనీ బిల్ విలియమ్స్-కాండిస్‌లు చాలా కాలం చెట్టాపట్టాలేసుకుని తిరిగారు. అయితే వీరి మధ్య చోటు చేసుకున్న విభేదాల కారణంగా సోనీ బిల్ విలియమ్స్-కాండిస్ ప్రేమాయాణానికి దాదావు పదేళ్ల నాడే ఫుల్‌స్టాప్ పడింది. ఆ తర్వాత ఆసీస్ క్రికెటర్ వార్నర్‌ను కాండిస్ వివాహం చేసుకున్నారు.

## ఇలాంటి కోచ్ ఉండడం అదృష్టం



- కానీ అతను నాకొద్దు
- నాలుగేళ్ల బందానికి బ్రేక్ చెప్పిన షరపోవా

కాలిఫోర్నియా : మాజీ ప్రపంచ నెంబర్ వన్ టెన్నిస్ క్రీడాకారిణి మారియా షరపోవా తన కోచ్ స్వెన్ గ్రోనెవెల్డ్‌తో తెగదెంపులు చేసుకుంది. ఇటీవల జరిగిన ఇండియన్ వెల్స్ టోర్నీ మొదటి రౌండ్‌లోనే షరపోవా పరాజయం చెందడంతో కోచ్‌కు కటీఫ్ చెబుతూ నిర్ణయం తీసుకుంది. దాంతో వారిద్దరి నాలుగు సంవత్సరాల భాగస్వామ్యానికి తెర పడింది. పరస్పర అంగీకారం మేరకే విడి పోతున్నట్టు షరపోవా తెలిపారు. కోచ్ అందించిన సహకారం మర్చి పోలేనిదని, ఆట, కోచింగ్ కంటే తమ మధ్య స్నేహం చాలా విలువైందని ఆమె అన్నారు. అతని పని తీరు, నాపై తనకున్న విశ్వాసం అద్భుతమైందని తెలిపారు. ఇలాంటి పర్యవేక్షకుడు తనకు కోచ్‌గా ఉండటం అదృష్టంగా అభివర్ణించింది షరపోవా. డచ్ దేశానికి చెందిన గ్రోనెవెల్డ్.. 2014లో షరపోవాకు కోచింగ్ బాధ్యతలు తీసుకున్నారు. అదే ఏడాది షరపోవా ఫ్రెంచ్ ఓపెన్ గెలిచింది. మరొకవైపు గ్రోనెవెల్డ్ పర్యవేక్షణలో రెండు టైటిల్స్‌ను షరపోవా గెలిచింది. తామిద్దరం విడిపోతున్న విషయాన్ని కోచ్ స్వెన్ గ్రోనెవెల్డ్ ధ్రువీకరిస్తూ, ఓ అధికారిక ప్రకటన విడుదల చేశారు. తాను ఇప్పటి వరకు కలిసి పనిచేసిన వారిలో అత్యంత కష్టపడే వ్యక్తి షరపోవా అని, ఆమె భవిష్యత్తులో మరింత పోరాట పటిమను కొనసాగించాలని కోరుకుంటున్నానని తెలిపారు. ఓ వ్యక్తిగా, క్రీడాకారిణిగా తన పట్ల నాకు అమితమైన గౌరవం ఉందని అన్నారు. ఈ వారం జరిగిన ఇండియన్ వెల్స్ టోర్నీ మొదటి రౌండ్‌లోనే జపాన్ నంబర్ వన్ నయోమి ఒసాకాపై 6-4, 6-4 తేడాతో ఓడిపోయారు షరపోవా. అంతకుముందు నిషేధం తర్వాత ఈ ఏడాది జనవరిలో జరిగిన ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో పునరాగమనం చేసిన షరపోవా.. మూడో రౌండ్‌లో ఏంజెలిక్ కెర్బెర్ చేతిలో కూడా ఓటమిపాలైంది.

# రెండో టెస్టులో రబడ రగడ

- డెవిడ్ స్మిత్‌తో వాగ్వాదం
- క్రీడాస్ఫూర్తిని మరుస్తున్న ఆటగాళ్లు
- తారాస్థాయికి చేరిన స్లెడ్జింగ్
- రెండు మ్యాచ్‌లు నిషేదం ఎదుర్కోనున్న రబడ!



పోర్ట్ ఎలిజిబెత్ : ఆస్ట్రేలియా-దక్షిణాఫ్రికా మధ్య జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో ఆటగాళ్ల మధ్య స్లెడ్జింగ్ తారస్థాయికి చేరింది. తొలి టెస్టులో వార్నర్, డికాక్‌ల మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా రెండో టెస్టులో కగిసో రబడా-స్మిత్ మధ్య గొడవ చోటుచేసుకుంది. ప్రస్తుతం ఈ గొడవకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. దీంతో రబడపై రెండు మ్యాచ్‌ల నిషేదం పడే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే గతంలో అతిగా ప్రవర్తించడంతో రబడాకు 5 డీమెరిట్ పాయింట్స్ వచ్చాయి. మరో మూడు పాయింట్లు చేరితో ఖచ్చితంగా రెండు మ్యాచ్‌ల నిషేదం ఎదుర్కోనున్నాడు.

***అసలేం జరిగిందంటే..***

రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా కెప్టెన్ స్మిత్ (25) రబడ వేసిన 51.6వ బంతికి ఎల్బీడబ్ల్యూగా అవుటయ్యాడు. అయితే సహనం కోల్పోయిన రబడా స్మిత్‌కు ఎదురుగా వెళ్తూ భుజంతో డీకోట్టి పెవిలియన్ వైపు వెళ్లు అంటూ సూచించాడు. ఇది వివాదానికి దారి తీసింది. ఈ ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని మ్యాచ్ రిఫరీ ప్రకటించాడు. అయితే ఈ మ్యాచ్‌లో రబడ ఐదు వికెట్లతో చెలరేగి ఆసీస్ పతనాన్ని శాసించాడు. రబడపై నిషేదం విదిస్తే దక్షిణాఫ్రికాకు గట్టి ఎదురదెబ్బ తగలనుంది. తొలి టెస్టులో క్రీడాస్ఫూర్తికి విరుద్ధంగా ప్రవర్తించిన వార్నర్, నాథన్ లియోన్‌లకు మ్యాచ్ ఫీజులో కోత విధించారు. డ్రెస్సింగ్ రూంకు వెళ్తుండగా డికాక్‌తో గొడవ పెట్టుకున్న వార్నర్‌కు 75 శాతం మ్యాచ్ ఫీజు కోతతో పాటు మూడు డీమెరిట్ పాయింట్స్ విధించారు. డివిలియర్స్ రనౌట్ అనంతరం అతనిపైకి బాల్ విసిరిన లియోన్‌కు 15 శాతం ఫీజుకోత విధించారు. ఇక ఆటగాళ్ల ప్రవర్తనపై మాజీ ఆటగాళ్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు.ఇది క్రీడాస్ఫూర్తికి విరుద్ధమని అంటున్నారు.

## జడేజా స్థానంలో అశ్విన్!



ముంబయి : రవీంద్ర జడేజా స్థానంలో ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ చోటు దక్కించుకున్నాడు. మార్చి 14 నుంచి 18 వరకు నాగ్‌పూర్‌లో ఇరానీ కప్ జరగనుంది. ఈ నేపథ్యంలో బీసీసీఐ ఇరానీ కప్‌లో ఆడే రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టును ప్రకటించింది. గాయంతో బాధపడుతోన్న జడేజాకు విశ్రాంతిని ఇచ్చి అతని స్థానంలో అశ్విన్‌ను తీసుకున్నట్లు ప్రకటించింది. రంజీ ట్రోఫీ విజేతతో రెస్ట్ ఆఫ్ ఇండియా తలపడనుంది. ఇటీవల ముగిసిన దేవధర్ ట్రోఫీ నుంచి అశ్విన్ చివరి నిమిషంలో గాయం కారణంగా దూరమయ్యాడు. ఇప్పుడు పూర్తిస్థాయి ఫిట్‌నెస్ సంపాదించడంతో తిరిగి జట్టులోకి ఎంపికయ్యాడు. **రెస్ట్ ఆఫ్ ఇండియా :** కరుణ్ అయ్యర్(కెప్టెన్), పృథ్వీ షా, అభిమన్యు ఈశ్వరన్, సమర్థ్, మయాంక్ అగర్వాల్, హనుమాన్ విహారి, కేఎస్ భరత్ (వికెట్ కీపర్), రవిచంద్రన్ అశ్విన్, జయంత్ యాదవ్, నదీం, అన్‌మోల్‌ప్రీత్ సింగ్, సిద్ధార్థ్ కౌల్, అంకిత్ రాజ్‌పుత్, నవ్‌దీప్ సైనీ, సేథ్.

# షమీ నన్ను చాలా హింసించాడు

- ఆయన సోదరుడు అసభ్యంగా ప్రవర్తించాడు
- దానికి షమీ కూడా సహకరించాడు
- క్రికెటర్‌పై సంచలన ఆరోపనలు చేసిన జహాన్



ముంబై : టీమిండియా పేసర్ షమీ వ్యవహారం వూట వూటకు కొత్త మలుపు తిరుగుతోంది. భార్య హసిన్ జహాన్ షమీపై సంచలన ఆరోపణలకు దిగారు. తన సోదరుడితో శృంగారంలో పాల్గొనాలని షమీ తనపై ఒత్తిడి తెచ్చేవాడని హసిన్ చెబుతున్నారు. ఓరోజు హసీబ్ (షమీ సోదరుడు) ఉన్న గదిలోకి షమీ నన్ను తోసేసి గదికి బయట గడి వేశాడు. లోపల హసిబ్ నాతో అసభ్యంగా ప్రవర్తించాడు. అత్యాచారం చెయ్యబోయాడు. నేను గట్టిగా కేకలు వేయటంతో షమీ కంగారుపడి తలువులు తెరిచాడు. అని జహాన్ మీడియాకు తెలిపారు. షమీ కుటుంబ సభ్యులంతా తనపై దాడులకు పాల్పడే వారని ఆమె అంటున్నారు. అంతేకాదు షమీతో జరిపిన ఫోన్ సంభాషణలను కూడా ఆమె మీడియాకు వినిపించారు. అందులో పలు వురు మహిళలతో తనకు సంబంధం ఉన్నట్లు అతని నోటి నుంచే చెప్పటం ఉంది. షమీ వివాహేతర సంబంధాలు బయటపెట్టడం దగ్గరి నుంచి మొదలైన ఈ వ్యవహారం శుక్రవారం ఆమె కోల్‌కతా పోలీసులకు ఫిర్యాదు చేయటంతో రసవత్తరంగా మారింది. గృహ హింస చట్టం ప్రకారం షమీపై కేసు నమోదు అయ్యింది. అత్యా చార యత్నం.. వేధింవులు... వివాహేతర సంబంధాలు తదితర ఆరోపణలు అతనిపై ఉన్నాయి. అయితే హసిన్ ఆరోపణలు చే స్తోందంటూ షమీ కుటుంబ సభ్యులు చెబుతున్నారు.

**షమిపై బీసీసీఐకి ఫిర్యాదు చేస్తా**

ఇప్పటికే బీసీసీఐ కాంట్రాక్టు పోయింది. ఐపీఎల్‌లో ఆడే దానిపై స్పష్టత లేదు. ఇది ప్రస్తుతం టీమిండియా పేసర్ మహమ్మద్ షమి పరిస్థితి. తనను చంపించడానికి ప్రయత్నించిన షమి మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడి ఓ పాకిస్థానీ అమ్మాయి నుంచి డబ్బు తీసుకున్నాడని ఆయన భార్య హసీన్ జహాన్ తెలిపింది. తాజాగా హసీన్.. త్వరలో ముంబయి వెళ్లి బీసీసీఐ ప్రతినిధులను కలుస్తానని, షమిపై ఫిర్యాదు చేస్తానని తెలిపారు. త్వరలో బీసీసీఐ ప్రతినిధులను కలిసి.. షమిపై ఫిర్యాదు చేస్తా. తగిన చర్యలు తీసుకోమని కోరతా. ఈ రోజు నేను ఈ సమస్యను బీసీసీఐ దృష్టికి తీసుకువెళ్లకపోతే భవిష్యత్తులో ఎవరైనా ఇలాంటి ఘటనలకు పాల్పడే అవకాశం ఉంది. అందుకే బీసీసీఐని కలవాలని అనుకుంటున్నా అని హసీన్ తెలిపింది. గత మూడు రోజుల నుంచి వరుసగా హసీన్ చేస్తున్న వ్యాఖ్యల్లో నిజం లేదని అవన్నీ తనపై బుర ద చల్లే ప్రయత్నంలో భాగమని షమి అంటున్నాడు. భార్య ఫి ర్యాదు మేరకు షమితో పాటు మరో నలుగురిపై హత్యాయ త్నం, గృహ హింసతో పాటు పలు సెక్షన్ల కింద జాధవ్‌పూర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైన విషయం తెలిసిందే.

## నా భార్యను తప్పుబట్టను : షమి

### ఆమెను ఎవరో ప్రభావితం చేస్తున్నారు



గత కొన్ని రోజులుగా భారత క్రికెటర్ మహ్మమద్ షమిపై ఆయన భార్య హసీన్ జహాన్ చేసిన ఆరోపణలు తీవ్ర దుమారం రేవుతున్నాయి. తాజాగా ఈ వివాదంపై షమి తొలిసారి స్పందించాడు. ఈ మొత్తం వ్యవహారంపై ప్రజలు నవ్వుకుంటున్నారని వ్యాఖ్యానించాడు. ఈ మొత్తం వ్యవహారం ప్రజా బాహుళ్యంలోకి వెళ్లాక వారంతా నవ్వుకుంటున్నారు. రెండు కుటుంబాలు ఈ వివాదాన్ని పరిష్కరించేందుకు యత్నిస్తున్నాయి. వారందరితో నేను టచ్‌లో ఉన్నా అని చెప్పారు. ఈ వ్యవహారంలో నా భార్యను తప్పుపట్టను. ఆమెను ఎవరో ప్రభావితం చేశారు. ఆమె మనసును కలుషితం చేశారు. గతంలోనూ మేము కొన్ని సార్లు గొడవపడ్డాం. వాటిని పరిష్కరించుకున్నాం కూడా అని వెల్లడించారు. తనను చంపించడానికి ప్రయత్నించిన షమి.. మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడి ఓ పాకిస్థానీ అమ్మాయి నుంచి డబ్బు తీసుకున్నాడని ఆయన భార్య ఆరోపించిన సంగతి తెలిసిందే. మరోవైపు త్వరలో ముంబయి వెళ్లి బీసీసీఐ ప్రతినిధులను కలిసి అతనిపై ఫిర్యాదు కూడా చేస్తానని తెలిపారు. ఇక తాజా వివాదం కారణంగా మహ్మమద్ షమి కెరీర్ చిక్కుల్లో పడింది. బీసీసీఐ ఇప్పటికే కాంట్రాక్టుల జాబితా నుంచి తప్పించింది. అటు ఐపీఎల్ నుంచి తప్పించే అవకాశాలున్నాయని వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం షమి ఐపీఎల్‌లో ఢిల్లీ డేర్ డెవిల్స్ జట్టు తరపున ఆడుతున్నాడు.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2-293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO 22, DOOR NO.8-2- 293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS HYDERABAD-33, TELANGANA. PUBLISHED AT SPR PUBLICATIONS PVT LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2-293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS HYDERABAD-33, TELANGANA. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044.